thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 344 కరీంనగర్ బుధవారం, 19 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కాల్పుల విరమణ ఒప్పందంతో ఆగాజాలో ప్రశాంతత

టెల్అవీవ్ : బాంబింగ్.. షెల్లింగ్.. వైమానిక దాడులతో నామరూపాలు కోల్పోయిన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంతో ప్రశాంతత నెలకొంది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత మొదలైన యుద్ధం ఆదివారానికి 470వ రోజుకు చేరుకుంది. గత ఏడాది కూడా హమాస-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం అమలవ్వగా.. బందీల విడుదలలో ఆలస్యం, పేర్లను వెల్లడించకపోవడం వంటి కారణాలతో యుద్ధం కొనసాగుతూ వచ్చింది. తాజాగా అమెరికా, ఖతార్, ఈజిప్ట్ నెరపిన మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య మరోమారు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దశల వారీగా 33 మంది బందీలను విడుదల చేయడానికి హమాస్.. అందుకు ప్రతిగా తమ దేశ జైళ్లలో ఉన్న 737 మంది పాలస్తీనీయులను విడిచిపెట్టడానికి ఇజ్రాయెల్ అంగీకరించాయి.




# మోడీయా.. మజాకా..!

## సీఎం పేరు ఖరారు కాకుండనే..! ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు...!

# టైమ్, డేట్ ఫిక్స్!!

న్యూఢిల్లీ: దేశంలో ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా.. అందులో బీజేపీ తీరు డిఫరెంట్?గా ఉంటుంది. కమలం పార్టీ వ్యూహాలు, నిర్ణయాలు.. ప్రతిపక్షాలకే కాకుండా సొంత పార్టీ నేతలకు కూడా అంతు చిక్కవు. పార్టీకి సంబంధించిన ఏ చిన్న విషయం కూడా చివరి నిమిషం వరకు లీక్ కాకుండా ప్లాన్ పక్కాగా అమలు చేస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో చోటు చేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. 2024 చివరాకర్లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో సీఎం పదవికి కోసం కూటమిలోని మూడు పార్టీలు పోటీ పడ్డాయి. ఈ అంశాన్ని బీజేపీ హై కమాండ్ చాలా జాగ్రత్తగా డీల్ చేసింది. సీఎం అభ్యర్థి పేరు ప్రకటించకుండానే కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తేదీ, ప్లేస్‌ను ఫిక్స్ చేసింది. ఇది చాలా మందిని విస్మయానికి గురి చేసింది. సీఎం అభ్యర్థి పేరు ఖన్ఫామ్ చేయకుండా ప్రమాణా స్వీకారానికి ఏర్పాట్లు ఏంటి అంటూ చర్చలు సాగాయి. ఈ క్రమంలో ప్రమాణ స్వీకారానికి కొన్ని గంటల ముందు సీఎం అభ్యర్థి పేరును బీజేపీ రివీల్ చేసింది. కూటమిలో విభేదాలు రావొద్దనే ఉద్దేశంతో బీజేపీ ఈ వ్యూహాన్ని ఇంప్లిమెంట్ చేసింది. ఇదిలా ఉండగా.. ఇప్పుడు ఢిల్లీలో కూడా బీజేపీ ఇదే స్ట్రాటజీ అమలు చేస్తోంది. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అధికార ఆమ్ ఆద్మీ పార్టీని చిత్తు చేసి దాదాపు 26 ఏళ్ల తర్వాత దేశ రాజధానిలో బీజేపీ గెలుపు రుచి చూసింది. దీంతో సీఎం అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీ హై కమాండ్ అచీతూచీ వ్యవహరిస్తోంది. ఎన్నికల ఫలితాలు విడుదలై దాదాపు 10 రోజులు గడిచినప్పటికీ సీఎం అభ్యర్థిని ఖరారు చేయలేదు. అన్ని సమీకరణాలను పరిగణలోకి తీసుకుని సీఎం ఎంపికపై కసరత్తు చేస్తోంది. అయితే.. సీఎం ఎవరనేది ఖరారు చేయకుండానే.. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి తేదీ, వేదికను ఫిక్స్ చేసింది. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో 2025, ఫిబ్రవరి 20వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 19న జరగనున్న బీజేపీ ఎల్పీ సమావేశంలో బీజేపీ శాసన సభ నేతను ఎన్నుకుంటారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. 26 ఏళ్ల తర్వాత హస్తినా పీఠం దక్కడంతో సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే రామ్ లీలా మైదానంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర కేంద్రమంత్రులు, బీజేపీ కీలక నేతలు హాజరు కానున్నారు. ఇక, ఢిల్లీ సీఎం రేసులో ప్రముఖంగా ముగ్గురు పేర్లు వినిపిస్తున్నాయి. పర్వేష్ వర్మ, రేఖా గుప్తా, విజేందర్‌ల పేర్లు రేసులో ముందు వరుసలో ఉన్నాయి. అయితే, కేజ్రీవాల్‌ను ఓడించి జైయింట్ కిల్లర్‌గా పేరు గాంచిన పర్వేష్ వర్మకే ఢిల్లీ సీఎం పగ్గాలు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ వరకు బాగానే ఉన్న సీఎం అభ్యర్థి పేరు ప్రకటించకుండానే ప్రమాణ స్వీకారాని డేట్, టైమ్ ఫిక్స్ చేయడంతో.. సీఎం ఎవరనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.




హైదరాబాద్ : కొత్త రేషర్ కార్డులపై స్పీడ్ పెంచింది తెలంగాణ ప్రభుత్వం. ముందుగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డ్స్ ఇవ్వాలని డిసైడ్ అయిన ప్రభుత్వం.. కొత్త రేషన్ కార్డులు ఎలా ఉండాలి.. డిజైన్లు, రేషన్ కార్డులపై ఫ్యామిలీ ఫోటోలు ఉండాలా? వద్దా.. అనే వాటిపై సీఎం రేవంత్ రెడ్డితో అధికారులు చర్చిస్తున్నారు.

ఈ క్రమంలో కొత్త రేషన్ కార్డులను ఏటీఎం కార్డ్ సైజ్ లో స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలుస్తోంది. ఇప్పటికే పలు రేషన్ కార్డ్ డిజైన్లను సీఎంకు చూపించారు అధికారులు. అయితే ముందుగా లక్ష కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం షార్ట్ టెండర్లు పిలిచేందు కు సిద్ధమైంది. ప్రజాపాలన, గ్రామసభలు, మీసేవ, కులగణనలో అ ప్లై చేసుకున్న అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది.

**ముందుగా కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు..** ఎమెల్సీ కోడ్ అమల్లో లేని జిల్లాలో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే.. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే.. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో మాత్రం ఎన్నికల కోడ్ అమల్లో లేదు. సీఎం ఆదేశాలతో ఈ మూడు జిల్లాల్లో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ కానుంది. త్వరగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చి ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పింది ప్రభుత్వం

# 'మహా' చీలిక జరుగుతుందా ? షిండే ఎమ్మెల్యేలకు సెక్యూరిటీ డౌన్!




మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వంలో ఏదో జరుగుతోంది. బీజేపీ, షిండే వర్గం శివసేన, అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలతో కూడిన ఈ సర్కారులో లుకలుకలు మొదలైనట్టు కనిపిస్తోంది. షిండే వర్గం శివసేనకు చెందిన 20 మంది అధికార ఎమ్మెల్యేల వై కేటగిరీ భద్రతను కుదించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని సమాచారం. బీజేపీ, అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలకు కూడా వై కేటగిరీ సెక్యూరిటీని తగ్గించనున్నారు. సెక్యూరిటీ కవర్‌ను కోల్పోనున్న షిండే వర్గం ఎమ్మెల్యేలతో పోలిస్తే.. బీజేపీ, అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలకు చెందిన ఎమ్మెల్యేలు తక్కువ మందికే సెక్యూరిటీ కవర్‌ను తగ్గించనున్నారు. అందుకే ఏక్‌నాథ్‌షిండే గుర్రుగా ఉన్నారు. మహాయుతి కూటమిపై పట్టు కోసం బీజేపీ పాకులాడుతోందని షిండే వర్గం ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. కూటమిలో ఏర్పడిన లుకలుకల వల్లే ఇదంతా జరుగుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయాలు చేసే ఉద్దేశం ఉందా ?** మహారాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వనరుల దుర్వినియోగాన్ని ఆపేందుకే ఈ చర్యలన్నీ చేపడుతున్నామని సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ సర్కారు చెబుతోంది. ఎమ్మెల్యేల సెక్యూరిటీ కోసం భారీగా నిధులను వెచ్చిస్తే, ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఎమ్మెల్యేల సెక్యూరిటీ విషయంలో రాజకీయాలు చేసే ఉద్దేశం తమకు లేదని అంటోంది. అయితే ఈ మాటలను నమ్మేందుకు షిండే వర్గంలోని పలువురు ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరు.

**2022లో అలా మొదలైంది..** 2022 సంవత్సరంలో ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీ నుంచి ఏక్‌నాథ్ షిండే విడిపోయారు. దీంతో ఆనాటి మహా వికాస్ అఘాడి ప్రభుత్వం కూలిపోయింది.

ఆ టైంలో షిండే వర్గంలోకి జంప్ అయిన థాక్రే వర్గం శివసేన ఎమ్మెల్యేలకు భారీ భద్రతను కల్పించారు. నేరుగా కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి ఏక్‌నాథ్ షిండేకు జెడ్ కేటగిరీ భద్రతను కల్పించి, ఫిరాయింపులను ప్రోత్సహించింది. దీంతో మహారాష్ట్రలో అకస్మాత్తుగా మహాయుతి సర్కారు ఏర్పడింది.






# ఇప్పుడు కదా అసలైన ఆట!

## రంగంలోకి గులాబీ బాస్..! ప్రతివ్యూహాలతో కాంగ్రెస్ సిద్ధం..!

## కేసీఆర్ ఎంట్రీతో రంజుగా తెలంగాణ రాజకీయం!!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఫుల్ యాక్టివ్ మోడ్‌లోకి వచ్చేసింది. ఇన్నాళ్లు ఫామ్‌హౌస్‌కే పరిమితం అయినా గులాబీ కేసీఆర్.. ఈనెల 19న తెలంగాణ భవన్‌కు రాబోతున్నారు. హైదరాబాద్ వేదికగా బీఆర్ఎస్ నేతలకు దిశానిర్దేశం చేయబోతున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి ఫిబ్రవరి 19వ తేదీ నాటికి 25 ఏళ్లు పూర్తవుతుంది. పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించే అంశంపైన చర్చిస్తారట. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. కొత్త సర్కార్‌కు ఓ ఏడాది సమయం ఇవ్వాలని కొద్దిరోజులుగా పార్టీ నేతలకు కేసీఆర్ చెబుతూ వస్తున్నారు. అయితే ఇచ్చిన డెడ్‌లైన్ పూర్తి కావడంతో కేసీఆరే రంగంలోకి దిగబోతున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఏడాది కాలంగా కాంగ్రెస్ పాలనపై చర్చిస్తారని సమాచారం. అయితే చాలా రోజుల తర్వాత కేసీఆర్ తొలిసారి తెలంగాణ భవన్‌కు వస్తున్న కేసీఆర్.. ఆ తర్వాత కూడా కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నట్టు సమాచారం. మరోవైపు తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరంతా పార్టీ ఫిరాయించడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఈ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే.. అన్ని సీట్లను గెలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారట. అయితే ఇన్నాళ్లు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని పార్టీ నేతలు నిరుత్సాహ పడుతున్నారు. ఇటీవల ఫామ్‌హౌస్‌లో ఆయన్ను కలిసిన సందర్భంగా ఈ అంశాన్ని పలువురు నేతలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ ఉప ఎన్నికలను ప్రస్తావించారు. తాను త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వచ్చేందుకు రెడీ అయినట్టు వారితో చెప్పారట. ఇదిలా ఉంటే.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కామెంట్స్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. త్వరలోనే రేవంత్‌పై తిరుగుబాటు తప్పదని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎంకు వ్యతిరేకంగా ఒక్కటయ్యారన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించేందుకు చూస్తున్నారని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు.

ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ బుక్ తరహాలో తెలంగాణ పింక్ బుక్ ప్రస్తావన తెచ్చారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసుల పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ నేతల అక్రమ కేసులపూ పింక్ బుక్‌లో అన్ని రాసుకుంటున్నామనీ.. తాము అధికారంలోకి వచ్చాకా లెక్కలు తీస్తామని హెచ్చరించారు. కవిత వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. అయితే ఇలా వరుసగా నేతలంతా హాట్‌కామెంట్స్ చేయడంతో బీఆర్ఎస్ యాక్టివ్ మోడ్‌లోకి వచ్చినట్టయ్యింది.. మొత్తంమీద గులాబీ బాస్ రంగంలోకి దిగుతుండటంతో పార్టీ శ్రేణులు ఖుషీ అవుతున్నారు. అంతేకాదు త్వరలోనే జరిగే రెండు బహిరంగ సభలతో పార్టీకి పూర్వ వైభవం ఖాయమని భావిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు.. గులాబీ బాస్ జనంలోకి వస్తుండటంతో.. అటు కాంగ్రెస్ పార్టీకూడా అలర్ట్ అయ్యినట్టు తెలుస్తోంది. కేసీఆర్‌ను ఎదుర్కొనే విషయంలో ప్రతివ్యూహాలు రచిస్తున్నట్టు సమాచారం.



# కేసీఆర్ 4 కోట్ల ప్రజల హీరో అయితే మరి ఓట్లు ఎందుకు వేయలేదు

కేసీఆర్ 4 కోట్ల ప్రజల హీరో అయితే.. మరి ప్రజలు ఓట్లు ఎందుకు వేయలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా సీఎం ఆసక్తికర కామెంట్స్ చేశారు. కేసీఆర్ త్యాగాలు చేసింది నిజమే.. తెలంగాణ ఉద్యమం నడిపించింది వాస్తవమే.. నాలుగు కోట్ల మంది హీరో అయితే ప్రజలు ఓట్లు ఎందుకు వేయలేదని అన్నారు.

**మీడియా చాట్‌చాట్‌లో రేవంత్ కామెంట్స్:** ప్రభుత్వం 100 శాతం పర్ఫెక్ట్ కులగణన సర్వే చేసింది. అసలు కులగణ మీద.. బీసీల జనాభాపై లెక్క ఎక్కడ ఉంది? దేశంలోనే బీసీ కులగణన చేసింది ఇది మొదటిసారి కదా. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఆఫీసియల్ రికార్డు లేదు.. అసెంబ్లీ లో పెడితే రికార్డు లో ఉండేది. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడు.. కులం, మతం తో సంబంధం ఉండదు. బీసీ రిజర్వేషన్లు 42% అసెంబ్లీ లో పెట్టి పాస్ చేయించి పార్లమెంట్ కు పంపిస్తాం. బీజేపీ బీసీ కులగణకు వ్యతిరేకమని అందరికీ తెలిసిందే. ఉచితాల పై ఒక కఠినమైన చట్టం రావాల్సిందే.. రాష్ట్ర బడ్జెట్ బట్టి పథకాలు ఉండాలి.. ఈ ప్రభుత్వ పాలనా పర్వాలేదు... నువ్వు నేను కోరుకుంటే ఎన్నికలు రావు... ప్రభుత్వం పడిపోతుంది అంటే అది అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని ప్రజలు అనుకుంటారు. ఈ కులం, మతం గురించి ప్రశ్నించుకోవడం మంచిది కాదు.. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు కలిసి వస్తే పార్టీ ల పై, ప్రభుత్వం పై, అభ్యర్థుల పై భారం తగ్గుతుంది. సరైన ధర, కరెంటు ఇవ్వకపోతే ప్రజలు, రైతులే రోడ్డు పైకి వస్తారు. అప్పుడు మనం వెళ్ళి ఆ గుంపులో కూర్చోవాల్సిందే....



# వేములవాడ మహాశివరాత్రి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని అర్చకులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వేములవాడ దేవస్థానం అర్చకులు, అధికారులు సీఎం రేవంత్‌ను కలిశారు. ఈ నేపథ్యంలోనే సీఎంకు మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా, తెలంగాణలో అతిపెద్ద ప్రసిద్ద పుణ్యక్షేత్రం అయిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహా శివరాత్రి జాతర వేడుకలు ఈ నెల 25 నుంచి 27 వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# బోనం ఎత్తుకున్న ఎమ్మెల్సీ కవిత..

చివ్వేంల : పెద్దగట్టు లింగమంతుల స్వామికి ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. మంగళవారం బోనం ఎత్తుకొని లింగమంతుల స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, నోముల భగత్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసుల ముందంజ: సీఎం రేవంత్

హైదరాబాద్: సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యంగా హెచ్ఐసీసీలో నిర్వహించిన 'షీల్డ్ 2025' సదస్సులో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. గతేడాది సైబర్ నేరాల దర్యాప్తు కోసం కొత్తగా 7 పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో చొరబడి మాత్రమే దోపిడీలు చేసేవారు. ఇప్పుడు దొంగలు ఎక్కడో ఉండి.. మన సొమ్ము దొంగిలిస్తున్నారు. నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలి " అని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. "సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది" అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్‌క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. "సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్‌క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం" అని వివరించారు.



# హైకోర్టు ఉలిక్కిపడింది.. వాదిస్తూ కుప్పకూలిన న్యాయవాది..

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో విచారణ సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్ రావు గుండెపోటుకు గురై మృతిచెందారు.

వివరాల్లోకి వెళితే, మంగళవారం నాడు వేణుగోపాల్ రావు హైకోర్టులో తన క్లయింట్ తరపున వాదనలు వినిపిస్తూ ఉన్న సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే సహచర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అతన్ని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, మార్గమధ్యంలోనే మృతిచెందారు. వేణుగోపాల్ రావు అకస్మిక మరణం న్యాయవర్గాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనకు సంతాపంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సహా అన్నిబెంచ్‌ల న్యాయమూర్తులు విచారణలను తాత్కాలికంగా నిలిపివేశారు. అంతేగాక, హైకోర్టు సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ విచారణలను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ల వేణుగోపాల్ రావు మృతిపట్ల న్యాయవాదుల సంఘం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. హైకోర్టు ప్రాంగణంలో ఆయన అంతిమయాత్ర నిర్వహించే అవకాశమున్నట్లు సమాచారం.

**సామాజిక మాధ్యమాల్లో స్పందనలు...** వేణుగోపాల్ రావు మృతిపై పలువురు న్యాయవాదులు, ప్రముఖులు సోషల్ మీడియాలో తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. "న్యాయరంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం" అంటూ నెటిజన్లు భావోద్వేగపూరిత సందేశాలను పోస్ట్ చేస్తున్నారు. ఈ విషాద ఘటన హైకోర్టు వాతావరణాన్ని మౌనంగా మార్చింది. వేణుగోపాల్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రార్థిస్తున్నారు.



# రంజాన్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

హైదరాబాద్: మార్చి 31న రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులు, టీచర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, బోర్డ్స్, కార్పొరేషన్స్, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ మార్చి 3 నుంచి మార్చి 31 వరకూ సాయంత్రం 4 గంటలకే ఆఫీస్?ల నుంచి, స్కూళ్ల నుంచి వెళ్లిపోవచ్చని తెలంగాణ ప్రభుత్వం సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. రంజాన్ మాసంలో అత్యంత నియమనిష్టలతో ఉపవాస దీక్షలతో గడిపే ముస్లింలు రాత్రింబవళ్లూ నమాజ్‌లో లీనమై ఉంటారు. సాధారణంగా ముస్లింలు రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తుంటారు. వీటికి తోడు రంజాన్ నెలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. రాత్రి (ఇషా) ఫర్జ్ నమాజ్ తర్వాత అదనంగా 20 రకాతుల తరావీహ్ నమాజ్ చేస్తారు. ముప్పై రోజుల దీక్షలను మూడు భాగాలుగా విభజించారు. మొదటి10 రోజుల్లో దీక్షలు పాటిస్తే అల్లా కరుణ వర్షాన్ని కురిపిస్తాడని,11 నుంచి 20 రోజులు దీక్షలు పాటిస్తే పాపాలను హరిస్తాడని, 21వ రోజు నుంచి దీక్షలను పూర్తి చేస్తే నరకం నుంచి విముక్తి లభిస్తుందని ముస్లింలు నమ్ముతారు. 21వ రోజు నుంచి చివరి రోజు వరకు ఒక ప్రత్యేకత ఉంది. దీన్ని ఎతేకాఫ్ అంటారు. ఇది ఒక రకమైన తపోనిష్ఠ. దీనిని పాటించాలి అనుకునేవాళ్లు మసీదులోనే ఒక పక్క తెర కట్టుకుని అక్కడే దైవ ధ్యానం, ప్రార్థనలు, ఖురాన్ పారాయణం చేస్తారు. ఎతేకాఫ్‌లో ఉన్నవాళ్లు బలమైన కారణం ఉంటే తప్ప మసీదు వదిలి బయటకు వెళ్లకూడదు. రంజాన్ నెలలో ముస్లింలు ముఖ్యంగా రోజా, సహెర్, ఇఫ్తార్, తరవీహ్, ఏతేకాఫ్, షబ్-ఏ-ఖదర్, లైలతుల్ ఖద్ర్, ఫిత్రా, జకాత్ లాంటివి పాటిస్తారు. నెల రోజులపాటు తమ జీవన శైలిని పూర్తిగా మార్చుకుంటారు. 30 రోజుల ఉపవాస దీక్ష తర్వాత రంజాన్ పండుగ చేసుకుంటారు. ఉపవాసంతో పాటు దైవారాధన, దానధర్మాలు చేస్తారు. ఉపవాస దీక్ష మనిషిలో త్యాగం, కరుణ, సానుభూతి, ప్రేమను పెంచుతుంది. ఉపవాసం చేసేటప్పుడు అబద్ధం చెప్పకూడదు. అన్యాయం చేయకూడదు.


# సిద్దిపేటపై కవిత ఫోకస్? పెద్ద ప్లానే!




సిద్దిపేట : బీఆర్ఎస్ పార్టీ రాజకీయాలు ఎవరికీ అంతుపట్టడం లేదని టాక్. మీడియా ముందు కలివిడి మాటలు.. ఆ తర్వాత పట్టింపులు ఇది బీఆర్ఎస్ లీడర్స్ తీరంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇలాంటి పరిస్థితులతోనే బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో ఊహించని షాక్ తగిలిందని, మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తోందని ప్రచారం సాగుతోంది. అందుకు కారణం ఇటీవల ఎమ్మెల్సీ కవిత, సిద్దిపేటపై ఫోకస్ చేయడమేనట. కవిత సిద్దిపేటపై దృష్టి సారించగా, హరీష్ రావు అభిమానులు మాత్రం ఏ క్యాహై అంటూ.. నిట్టూరుస్తున్నారట. ఇంతకు కవిత నెక్ట్స్ ప్లాన్ ఏంటన్నది ఎవరికీ అంతుబట్టడం లేదని ప్రచారం సాగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత జైలు నుండి బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజులు పార్టీ స్థితిగతులు అంచనా వేసిన కవిత, ఆ తర్వాత స్పీడ్ పెంచారు. కవితకు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ లో స్పెషల్ క్రేజ్ ఉంది. పార్టీ క్యాడర్ కూడా ఆమెకిచ్చే గౌరవంలో ఏమాత్రం తక్కువ చేయరు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడంలో ఎవరైనా కవిత తర్వాతే అంటారు పార్టీ క్యాడర్. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను బట్టి కవిత.. కాస్త బీఆర్ఎస్ అధినాయకత్వానికి భిన్నంగా నడుచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పలు విషయాలతో విభేదిస్తూ.. తన పని తాను కవిత చేసుకుపోతున్నారట. ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేసినప్పటికీ కవిత మాత్రం సభలో ఉండిపోయారు. అంతేకాదు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్ పాల్గొనలేదు. కవిత మాత్రం సర్వేలో పాల్గొని తన వివరాలు అందజేశారు. దీనితో మంత్రులు కూడా కవిత సర్వేలో పాల్గొంది.. మీకేమైంది అంటూ కేటీఆర్, కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఇలా కొన్ని అంశాలలో కవిత తనకంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. తనకు ఉన్న ఇమేజ్ ను పెంచుకుంటూ పోతున్నారని టాక్. కాగా ఇటీవల సిద్దిపేటపై కవిత ఫోకస్ పెట్టారని బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. సిద్దిపేట నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. హరీష్ స్వయాన వరుసకు కవితకు బావ అవుతారు. కేసీఆర్ కుటుంబానికి సమీప బంధువైన హరీష్ రావుకు, కేటీఆర్, కవితలకు మనస్పర్థలు ఉన్నాయని పలుమార్లు వదంతులు వ్యాపించాయి. ఇలాంటి తరుణంలో కవిత ఇటీవల స్పీడ్ పెంచి ఎక్కువగా సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీలో తనకంటూ బ్రాండ్ ఇమేజ్ ఉన్న కవిత కన్ను సిద్దిపేటపై పడిందని, రానున్న ఎన్నికల్లో కవిత పోటీ ఇక్కడి నుండే అంటూ ప్రచారం సాగుతోంది. అలాగే జగిత్యాల నుండి పోటీ చేస్తారని కూడా మరో ప్రచారం సాగుతోంది. కానీ హరీష్ రావుకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే సిద్దిపేటలో కవిత తరచూ పర్యటిస్తున్నారని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే రూట్ వేస్తున్నట్లు కొందరి అభిప్రాయం.

అదే నిజమైతే హరీష్ రావు నెక్స్ట్ పోటీ ఎక్కడి నుండి సాగుతుందనే కోణంలో కూడా చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద మీడియా ముందు మేమంతా ఒకటే అనే నినాదం అంటూ వీరు ప్రచారం సాగిస్తున్నప్పటికీ, విభేదాలు ఉన్నాయ్.. అందుకే సిద్దిపేటపై కవిత ఫోకస్ అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ప్రచారంలో ఎంత మేరకు వాస్తవం ఉందో కానీ, మొత్తం మీద కవిత దెబ్బకు హరీష్ రావు అనుచరులు ఏ క్యాహై అనేస్తున్నారట.

# ఎస్సీ వర్గీకరణకు కమిషన్ కాలపరిమితి పెంపు



హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణకు కాలపరిమితిని తెలంగాణ ప్రభుత్వం మరో నెల రోజులు పొడిస్తూ రాష్ట్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 10తో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ గడువు ముగియగా, మార్చి 10 వరకు పొడిగించింది. దీంతో ఎస్సీ వర్గీకరణపై రేవంత్ ప్రభుత్వం మరేమైనా నిర్ణయాలు తీసుకుంటుందా అనేది సర్వాత్ర ఉత్కంఠ రేపుతుంది. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో మందకృష్ణ సమావేశం అయ్యారు . ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఎస్సీ వర్గీకరణను ఏ,బీ,సీలుగా వర్గీకరణ చేసింది. దీనివల్ల కొన్ని కులాలకు అన్యాయం జరుగుతోంది. ఎస్సీలలో అత్యధికంగా మాదిగలు ఉన్నారు. ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం ఆమోదించిన నివేదికలో లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ డిమాండ్ చేసింది. కొన్ని కులాలు జనాభా లేక పోయినా వారిని మొదటి గ్రూప్‌లో ఒక శాతం రిజర్వేషన్ల ఇచ్చారు. వెనకబడిన మాదిగ కులానికి రిజర్వేషన్లు అన్యాయం జరిగిందని. ఎక్కువ జనాభా ఉన్న నేతకానీలను మాలలు ఉన్న సి గ్రూప్ లో వేయడంతో వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలే మాలలతోని తట్టుకోలేక పోయారు పేర్కొన్నారు. ఎక్కువ జనాభా ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన 'ఏ' గ్రూపులో వేశారు. అధిక జనాభా ఉన్న మాదిగలకు గ్రూప్ %దీ% లో 9 శాతం రిజర్వేషన్ల ఇచ్చారు. దాన్ని 11 శాతానికి పెంచాలని సీఎంను మందకృష్ణ కోరాడు . అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్ కేటాయించారని. గతంలో బి అండ్ సి గ్రూప్ లో ఉన్న మన్నే కొలుపులవాండ్లు పంబాడ, పంబాల, పంపండ కులాలను గ్రూప్ సి లో ఉంచాలి. ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు.

# బీసీల జనాభా ఎందుకు తగ్గిందో రేవంత్ చెప్పాలి: ఈటల రాజేందర్

హైదరాబాద్: రాష్ట్రాల వారీగా కులగణనకు భాజపా అనుకూలమని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఎందుకు తగ్గిందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈటల మీడియాతో మాట్లాడారు. "కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీగానే నిధులు ఇచ్చింది. రామగుండం ఎరువుల పరిశ్రమకు రూ. 6,300 కోట్లు మంజూరు చేసింది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోంది. మేడిన్ ఇండియాకు ప్రాధాన్యం ఇస్తోంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రూ.వేలకోట్ల రుణాలు మంజూరు చేస్తోంది. బయ్యారంలో రాష్ట్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయొచ్చు కదా?ప్రజలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే పరిశ్రమ పెట్టొచ్చు కదా?" అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.



# స్థానిక సమస్యల పరిష్కారం... పంచాయితీ రాజ్ లక్ష్యం

## - ఫిబ్రవరి 19...పంచాయితీ రాజ్ పిత బల్వంతరాయ్ మెహతా జయంతి సందర్భంగా



భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయితీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయ తీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థలవ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగు ణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించా రు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయితీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19 – 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్దోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవిత శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా... "బల్వంతరాయ్ మెహతా కమిటీ" సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమం ద్వారా మెహతా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానాన్ని అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసింప బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కార్యక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 – అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయా భివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో – జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో – పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అంగ రంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

## ఫిబ్రవరి 19 తేదీ నుండి మార్చి 1 వరకు





తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదలీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178–1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 19న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్రానికి రానున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 26వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు చిత్రసీమ బామ్మ నిర్మలమ్మ - ఫిబ్రవరి 19...నిర్మలమ్మ వర్ధంతి



వృద్ధ పాత్రలలో జీవం పోసిన నిర్మలమ్మ తెలియని తెలుగు సినీ ప్రేక్షకులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో.. సినిమాల్లో ఆమెను చూడగానే మమతానురాగాలకు ప్రతిరూపమైన తల్లిగా, అమ్మమ్మగా, బామ్మగా, ఇంటికి పెద్ద దిక్కుగా, అందరికీ ఆత్మీయురాలిగా అనిపిస్తుంది. నిర్మలమైన, కరుణతో నిండిన స్త్రీమూర్తి ఆమెలో కనిపిస్తుంది. అలాంటి అరుదైన విశిష్టతను చేకూర్చుకున్న నటీమణి నిర్మలమ్మ. నిర్మల నటించిన తొలి నాటకం ప్రేమలీల', పద హారేళ్ల వయసులో నిర్మల అభిరుచికి తగ్గట్టుగా సక్కుబాయి' నాటకంలో నటించే అవకాశం వచ్చింది. తర్వాత పలు నాటకాల్లో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించి పలువురి ప్రశంసలు పొంద గలిగింది. రంగస్థలం మీద కేవలం నటించడమే కాకుండా శాస్త్రీయ సంగీతాన్ని సైతం రాగయుక్తంగా ఆలపించేవారు. 'ఆకలి' నాటకంలో బిచ్చగత్తె పాత్రను సహజశైలిలో ధరించినందుకు తన కళ్లు చెమ్మగిల్లాయని ప్రముఖ హిందీ నటుడు పృథ్వీ, రాజ్ కపూర్ సభాముఖంగా ఆశీర్వదించడం మరిచి పోలేని మధురానుభూతిగా నిర్మల జ్ఞప్తికి తెచ్చుకునే వారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగ' నాటకంలో గిరిజ పాత్ర అపూర్వంగా ధరించావని అభినందించారాయన. రంగస్థలం నుంచి ఆకాశవాణి విజయవాడ కేంద్రంలోను, అనేక నాటకసంస్థల్లోను, సొంతంగా ఏర్పాటు చేసిన ఉదయిని అండ్ రాఘవ కేంద్రంద్వారా నిర్మల పలు నాటకాలను ప్రదర్శించారు. వాటిలో 'ఆకలి', 'ఆత్మవంచన', 'కరువు రోజులు 'చింతామణి', 'కన్యాశుల్కం', 'ఏకవీర', 'వేయిపడగలు' ఎన్నో ఉన్నాయి. రంగస్థలం మీద ఆకాశవాణి లోను ఆమెతో నటించిన వారిలో రామచంద్ర కాశ్యప్, కె.వి.ఎస్.కర్మ, రామన్న పంతులు, కె.విశ్వనాథ్, కె.వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులందరు ఉ న్నారు. ఇక 1948లో జరిగింది. ప్రతిభ సంస్థ ఘంటసాల బల రామయ్య స్వీయ దర్శకత్వంలో 'నిర్మించిన 'గరుడ గర్వభంగం' చిత్రంతో ఆమె తొలి సారి కెమెరా ముందు నిల్చున్నారు. అప్పుడు ఆ చిత్రానికి లభించిన పారితోషికం 500రూపాయలు. ఆమె తొలి చిత్రం నుంచి వెనుతిరిగింది లేనే లేదు. సినీనటి నిర్మలమ్మ తెలుగు చిత్రసీమలో బామ్మ పాత్రలకు ప్రాణం పోసిన సహజనటి. నిర్మలమ్మ వందలాది తెలుగు చిత్రాలలో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా అనేక పాత్రలలో నటించిన ఆమె సహజ నటిగా గుర్తింపు పొందారు. నిర్మలమ్మ అసలు పేరు రాజమణి. స్వస్థలం కృష్ణా జిల్లా బందరు. చిన్ననాటి నుంచి నాటకాలంటే ఆమెకు ప్రాణం. ఆదే ఆమె సినీరంగ ప్రవేశానికి ద్వారాలు తెరిచింది. 1943లో తన పదహారేళ్ల వయసులో గరుడ గర్వభంగం సినిమాలో చెలికత్తె పాత్రలో తొలిసారి నటించారు. ఆ తరువాత సుమారు వెయ్యి సినిమాల్లో నటించారు. మూడు తరాలకు చెందిన నటులతో ఆమె నటించిన రికార్డు ఉంది. తన కన్నా పెద్దవారైన నాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, యస్వీ రంగారావు ల నుంచి నేటి చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ వరకు ఎందరో హీరోలకు బామ్మగా, అమ్మగా నటించారు. నిర్మలమ్మకు పందొమ్మిదేళ్ళ వయసులో జీవీ కృష్ణారావుతో వివాహం జరిగింది. ఈయన ప్రొడక్షన్ మేనేజర్ గా పని చేసేవాడు. ఆమె దత్త పుత్రిక పేరు కవిత. అల్లుడు డి.యస్. ప్రసాద్. కాకినాడలో కరువు రోజులు అనే నాటకం చూసిన అలనాటి బాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ కపూర్ నిర్మలమ్మను గొప్ప నటివవుతావని చెప్పాడు. ఈ సంఘటనను నిర్మలమ్మ చాలా సందర్భాల్లో గుర్తు చేసుకునేది. నిర్మలమ్మ ఆడపెత్తనంలో హీరోయిన్ గా చేయాల్సింది. కానీ అది కుదర్లేదు. తర్వాత ఆమె గరుడ గర్వభంగంలో హీరోయిన్ గా చేసింది కానీ అంతగా ప్రాచుర్యం పొందలేదు. కానీ ఆమెకు నటిగా పేరు తెచ్చింది మాత్రం మనుషులు మారాలి అనే చిత్రం. ఆ సినిమా శతదినోత్సవాలకు వెళ్ళిన హిందీ నటుడు ప్రాణ్. నువ్వు శోభన్ బాబుకే అమ్మ కాదు. భారత్ కీ మా! అని అన్నాడు. అప్పట్లో ఆయనతో నాలుగు ముక్కలు హిందీలో మాట్లాడలేక పోయానని ఆమె విచారిస్తుండేది. ఏక వీర నాటకంలో గిరిక పాత్రను వేసిన నిర్మలమ్మను చూసిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ... "పిచ్చిమొద్దూ! నీలో ఇంత నటన ఉందని అనుకోలేదు" అంటే అమాయకంగా నవ్విందట నిర్మలమ్మ. శంకరాభరణం, యమగోల, పదహారేళ్ల వయసు, మావిచిగురు, గ్యాంగ్ లీడర్, శుభసంకల్పం, ఆపద్బాంధవుడు, స్వాతిముత్యం తదితర చిత్రాల్లో వయసు మీద పడినా ఓపికతో నటించిన ఆమె అనంతరం ఆరోగ్య కారణాలతో నటన విరమించు కున్నారు. స్నేహం కోసం చిత్రం తరువాత ఆమె దాదాపు నటించటం మానేశారు. ఎస్వీ కృష్ణారెడ్డి బలవంతం మీద ఆమెను చివరి చిత్రం ప్రేమకు ఆహ్వానంలో నటించడానికి ఒప్పించాడు. మయూరి, సీతారామరాజు సినిమాలకు నంది అవార్డులను అందుకున్నారు. "షూటింగ్ విరామ సమయంలో మమ్మల్ని తల్లిలా ఆదరించేది. అందకూ మేమందరం ఆమెను ఆప్యాయంగా నిర్మలమ్మ (నిర్మలంఅమ్మ) అని పిలుచుకునే వాళ్ళం". అని అక్కినేని నాగేశ్వరరావు తరుచుగా చెప్పేవారు. ఆరోగ్యం విషమించి హైదరాబాదులో 19 ఫిబ్రవరి, 2009 రోజున మృతిచెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మనోళ్ల బంగారం కొనే ట్రెండ్ క్రాక్ చేసిన తాజా రిపోర్టు!



బంగారం మొదలు బిస్కెట్ పాకెట్ వరకు. స్మార్ట్ ఫోన్ నుంచి శారీ వరకు.. కొనే వస్తువు ఏదైనా భారతీయ మధ్యకుటుంబాల లెక్కను కళ్లకు కట్టినట్లుగా చూపించిందో రిపోర్టు. దేశీయ మధ్యతరగతి ప్రజల కొనుగోళ్ల మీద పరిశోధన చేసిన సంస్థ ఒకటి.. తాము గుర్తించిన విషయాల్ని వెల్లడించింది. ఈ వివరాల్ని చూసినప్పుడు సర్ పరై అవ్వాల్సిందే. కారణం.. ఓవైపు ప్రీమియం వస్తువుల్ని ఎడాపెడా కొనేస్తూ.. రోజువారీగా వినియోగించేకొన్ని వస్తువుల విషయంలో వారి లెక్కల్లోని వేరియేషన్స్ కు దిమ్మ తిరిగిపోవాల్సిందే. సదరు రిపోర్టు పేర్కొన్న అంశాల్ని చూస్తే.. టీవీలు.. ఫ్రిజ్ లు.. వాషింగ్ మెషీన్లు.. స్మార్టు ఫోన్లు లాంటి వాటిని కొనే విషయంలో ప్రీమియం ఉత్పత్తుల్ని కొనేందుకు అస్సలు వెనుకాడటంలేదు. అయితే.. ఇక్కడో ట్విస్టు ఉంది. ప్రీమియం వస్తువుల్ని కొనుగోలు చేసే వారిలో అత్యధికులు నెలవారీ వాయిదాల పద్ధతినే ఫాలో అవుతున్నారు. అలా అయితే.. తేలిగ్గా రుణాల్ని తీర్చేస్తామన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రోజువారీగా వినియోగించే సబ్బులు..స్నాక్స్.. బిస్కెట్లు.. టీ.. కాఫీ పొడి లాంటి వాటిని మాత్రం చిన్న పాకెట్లను కొనుగోలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఖరీదైన గృహోపకరణాలను ఈవీఎం పద్ధతిన కొనుగోలు చేయటం కొన్నేళ్లుగా నడుస్తున్నా.. ఇప్పుడు మరింత పెరిగినట్లుగా నివేదిక వెల్లడించింది. గతంలో తమ స్థాయికి తగ్గ బడ్జెట్లలో వస్తువుల్ని కొనుగోలు చేసేవారని.. ఇప్పుడు అందుకు భిన్నమైన ధోరణి ఉన్నట్లుగా చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్ని కొనుగోలు చేసే వేళలో.. కొనుగోలు తర్వాత సేవలు ఏ విధంగా ఉంటున్నాయి? అన్న దానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు రిపోర్టు తెలిపింది. ఈవీఎంలపై కొనుగోళ్లు ఐదేళ్ల క్రితం 55–60శాతం ఉంటే.. ప్రస్తుతం 75 శాతానికి పైనే పెరిగినట్లుగా పేర్కొన్నారు. సులువుగా రుణ సదుపాయం.. జీరో కాస్ట్ ఈఎంఐ కూడా ఖరీదైన వస్తువుల్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. బంగారం ధర అంతకంతకూ పెరిగిపోతున్న వేళ.. ఆభరణాల కొనుగోలు విషయంలో కొత్త ధోరణి పెరిగినట్లుగా చెబుతునారు. నెల వారీగా డబ్బులు కట్టి.. పన్నెండు నెలల తర్వాత పోగైన మొత్తంతో బంగారు ఆభరణాల్ని కొనుగోలు చేసే ధోరణి ఎక్కువైనట్లుగా తెలిపింది. దీనికి సంబంధించి పలు పథకాలు ఉండటంతో ఆ తరహా కొనుగోళ్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా రిపోర్టు వెల్లడించింది. మొత్తంగా చూస్తే..ఓవైపు ఖరీదైన వస్తువుల్ని కొనుగోలు విషయంలో తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తూనే.. మరోవైపు రోజువారీ వస్తువుల విషయంలో ఆచితూచి అన్నట్లు కొనుగోళ్లు చేయటం ఆసక్తికరంగా మారింది.

# చురకలు

## సంపాదకీయం

### కేసీఆర్ అంటే యునానిమస్...ఇది చాలదా ?

కె చంద్రశేఖరరావు షార్ట్ కట్ లో కేసీఆర్ దశాబ్దాలుగా తెలుగు నాట రాజకీయ తెర పైన తన ప్రత్యేకతను నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆయన 1981 లోనే రాజకీయ అరంగేట్రం చేశారు. మొదట యువజన కాంగ్రెస్ నేతగా ఉండేవారు. ఆ తరువాత 1982లో తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ పెట్టడంలో అందులో చేరి 1983లో టికెట్ సాధించి సిద్దిపేట నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆనాటికి ఆయన వయసు 29 ఏళ్ళు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలు అయ్యారు. అయితే 1985లో మొదటిసారి గెలిచి అసెంబ్లీకి వెళ్ళారు. అలా 1989, 1994, 1999ల లో ఏకంగా నాలుగు సార్లు ఇరవై ఏళ్ళ పాట్లు సిద్ధిపేటను ఏలారు. చంద్రబాబు సీఎం గా ఉండగా రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో ఆయనకు మంత్రి పదవి దక్కలేదు ఉప సభాపతి హోదా లభించింది. అది కాస్తా అసంతృప్తిగా మారి 2000లో ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చారు. 2021లో టీఆర్ఎస్ అన్న పార్టీని పెట్టారు. ఇక అక్కడ నుంచి కేసీఆర్‌లో ఉద్యమకారుడు బయటకు వచ్చారు. ఆయన పద్నాలుగేళ్ళ పాటు చేసిన పోరాటానికి ఫలితంగా తెలంగాణా రాష్ట్రం వచ్చింది. రెండు సార్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తెలంగాణాను కొట్లాడి తీసుకుని వచ్చిన నేతగా ప్రసిద్ధం అయ్యారు. ఇక 2004 నుంచి 2014 మధ్యలో కేసీఆర్ కేంద్రంలో మంత్రిగా కొన్నాళ్ళు పనిచేశారు. ఇలా ఆయన రాజకీయ జీవితం పరిపూణంగానే సాగింది. ఇక కేసీఆర్ తాజా పుట్టిన రోజుతో 71 ఏళ్ళు నిండి 72వ ఏట అడుగుపెడుతున్నారు. మరో మూడేళ్ళలో తెలంగాణాకు ఎన్నికలు ఉన్నాయి. మరోసారి బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ 75 ఏళ్ళ వయసులో అచ్చం చంద్రబాబు మాదిరిగానే మూడవసారి సీఎం అవుతారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే కేసీఆర్ ని రాజకీయంగా ఎంతలా విభేదించినా ఆయనతో స్నేహాన్ని అనుబంధాన్ని అంతా కోరుకుంటారు. ఆయనకు అందరూ ఇష్టులే ఉన్నారు. ఇక ఉమ్మడి ఏపీని విడదీసి తెలంగాణాను సాధించినా ఏపీలో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. కేసీఆర్ కి ఏపీ రాజకీయ నాయకత్వాలు కూడా అంతా యునానిమస్ గా గ్రీట్ చేస్తారు. ఆయన పుట్టిన రోజున ఏపీలోని కూటమి పార్టీల పెద్దలతో పాటు వైఎస్సార్ నుంచి కూడా గ్రీటింగ్స్ రావడం విశేషం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. వైసీపీ అధినేత జగన్ కూడా కేసీఆర్ కి గ్రీట్ చేస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు. దీనిని చూసిన వారు అంతా ఏపీలో యునానిమస్ గా కేసీఆర్ కి గ్రీటింగ్స్ దక్కాయని అంటున్నారు. కేసీఆర్ విషయంలో అంతా ఏకాభిప్రాయంతోనే ఉన్నారని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేసీఆర్ సహచరుడు. ఆయన మంత్రివర్గంలో పనిచేసిన వారు. టీడీపీలో 18 ఏళ్ళకు పైగా ఉన్నారు. అలాగే పవన్ కళ్యాణ్ కి కేసీఆర్ ఉద్యమ శైలి, ఆయన ఉక్కు సంకల్పం అన్నా గౌరవం అని చెబుతారు. జగన్ విషయానికి వస్తే ఆయనకు కేసీఆర్ స్నేహితుడుగా శ్రేయోభిలాషిగా ఉంటారని అంటారు. మొత్తానికి ఏపీలో అధికార విపక్షాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకున్నా కేసీఆర్ విషయంలో మాత్రం అంతా ఒక్క తీరుగా ఉండడం ఒకింత ఆశ్చర్యకరంగా ఆసక్తికరంగా ఉంది అనే చెప్పాలి.

## తొలి మహిళా కార్టూనిస్టు రాగతి పండరి - ఫిబ్రవరి 19... రాగతి పండరి వర్ధంతి



రాగతి పండరి పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి నవ్వు తెప్పించే కార్టూన్లే. ఆమె పేరు తెలియని సాహి త్య అభిమానులు ఉండరం టే అతిశయోక్తి కాదేమో. వ్యంగ్య చిత్రాలతో నవ్వించాలనే లక్ష్యంతో అన్ని అడ్డంకులను అధిగమించి జీవిత ఆశయం నెరవేరుకున్న అపురూప కళాకారిణి. సామాజిక అంశాలను ప్రతిబింబించే కార్టూన్లు గీస్తూ మన్ననలు, పురస్కారాలూ అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరి. విధి వంచితయై, నాలుగ డుగులు వేసి చుట్టూ ఉన్న ప్రపం చంలో స్వేచ్ఛగా తిరిగే భాగ్యానికి నోచుకోక పోయినా అన్నింటిని అవగాహన చేసుకొని హాస్యంలో రంగరించి లక్ష్యాన్ని చేరుకున్న ఘనత, అసమాన ప్రతిభ ఆమెకే సొంతం. రాగతి పండరి (జూలై 22, 1965 – 19 ఫిబ్రవరి, 2015) తెలుగు వ్యంగ్య చిత్రకారులలో రాశి లోనూ, వాసి లోనూ సమానమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు. అంతే కాదు, అనతి కాలంలోనే తెలుగు వ్యంగ్య చిత్ర కళా రంగంలో ఎనలేని పేరు తెచ్చుకుని, ఆ రంగంలో అగ్రగణ్యు లైన బాపు, జయదేవ్ ల సరసన నిలబడ గలిగిన స్థాయి చేరుకున్న గొప్పతనం ఆమెది. ఆ గొప్పతనం వెనక అకుంఠిత దీక్ష, అంకిత భావంతో కృషి, వ్యంగ్య చిత్ర కళ మీద ఎనలేని ప్రేమ, నిరంతర పరిశ్రమ ఉన్నాయి. దురదృష్ట వశాత్తూ, ఆమెకు చిన్నతంలో వచ్చిన పోలియో మూలంగా శారీరకంగా బలహీను రాలైనా, ఆ బలహీ నతను అధిగమించి, మానసిక ఒత్తి డిని అతిక్రమించి, తనకు ఇష్టమైన కళకే అంకితమై, కార్టూన్లు గీసి అందరి మన్ననలు పొందారు. ఆమె కార్టూనులో ఏ మూల వెదికినా తేట తెలుగు దనమే, ఏ చోట స్పృశిం చినా తేనెల తెలుగు మాటలే దర్శనం ఇస్తాయి. పండగలు, పబ్బా లు, అల్లుళ్ళు, ఆడ పడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులూ, ఆమె తాకని విషయం లేదు, లాగని తీగ లేదు, నడవని డొంక లేదు. తెలుగు వ్యంగ్య చిత్ర రంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారా వాహికలు వార పత్రికలలో నిర్వ హించిన ఘనత ఆమెదే. పన్నెండు వేలకు పైగా కార్టూన్లు వేసిన ఏకైక మహిళగా ఆమె గుర్తింపు పొందారు. రాగతి పండరి 1965 సంవత్సరం జూలై 22 న విశాఖ పట్టణంలో రాగతి గోవిందరావు, శాంతకుమారి దంపతులకు జన్మించారు. చదువు ఇంటి వద్దనే కొనసాగింది. అతి చిన్న వయసులోనే పోలియో వచ్చి, శారీరక లోపం ఏర్పడినా, పట్టు దల, ధైర్యం కలిగి జీవితాన్ని ఆత్మ విశ్వాసంతో, కఠోర పరిశ్రమతో ఎదుర్కొని, కార్టూన్ రంగంలో అగ్రగణ్యుల సరసన చేరారు. ఆమె తన వ్యంగ్య చిత్ర ప్రస్థానాన్ని 1973లో తన 8వ ఏటనే మొదలు పెట్టారు. బాల్యంలోనే వ్యంగ్య చిత్రాలు ప్రచురణ ప్రారంభ మయ్యింది. 1980–1990 దశకాల మధ్య కొన్ని వేల వ్యంగ్య చిత్రాలను శరపరం పరగా చిత్రించారు. పాఠకుల మనసులను దోచుకున్నారు. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలో ఈమె కార్టూన్లు ప్రచురించ బడ్డా యి. పండుగల సందర్భాలలో పత్రికల సంపాదకులు ఆమె కార్టూన్లను కోరుకుని, అడిగి తెప్పించుకుని తమతమ పత్రికలలో ప్రచురించేవారు. రాగతి పండరి ఆలోచన వచ్చిందే తడవుగా కాగితంపై పెన్సిల్‌తో గీతలు కూడా గీసు కోకుండా నేరు గా స్కెచ్ పెన్నుతోనే కార్టూన్ వేసే వారు. ఆ క్రమంలో ఐదు పది నిమి షాల స్వల్ప వ్యవధి లోనే కార్టూన్ గీసే విభిన్నమైన శైలి ఆమెది. జయదేవ్ గురువుగా భావించి ఆయన శైలిలో కొద్దిరోజుల పాటు కార్టూన్లు వేసినా, వేగంగా తనదం టూ ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరు చుకుని ఆమె గీత చూడగానే గుర్తుపట్టేలా శైలిని ఏర్పరుచుకున్నారు. రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్యగానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు. కుదురైన చక్కటి చిత్రీకరణ, గుండ్రటి చేతివ్రాత, తేట తెలుగులో సంభాషణలు ఆమె వ్యంగ్య చిత్రాల ప్రత్యేకత. తెలుగు వ్యంగ్య చిత్రరంగంలో అనేక వ్యంగ్య చిత్ర ధారావాహికలు వార పత్రికల లో నిర్వహించిన ఘనత ఆమెది. సమకాలీన వ్యంగ్య చిత్రాకారు లలో, వార్తా పత్రికలలో పనిచేస్తూ ఉన్న కార్టూనిస్ట్‌లను మినహాయిస్తే, రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసే ఏకైక ఫ్రీలాన్స్ కార్టూనిస్టు ఆమె. 'రాజకీయ చెదరంగం' అన్న పేరుతో ఒక దశాబ్దం పైగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురించబడటం తనకెంతో ఆనందం కలిగించిందని ఆమె చెపుతుండే వారు. ఆమె వ్యంగ్య చిత్రాలు హాస్యం ప్రధానం గా, ఆకర్షణీయంగా ఉండి, మానవ ప్రవృత్తిలో ఉన్న ద్వంద్వ అలోచానా విధానం, సాఘిక దురాచారాల పట్ల విమర్శల తో కూడి పాఠకులను నవ్వులలో ముంచెత్తటమే కాకుం డా, ఆలోచించటానికి కూడా ఉద్యు క్తులను చేస్తాయి. 2001 సంవత్సరం ఉగాది పురస్కారం ఆంధ్ర ప్రదేశ్ అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. రాగతి పండరి కార్టూన్ సామ్రా జ్యాన్ని మొత్తం తన కైవసం చేసుకు న్న ఏకైక మహిళ కార్టూనిస్టుగా పేరు ప్రఖ్యాతుల నార్జించారని ఆమె గురు తుల్యులు కార్టూనిస్టు జయ దేవ్, వ్యాఖ్యానించారు. కాలక్రమే ణా, తనకంటూ స్వంత శైలి ఏర్పరుచుకుని, చాలామంది మగ తెలుగు కార్టూనిస్టులు, వృత్తి పరంగా అసూయ పడేలా దూసుకు వచ్చిన ఒకే ఒక మహిళా కార్టూని స్టుగా కార్టూనిస్టు రామకృష్ణ అభివ ర్ణించారు. కార్టూన్ల సాధనలో మొదట్లో తాను గీసిన చిత్రాలను చెన్నైలో నివసించే కార్టూనిస్టు జయదేవ్‌కు పండరి పంపితే మెచ్చు కోవడమే కాకుండా, ఆయన జవాబు రాస్తూ, కార్టూన్లను అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. స్వయంగా విశాఖపట్నం వచ్చి తన శిష్యురాలిని అభినందిం చారు.. బాపు అంతటి గొప్ప చిత్రకారుడు రచన మాస పత్రికలో 2005లో ప్రచురించిన వినాయక చవితి కార్టూన్ మెచ్చుకొంటూ లేఖ రాసి, పండరి కార్టూన్‌కు బాపు బొమ్మ గీయడం విశేషం. 2015 ఫిబ్రవరి 19 న విశాఖ పట్టణంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో కన్ను మూశారు. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు ఆమె అవయ వాలను సావిత్రిబాయి పూలే మెమోరియల్ ట్రస్ట్ ద్వారా దానం చేశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## ఉదార జాతీయ వాది... మితవాది గోఖలే - ఫిబ్రవరి 19... గోపాల కృష్ణ గోఖలే వర్ధంతి



స్వాతంత్ర్య సమరంలో తెర ముం దు కనిపించి, పోరాట యోధులు గా, త్యాగ ధనులుగా, ప్రజా నాయ కులుగా చరిత్ర పుటలకు ఎక్కిన వారు కొందరైతే, సమర నేపథ్యంలో తెర వెనుక నిశ్శబ్దంగా కార్యకలా పాలు సాగించిన వారెందరో. లక్ష్యం ఒకటే స్వాతంత్ర్య సాధన. మార్గా లు, కార్యాచరణ మార్గాలు వేరు. స్వాతంత్ర్య సమరంలో నిరంతరం కదలాడుతూ, గాంధీజీ, నేతాజీ, తిలక్, లాలాలజపతి రాయ్, టంగు టూరి ప్రకాశం లాంటి యోధులు ముందు వరుసలో ఉంటే, నిశ్శబ్దం గా, నిర్మాణాత్మకంగా, ఆచరణా త్మకంగా ఉద్యమాలకు ఊపిరిపోసి, లక్ష్య సాధనలో తమ జీవితాల్ని జాతికి ధారపోసి, తెర వెనుక నిలిచిన వారెందరో... అలాంటి తెర వెనుక కార్యసాధకులలో అగ్రగణ్యు లు గోపాలకృష్ణ గోఖలే. ఆయన ఆంగ్లంలో నిష్ణాతుడవడమే మాకుండా పాశ్చాత్య రాజకీయా లను అవగాహన చేసుకున్నారు. పాశ్చాత్య తత్వ శాస్త్రాన్నీ ఆకళింపు చేసుకున్నారు. భార తీయ, పాశ్చాత్య సంస్కృతుల మధ్య సమన్వయకర్తగా నిలిచిన గోపాలకృష్ణ గోఖలేను అటు శ్వేత జాతి పాలకులు, ఇటు దేశీయ అధిక సంఖ్యాక నేతలు విశ్వసిం చారు. అలాంటి భిన్న వ్యక్తిత్వ కారణంగానే గాంధీ, ముహమ్మద్ అలీజిన్నా లాంటి వారిని ఆకట్టు కొని, వారిని తమ రాజకీయ 'గురువు' గా భావించేలా చేసింది. గోపాలకృష్ణ గోఖలే (మే 9, 1866 – ఫిబ్రవరి 19, 1915) మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలోని కోట్లుక్‌లో 1886 మే 9న ఒక సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించా రు. విశ్వవిద్యాలయ స్థాయి విద్యను అభ్యసించిన తొలితరం భారతీ యులలో ఆయన ఒకరు. జస్టిస్ రణడే శిష్యరికంలో భారతీయ అర్ధశాస్త్రాన్ని అభ్యసించి, పూనా లోని ఫెర్గూసన్ కళాశాలలో చరిత్ర, రాజకీయార్థ శాస్త్ర ఆచార్యునిగా చేరారు. తరువాత ఆ కళాశాల ప్రిన్సిపాల్ అయ్యారు. ఆ సమయం లోనే ఆయన పదవికి రాజీనామా చేసి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1900 సంవత్సరంలో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన గోఖలేకి అక్కడ ఫిరోజ్‌షా మెహతా సహచర్యం లభించింది. 1902 లో వైస్రాయ్ కౌన్సిల్ సభ్యుల య్యారు. ఆ సమయంలో అస్తవ్యస్తమై ఉన్న భారత ఆర్ధిక వ్యవస్థ గురించి గోఖలే ఉపన్యసించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఆయన లోని ఆర్థిక వేత్తను ప్రంపంచానికి పరిచయం చేసింది. 1905 లో బెనారస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో అధ్యక్షుడిగా ఎన్నికైనపుడు గోఖలే చేసిన ప్రసంగం నేటికీ అత్యుత్తమ ప్రసంగాలలో ఒకటిగా కీర్తించ బడుతోంది. 1902 నుంచి 1915లో మరణించే వరకు భారత శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. గొప్ప విద్యావేత్త గాను, పార్లమెంటే రియన్ గాను ఘనమైన చరిత్ర ఉంది. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటుచేశాడు. బ్రిటీష్ వారి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించ కున్ననూ భారతీయు లలో జాతీయతా భావాన్ని పెంపొందించ డానికి విశేష కృషి చేశారు. విదేశాలలో వున్న భారతీయుల హక్కుల సాధన పట్ల శ్రద్ధ క్రమంలో, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కు ల పరిరక్షణ కోసం ఉద్యమిం చిన గాంధీ పరిచయం అయ్యారు. అలా వారి పరిచయం గురుశిష్యుల బంధంగా అభివృద్ధి చెందింది. భారతదేశంలో రాజ్యాంగ సంస్కర ణల ప్రక్రియకు ఊతం అందించిన మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ చట్ట రూప కల్పనలో, బెంగాల్ విభజన జరిగిన సందర్భంలో, భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో, బ్రిటిష్ ఇండియా చరిత్రలో గోఖలే పాత్ర ఎన్నదగినది. (1905) కాశీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సభలలో విదేశీ వస్తు బహిష్కరణ వంటి కీలక నిర్ణయం తీసుకున్న సభలకు అధ్యక్షునిగా గోఖలే ఉండడం గమనార్హం. బ్రిటిష్ పాలనకు విధేయత చూపిస్తూ దేశ వ్యవహారాలను నడిపించడంలో ఆయన మితవాదిగా ముద్ర వేసుకు న్న నేపథ్యం. సైద్ధాంతిక భేదాలు ఉన్నా, గోఖలే తన ప్రత్యర్థులతో స్నేహపూర్వక సంబంధాలు కొన సాగించారు. బొంబాయిలో, గోఖలే... బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన భూ ఆదాయ విధానాలను వ్యతిరేకించారు. ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను సమర్థించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడ టానికి వెనకాడలేదు. గోఖలే సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ని స్థాపించారు. గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ (గోఖలే ఇన్‌స్టిట్యూట్ అనే పేరుతో ప్రసిద్ధి). భారత్ లో ప్రాచీన ఆర్థికశాస్త్ర విద్యాలయం. ఇది మహారాష్ట్ర పుణె లోని జింఖానా ప్రాంతంలో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారి ఆర్థిక సహాయముతో స్థాపించబడిన విద్యాలయం. నేటికినీ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారే ఈ విద్యాలయానికి ట్రస్టీలు. గోఖలే పిలుపు మేరకే గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికాను వీడి శాశ్వతంగా భారత దేశానికి వచ్చారు. పలువురిని ప్రభావితం చేసిన గోపాల కృష్ణ గోఖలే గాంధీజీ వచ్చిన దాదాపు నెల రోజులకే ఫిబ్రవరి 19, 1915న గోఖలే తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ - ఫిబ్రవరి 19... ఛత్రపతి శివాజీ జయంతి



ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరుకున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాఫా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి– తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపుకున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోంద్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నిషేధం.. కాగితాలకే పరిమితం

రాయికల్ : పల్లెల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా ఏది కొన్నా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంలో క్షేత్రస్థాయిలో కఠిన వైఖరి అవలంభించకపోవడంతో మానవ జీవితంలో నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు సవాలు విసురుతోంది. వినియోగించడం సరికాదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించే అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కావడంతో ప్లాస్టిక్ భూతం కరాళ నృత్యం చేస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు ఒక్కో ఇంటి నుంచి సుమారు 10 ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయి. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్త సేకరిస్తుండగా అందులో 50 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తుండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

**సమష్టి సహకారంతోనే నియంత్రణ**

జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్



చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంలో దాతల సహకారంతో నారసంచులు పంపిణీ చేశాం. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తుండటంతో ప్లాస్టిక్ విక్రయాలు కొంత మేర నియంత్రణలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.22వేల ఆదాయం సమకూరింది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి తనిఖీలు సద్దుమనిగాక తిరిగి యథావిధిగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విక్రయదారులు, వినియోగదారులు సమష్టిగా సహకరించినప్పుడే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. **వినియోగంతో అనర్థాలెన్నో..** పర్యావరణంపై అవగాహన లేని కొందరు జనావాసాల్లో, వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పడేయడం వలన వర్షాలు కురిసినపుడు నీరు భూమిలోకి ఇంకి పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరుకోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినడం ద్వారా గర్భకోశ వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. భూమిపైకి చేరిన ప్లాస్టిక్ కవర్లు నాశనం కావాలంటే వేల సంవత్సరాలు పడుతుండగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసుల్లోని పదార్థాలు వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే వాయువులు విషపూరితమై సమీప కాలనీవాసులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

# స్థాయి సరే.. సౌకర్యాలు ఎలా..?

నల్గొండ : జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి స్థాయి పెరుగుతోంది. వైద్య కళాశాలలో ముందు (2019) 250 పడకలు మాత్రమే ఉండేవి. తర్వాత వైద్యకళాశాలకు అనుమతి రావడంతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. తాజాగా రూ.23.75 కోట్లతో కొత్తగా సీసీబీ (క్రిటికల్ కేర్ బ్లాక్)తో మరో 80 పడకలు, అధునాతన వసతులతో ప్రత్యేక ఆసుపత్రి మరో 20 రోజుల్లో సిద్ధం కానుంది. వైద్య కళాశాల తరగతి గదులు నూతన భవనం(ఎస్ఎల్‌బీసీ ప్రాంతం)లోకి మార్చడం ద్వారా 200 పడకలు కొత్తగా అందుబాటులోకి వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు అదనపు భవనంపై మరో అంతస్తు నిర్మించడానికి అనుమతి రావడంతో మరో 200 పడకలు అందుబాటులోకి రానున్నాయి. మరో నాలుగు నెలల్లో జనరల్




ఆసుపత్రి 1,030 పడకల స్థాయికి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందనున్నాయి.

**మానవ వనరుల పరిస్థితి ఏంటి..?**

జనరల్ ఆసుపత్రి పడకల స్థాయి పెరుగుతున్నా మానవ వనరుల సంఖ్య 250 పడకలకు సరిపోయేంత మాత్రమే ఉంది. ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ పరిధిలో కింది స్థాయి సిబ్బంది 180 మంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. జనరల్ ఆసుపత్రిలో 550 పడకలకు 260 మంది వరకు ఉండాలి. కొత్తగా అందుబాటులోకి వచ్చే వార్డులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే మరో 260 మంది కిందిస్థాయి సిబ్బంది అవసరం ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్ విభాగాల్లో పూర్తి స్థాయి సిబ్బంది లేని కారణంగా ప్రస్తుతం సిబ్బందిపై పని భారం పెరుగుతోంది. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు.

**మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం**

డా.నగేశ్, డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ ఆసుపత్రి

జనరల్ ఆసుపత్రిలో పడకల స్థాయికి తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది లేని మాట వాస్తవమే. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఇటీవల జనరల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. అధికారులతో సంప్రదింపులు జరిపి గుత్తేదారుల ద్వారా మానవ వనరుల స్థాయి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# యాసంగి ప్రణాళిక కరవు



సిరిసిల్ల : వానాకాలంలో వర్షాలు.. వరదలకు మధ్యమానేరు నిండుకుండలా మారింది. ఇంకేం.. జిల్లాలో రెండు పంటలకు సాగునీటికి ఢోకా లేదనుకున్నారు రైతులంతా. ప్యాకేజీ-9 పరిధిలో మల్కపేట జలాశయం నుంచి నీరొస్తుందని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. తీరా నీటివిడుదల సమయానికి ఈ ప్యాకేజీకి యాసంగి ప్రణాళిక లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో యాసంగిలో రికార్డు స్థాయిలో 1,76,500 ఎకరాల్లో వరి సాగు చేయగా కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోనే సుమారు 60వేల ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉంది. ఆయకట్టుకు నీరివ్వాలంటే వానాకాలం సీజన్ చివరిలోనే వివరాలు ఈఎన్‌సీకి పంపాలి. నవంబరులో ప్రాజెక్టులవారీగా ఉన్నతాధికారుల సమావేశంలో నీటి కేటాయింపులు నిర్ణయిస్తారు. వర్షాకాలం మధ్యమానేరుకు వచ్చే వరదనీటిని మల్కపేటకు, అక్కడి నుంచి మైసమ్మ, సింగసముద్రం జలాశయాల్లో నిల్వచేసుకోవాలి. కాగా ముందస్తు ప్రణాళికలేక నీటిని నిల్వచేయలేదు. తర్వాతకూడా ఆయకట్టుకు నీటి విడుదలపై ఉన్నతాధికారులకూ నివేదిక పంపలేదు. ఇప్పుడు పంట ఎండుతుంటే.. రైతులు మొరపెట్టుకుంటే ఇంజినీర్లు కదిలారు. మల్కపేటలోని ఒక టీఎంసీ నీరు కాల్వలో నాలుగు కిలోమీటర్లకే చేరింది. సింగసముద్రం చేరాలంటే 1.5 టీఎంసీలు ఉండాలి.

ప్యాకేజీ-9లో ఆయకట్టుకు నీరిచ్చే మేజర్, మైనర్ కాల్వల భూసేకరణ జరగక పనులు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఆయకట్టును అధికారికంగా నిర్ణయించలేదు. ఇదే విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లడంలో ఇంజినీర్లు జాప్యం చేశారు. మధ్యమానేరులో ప్రస్తుతం 19.89 టీఎంసీల నీరుంది. ఇక్కడి నుంచి 2 టీఎంసీల నీటిని మల్కపేటకు తరలించి... అక్కడి నుంచి మైసమ్మ చెరువు, సింగసముద్రంకు తరలించాలి. దీంతో కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లో గొలుసుకట్టు చెరువులను నింపవచ్చు. దీనివల్ల 35 గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు తీరతాయి.

**నీరు లేక నెర్రెలు**

మల్కపేట జలాశయం నుంచి నీటిని తరలిస్తారని ఏడు ఎకరాల్లో వరి సాగుచేశా. మైసమ్మచెరువులో నీరు అడుగంటింది. బోరుబావుల ద్వారా సరిపడా నీరందక 1.20 ఎకరాల్లో భూమి నెర్రెలు బారింది. ఇప్పటికీ మా చుట్టుపక్కల అయిదు గ్రామాల్లో నాలుగు వందల ఎకరాల్లో ఇదే పరిస్థితి. నీటి విడుదలలో జాప్యం జరిగితే మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

**గుగులోతు పెంటయ్య, దేవునిగుట్ట తండా**

రెండు టీఎంసీలు నింపాలి

నాకున్న అయిదెకరాల్లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశాను. మార్చిలో పంట పొట్టదశకు వస్తుంది. నీటి వినియోగం ఎక్కువ. భూగర్భజలాలు ఒక్కసారిగా పడిపోతాయి. జలాశయంలో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంటే పక్కనే ఉన్న ఆరు గ్రామాలకు మేలు జరుగుతుంది.

వంగపల్లి మల్లేశం, నిజామాబాద్

అనుమతులు రావాలి

రైతుల సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లాం అక్కడి నుంచి అనుమతులు వస్తే మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి ఆయకట్టుకు విడుదల చేస్తాం. ఇందుకోసం పంపుహౌజ్‌ను సిద్ధం చేస్తున్నాం. కిశోర్, 9వ ప్యాకేజీ ఈఈ

# పైప్‌లైన్ల ఏర్పాటు..లీకేజీలకు మరమ్మతు



గోదావరిఖని : వేసవిలో రామగుండం నగరపాలికలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లీకేజీలతో తాగునీరు వృథా అవుతుండటం.. కొన్నిచోట్ల పైపులైన్లు అనుసంధానం చేయకపోవడంతో ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా జరగడం లేదు. రహదారుల విస్తరణలోనూ పైపులైన్లు ధ్వంసమై అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేపడుతున్నారు. బోరుబావుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.

**రూ. 1.3 కోట్లతో..**

నీటి ఎద్దడి నివారణపై రామగుండం నగరపాలక ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. రూ.1.3 కోట్లతో తగిన పనులు చేపట్టేలా అనుమతి ఇవ్వడంతో నగరపాలిక ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు చేపడుతున్నారు.

సుమారు రూ.50 లక్షల వ్యయంతో రామగుండం హౌసింగ్‌బోర్డు కాలనీ, సప్తగిరి కాలనీ, పవర్‌హౌస్ కాలనీల్లో కొత్తగా తాగునీటి పైపులైన్లు వేస్తున్నారు. అవసరమైన వారికి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. లీకేజీల నివారణకు రూ.30 లక్షలతో అవసరమైన పనులు చేపడుతున్నారు. రూ.10 లక్షలతో బోరుబావుల (హ్యాండ్ బోర్లు) మరమ్మతులు.. మరో రూ.5 లక్షలతో ఉపరితల జలాశయాలను శుభ్రం చేసేలా ముందుకు సాగుతున్నారు. మిగతా నిధులను నగరంలో నీటి సరఫరాకు అత్యవసర పనులకు వినియోగించనున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా జరుగుతుండగా వేసవిలో నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

నీటి సరఫరా స్వరూపం

నగరపాలక ప్రాంత వైశాల్యం : 93.87 చ.కి.మీ.లు

జనాభా (2021 అంచనా) : 2,74,442

ప్రతిరోజు నీటి సరఫరా : 40 ఎం.ఎల్.డి.

కుళాయిలు : 40,728

నీటి సరఫరా పైపులైన్లు : 408.18 కి.మీ.లు

హ్యాండ్ బోర్లు : 640

పవర్ బోర్లు : 24

# నాటడంలో ఉత్సాహం.. సంరక్షణలో నిర్లక్ష్యం



సారంగాపూర్ : ఏటా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించి మొక్కలు నాటుతున్నప్పటికీ ఎక్కడా పూర్తి స్థాయిలో పచ్చదనం కనిపించడంలేదు. నాటే సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ సంరక్షించి వృక్షాలుగా మార్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. జిల్లాలో ఒక్క డీఆర్డీఏ ద్వారానే ఇప్పటి వరకు దాదాపు మూడు కోట్లకుపైగా మొక్కలు నాటినట్లు లెక్కలు ఉన్నాయి. ఒక్కో మొక్కపై ఏటా దాదాపు రూ.వందల్లో వ్యయం చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఉండడంలేదన్న విమర్శలు ఉన్నాయి. వచ్చే ఏడాది(2025-26) వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు జిల్లా వ్యాప్తంగా 37.44 లక్షల లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. గ్రామాల్లోని నర్సరీలలో 47.73 లక్షల మొక్కలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో గతేడాది మిగిలిపోయిన మొక్కలు 5.67 లక్షలు ఉండగా మిగతా 42.67 లక్షల మొక్కలు నర్సరీలలో పెంచి వచ్చే జూన్‌లో నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందులో నర్సరీలలో సంచులలో మట్టి నింపడం పూర్తికాగా దాదాపు 27.22 లక్షల సంచులలో విత్తనాలు నాటారు.

**కనిపించని వనాలు**

ఏటా ఏదో ఒక పథకం పేరుతో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నప్పటికీ సంరక్షణను పట్టించుకోకపోవడంతో నాటిన కొద్ది రోజుల్లోనే చనిపోతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 380 పంచాయతీలతోపాటు అనుబంధ గ్రామాలను కలుపుకొని 417 గ్రామాల్లో 421 ఎకరాల్లో పల్లె ప్రకృతి వనాలు, 57 ప్రాంతాల్లో కోతులకు ఆహార ప్రాంగణాలు, 65 ప్రాంతాల్లో బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. 10 ప్రాంతాల్లో 12 ఎకరాలు గుర్తించి దశాబ్ది సంపద వనాల్లో 4432 మొక్కలు నాటినట్లు చూపారు. వీటితోపాటు స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి వేయి మొక్కల చొప్పున జిల్లాలో 3.80 లక్షల మొక్కలు నాటారు. అలాగే 'మేరీ మిట్టి-మేరీ దేశ్'లో భాగంగా అమర జవాన్లు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటారు. వివిధ పథకాలతో వనాలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా మొక్కలు కనిపించడంలేదు.

**ప్రజా భాగస్వామ్యం పెరిగితేనే**

ప్రభుత్వం నాటిన ప్రతి మొక్క సంరక్షణలో అధికారులతోపాటు ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే పచ్చదనం సాధ్యమవుతుంది. ప్రభుత్వం నాటే మొక్కలతోపాటు ప్రతి ఇంటా అయిదు మొక్కలు నాటాలని పంపిణీ చేస్తున్నప్పటికీ ఇళ్లలో ఎక్కడా పూర్తి స్థాయిలో నాటడంలేదు. ప్రజలకు అవసరమైన మొక్కలను అందించాలని పదేపదే కోరుతున్నా వాటిని అందించకుండా ఏదో రకం మొక్క అందించడంతో పక్కన పడేస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో వననర్సరీలు, ఇతర ప్రాంతాల్లో నాటే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తీసుకెళ్లి ఎక్కడో పడేసి లెక్కలు చూపుతున్నారు. పర్యవేక్షణ పెంచి సంరక్షించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

# మత్తు వదిలిస్తున్నారు!

సిరిసిల్ల: మద్యం తాగడం వ్యసనంగా మారి చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారూ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నారు.. నాలుగు జిల్లాల్లో నెలకు రూ.200 కోట్ల మద్యం వ్యాపారం సాగుతుండటం.. ఏటా 20వేలకు పైగా డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతుండటం మద్యానికి బానిసలవుతున్న తీరును తెలియజేస్తోంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో 2024 ఏప్రిల్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలను ప్రారంభించడంతో ఉచితంగా సేవలు అందుతుండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడం లోటుగా ఉంది. దీంతోపాటు ఈ కేంద్రాలపై ప్రచారం లేకపోవడంతోనూ కొంతమంది ఎక్కువ డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు డీ అడిక్షన్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్‌ఏపీడీడీఆర్) పథకంలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాలుగు ఆసుపత్రుల్లోనూ ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) విభాగం సైకియాట్రిస్టులే సేవలను అందిస్తున్నారు. ఎక్కడా ప్రత్యేకంగా విభాగం లేదు. ఈ చికిత్సలకు ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేశారు. మద్యానికి బానిసలైన వారు సిరిసిల్లలో నెలకు సగటున 140, రామగుండంలో 120 మంది వస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో అందించే చికిత్సలను ఎన్‌సీడీలోని మానసిక విభాగంలో కలుపుతున్నారు. ఓపీకి వచ్చినవారిలో 30శాతం మంది మద్యం బానిసలు ఉంటున్నారని ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 500ల మంది వరకు సేవలు పొందుతున్నట్లు అంచనా

సిరిసిల్లలో 40 ఏళ్ల వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. చేసే పనిలో శ్రద్ధ లేకుండా పోవడంతో పనికి పిలిచేవారు తగ్గిపోయారు. ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో డీ-అడిక్షన్ కేంద్రం గురించి తెలుసుకున్న కుటుంబసభ్యులు సిరిసిల్ల కేంద్రానికి తీసుకెళ్లగా నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరి పని చేసుకుంటున్నాడు. కరీంనగర్‌లో ఓ యువకుడికి మద్యంతోపాటు గంజాయి అలవాటైంది. కళాశాలకు దుమ్మాకొట్టడం, మిత్రులతో కలిసి మద్యం, గంజాయి తాగడం వ్యసనంగా మారింది. ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఒకసారి పోలీసులకు పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులకు జనరల్ ఆస్పత్రిలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్న విషయం తెలియక హైదరాబాద్‌లోని ప్రైవేటు కేంద్రానికి తీసుకెళ్లారు. చికిత్సకు రూ.వేలల్లో ఖర్చవుతోందని అతని కుటుంబం వాపోతోంది.

డీ అడిక్షన్ కేంద్రాలకు వచ్చే బాధితులకు తొలుత వైద్య పరీక్షలు చేస్తారు. హిమోగ్లోబిన్ శాతం, కాలేయం, మూత్రపిండాల పనితీరు, మానసిక స్థితులను పరిశీలిస్తారు. తీవ్రతను బట్టి మందులు ఇస్తారు. బాధితులు, కుటుంబ సభ్యులకు మద్యపానంతో వచ్చే దుష్పరిణామాలు వివరించడంతోపాటు ఆ వ్యసనాల నుంచి విముక్తి కల్పించేలా కౌన్సెలింగ్ ఇస్తారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని బట్టి అలవాటు మానడానికి 1 నుంచి 3 నెలల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఈ చికిత్స ప్రైవేటులో అయితే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది.

చికిత్సకు వచ్చేవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇక గంజాయి, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేవారిని ఈ కేంద్రాలకు తీసుకు రావడం చాలా తక్కువ అని సిబ్బంది చెబుతున్నారు. డీ-అడిక్షన్ కేంద్రాల్లో నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఇద్దరు సైకియాట్రిస్టు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సు, అటెండర్లు ఉండాలి. కాగా జనరల్ ఆస్పత్రుల్లోని కేంద్రాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. నాలుగు జిల్లాల్లోని జనరల్ ఆస్పత్రి ఎన్‌సీడీ విభాగాల్లో ఒక సైకియాట్రిస్టు, ఇద్దరు నర్సులు, ఒక అటెండరు చొప్పున ఉండగా వారే డీ అడిక్షన్ కేంద్రానికి వచ్చేవారికి సేవలు అందిస్తున్నారు.

# గిరి ప్రదక్షిణ ఎప్పుడో..!

నీలగిరి : త్రేతాయుగంలో పరుశరాముడు స్థాపించిన 108 శివలింగాల్లో చిట్టచివరి శివలింగం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి అని భక్తుల నమ్మకం. పురాతన ఆలయంగా ప్రసిద్ధిగాంచిన చెర్వుగట్టు శివాలయాన్ని అనేక మంది యోగులు, పీఠాధిపతులు సందర్శించారు. పుట్టుకతో అంధుడైన పోతులపాటి సోమశర్మ చాలాకాలం పాటు ఆలయ అనువంశిక అర్చకుడిగా అనేక రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హంపి విరూపాక్షానందస్వామి ఆలయాన్ని దర్శించుకుని అమావాస్య రోజు నిద్ర చేసి గిరి ప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని దర్శించుకుంటే.. శివపార్వతులు అనుగ్రహిస్తారని తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఈ విషయం చెప్పగా శివసత్తులతో మొదలైన అమావాస్య నిద్ర నేడు వేలాది మంది భక్తులు వచ్చేలా చేసింది. అమావాస్య నిద్ర చేస్తున్న భక్తులకు గిరిప్రదక్షిణ చేయలేకపోతున్నామనే ఆవేదనను సోమశర్మ భక్తులకు చెప్పేవారు. నేటికి ఇది భక్తులకు తీరని కలగానే మిగిలిపోయింది. అనువంశిక పూజారి సోమశర్మ బతికుండగా పీఠాధిపతి సూచించిన విధంగా గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేయాలని భావించారు. కానీ కొన్ని కారణాల చేత ఆగిపోయారు. గుట్ట చుట్టూ



సుమారు 3 కిలోమీటర్లు దారి వేసి గిరిప్రదక్షిణ కోసం ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో గిరిప్రదక్షిణ మరోసారి చర్చల్లోకి వచ్చింది.

**ప్రయత్నాలు చేసినా..పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు**మా అన్న సోమశర్మ ఆలయంలో అనేకమంది పీఠాధిపతులు, పండితులు సూచించిన విధంగా పూజలు విస్తరించారు. అమావాస్య రోజు ఆలయ ఆవరణలో నిద్రచేసి స్వామివారిని దర్శించుకోవాలనే అంశం అలా వచ్చిందే. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు శివపార్వతులు తోడుగా ఉంటారని నమ్మకంతో అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం రాలేదు. స్వామివారు కరుణిస్తే జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం.

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సీరిస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు వినూత్న ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.



ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.


**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.

రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదులుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్యా బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్టులు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింక్‌లు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసం** విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# కునుకు కరవు!



కరీంనగర్ : కరీంనగర్‌కు చెందిన ఉదయ్‌కు అర్ధరాత్రి 12 గంటలైనా నిద్ర రావడం లేదు. రోజుల తరబడి ఇదే సమస్య ఉండటంతో వైద్యుడిని సంప్రదించారు. విపరీతమైన తలనొప్పి, చికాకుతో బాధపడుతున్నానని చెప్పారు. జీవనశైలి, ఆహార నియమాల్లో లోపాలు, రోజుకు సగటున 5 గంటల పాటు చరవాణి చూడటం వల్లనే ఈ సమస్య అని గుర్తించిన వైద్యుడు తగు సూచనలు ఇచ్చారు.

కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్షల సమయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన టెలీ మానస్ ఉచిత సహాయ నంబరుకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఫోన్ చేశారు. ఇందులో ఎక్కువ మంది నిద్ర సరిగా పట్టడం లేదని చెప్పారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈసారి దాదాపు 36వేల మంది వరకు రాయబోతున్నారు. పరీక్షల ఒత్తిడితో ఎక్కువ మంది నిద్ర సరిగ్గా పోలేకపోతున్నారు.

ఉరుకుల పరుగుల జీవనశైలి.. జంక్‌ఫుడ్.. చరవాణి తెరను ఎక్కువసేపు చూడటం.. ఒత్తిడి నాణ్యమైన నిద్రకు దూరం చేస్తున్నాయి. శారీరక, మానసిక అనారోగ్యానికి కారణమవుతున్నాయి. రోజూవారీ జీవితంలో కొన్ని మార్పులు చేసుకుంటే సుఖ నిద్రను సొంతం చేసుకోవచ్చంటున్నారు వైద్య నిపుణులు. నాలుగు జిల్లా ఆసుపత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో జనరల్ ఫిజిషియన్ల వద్ద రోజుకు సగటున 8,300 మంది అవుట్ పేషెంట్లుగా వస్తున్నారు. ఇందులో నిద్రలేమి సమస్యతో వచ్చేవారు 30 శాతానికి పైగా ఉంటున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో 50 ఏళ్లపైబడిన వారికి ఈ సమస్య ఉండేదని, ఇప్పుడు 30 ఏళ్ల లోపు వారిలోనూ కనిపిస్తోందని చెప్పారు. 18- 30 ఏళ్ల వారు కూడా రోజులో నలుగురైదుగురు ఈ సమస్యతో వస్తున్నారట. కొందరు మానసిక వైద్య నిపుణులను కూడా సంప్రదిస్తూ సేవలు పొందుతున్నారు.

**ఆచరించి చూడండి!**

సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి.
రాత్రి పూట ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకోవద్దు.
పడుకోవడానికి రెండు గంటల ముందే భోజనం ముగించాలి.
నిద్రకు గంట ముందు నుంచే చరవాణికి దూరంగా ఉండాలి.
గది ఉష్ణోగ్రత 25 డిగ్రీలు ఉండేలా చూసుకోవాలి.
గదిలో ఎక్కువ కాంతి, ధ్వని లేకుండా చూసుకోవాలి.
మంచి పుస్తకం కాసేపు చదవడం, శ్రావ్యమైన సంగీతం వినడం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.
5 నిమిషాల పాటు దీర్ఘశ్వాస తీస్తూ వదిలితే మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.
రోజూ ఉదయం వ్యాయామానికి గంట సమయమైనా కేటాయించాలి.

నిద్రలేమితో..
ఏకాగ్రత దెబ్బతింటుంది.
హార్మోన్ల అసమతౌల్యం
రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధుల బారిన పడతాం.

నాణ్యమైన నిద్రతో..
ఉదయం ఉత్సాహంగా ఉంటారు.
ఒత్తిడి దూరమవుతుంది.
జ్ఞాపకశక్తి మెరుగవుతుంది.
మంచి ఆలోచనలు వస్తాయి.

చరవాణి వీక్షించే సమయం పెరగడం మనిషిని నిద్రకు దూరం చేస్తోందని వైద్యులు అంటున్నారు. ముఖ్యంగా పడుకునే ముందు గంట నుంచి గంటన్నర పాటు ఫోన్‌ను చూస్తున్నవారు పెరుగుతున్నారు. ఆ కాంతి కిరణాల వల్ల కంటికి, మెదడుకు ఇబ్బంది తలెత్తి చాలాసేపటి వరకు నిద్ర రావడం లేదు. ప్రతి ఒక్కరూ రోజుకు సగటున 3 గంటలపాటు తెరని చూస్తుండటం సమస్యను పెంచుతోంది.

**మెదడుపై ఒత్తిడి ప్రభావం**

మెదడుపై ఒత్తిడి ఎక్కువైతే నిద్రలేమి సమస్య వస్తుంది. ఉదయం లేచిన తరవాత బద్ధకంగా.. తలనొప్పిగా ఉంటుంది. ఇటీవల ఇలాంటి వారు ఎక్కువ మంది మా వద్దకు వస్తున్నారు. మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వాలి. పడుకునే ముందు మెదడుకు, కంటికి ఒత్తిడి కలిగించే ఏ పని చేయొద్దు.

డాక్టర్ కిషన్, మానసిక వైద్య నిపుణులు, కరీంనగర్

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ



ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# ప్రతి పనికీ సప'రేటు'



పెద్దపల్లి : వాహనాల రిజిస్ట్రేషన్ అయినా.. చలానా చెల్లింపులైనా.. డ్రైవింగ్ లైసెన్సు జారీ అయినా.. ఫిట్‌నెస్ ధ్రువీకరణ అయినా.. ఇలా ప్రతి పనికీ ఓ రేటు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారుల పేరు చెప్పి బెదిరింపులు. ఏజెంట్లకు, అధికారులకు అనుసంధానకర్తగా వ్యవహరించడం.. ఇదీ పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని ఓ అధికారి వద్ద పని చేసే ప్రైవేటు సహాయకుడి తీరు. వసూళ్ల పర్వానికి అధికారులు అండగా నిలవడంతో సదరు ఉద్యోగి షాడో ఎంవీఐగా మారాడు.

**నెలవారీగా రూ.లక్షల్లో మామూళ్లు**

జిల్లా పరిధిలో నడిచే లారీల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో లారీకి నెలకు రూ.8 వేల చొప్పున వసూలు చేస్తుండగా ఇటుక, ఇసుక, బొగ్గు రవాణా చేసే దాదాపు 500 లారీల నిర్వాహకులు సదరు షాడో ఎంవీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మామూళ్లు చెల్లించేందుకు నిరాకరించిన వారి వాహనాలే అధికారుల తనిఖీల్లో తరచూ పట్టుబడతాయి. వాటిని విడుదల చేయించడానికి జరిమానా స్థాయిని బట్టి అదనపు వసూళ్లుంటాయి. శనివారం కార్యాలయ ఆవరణలో లారీ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన అనిల్‌గౌడ్ లారీని ఏడు నెలల కిందట సీజ్ చేయగా అదనపు సొమ్ము ఇచ్చేందుకు నిరాకరించడంతోనే రిలీజ్ చేయలేదనే ఆరోపణలున్నాయి.

ఇక్కడి అధికారుల పనితీరుపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. వాహనాల తనిఖీల సందర్భంగా వివాదాలు తలెత్తుతున్నాయి. పత్రాలన్నీ సరిగానే ఉన్నా వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో విధులు నిర్వహించే ముగ్గురు ఎంవీఐలలో ఒకరి వద్ద పని చేసే ప్రైవేటు సహాయకుడి తీరుతోనే తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. స్థానిక వాహనాలనే లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**బోర్డులపైనే నిబంధనలు**

పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయానికి సొంతంగా వెళ్తే పనులయ్యే పరిస్థితి లేదు. బోర్డులపై కనిపించే సూచనలు, నిబంధనలు ఆచరణలో కనిపించవు. పని కావాలంటే తప్పనిసరిగా ఏజెంట్ల ద్వారా వెళ్లాల్సిందే. డ్రైవింగ్ లైసెన్సు కోసం కార్యాలయానికి రాకపోయినా, పరీక్ష రాయకపోయినా జారీ చేస్తారు. వాహనాలు నడపాల్సిన అవసరం కూడా ఉండదు. కాకపోతే ప్రతి పనికీ ఒక్కో ధర ఉంటుంది. డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్స్‌కు రూ.2,300, పర్మినెంట్ లైసెన్స్‌కు రూ.4200 చొప్పున నిర్ణయించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కు నిబంధనల ప్రకారం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకున్నా ద్విచక్రవాహనానికి రూ.1000, కారుకు రూ.2000 చొప్పున వసూలు చేస్తున్నారు.

**రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు**

రవాణాశాఖ అధికారులు అవినీతికి పాల్పడితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. లేదంటే ఏసీబీకి పట్టించాలి. కానీ ఆరోపణలు చేయడం వల్ల ప్రయోజనం లేదు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మాకు సంబంధం లేదు. రవాణా శాఖ అధికారుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడే వారిని పోలీసులకు అప్పగించాలి.

రంగారావు, జిల్లా రవాణా శాఖ అధికారి

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు - మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# అరకొర వసతుల్లో అవస్థల పఠనం

పెద్దపల్లి : కాల్వశ్రీరాంపూర్‌లోని శాఖా గ్రంథాలయ భవనం ఇది. శిథిలావస్థకు చేరడంతో ఇందులో కూర్చోవడానికి పాఠకులు భయపడుతున్నారు. ఒకే గదిలో పుస్తకాలు, బీరువాలు, దినపత్రికలు పెట్టడంతో ఇరుకుగా మారి పాఠకులు కూర్చోలేని పరిస్థితి.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ సాధనలో అండగా నిలవాల్సిన గ్రంథాలయాల నిర్వహణపై ఎడతెగని నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లా ఆవిర్భవించి ఎనిమిదేళ్లు దాటినా పెద్దపల్లిలోని కేంద్ర గ్రంథాలయానికే సొంత భవనం సమకూరలేదు.

**సొంత భవనాలు రెండే**

జిల్లాలో మొత్తం 14 మండలాలకు 10 చోట్ల గ్రంథాలయాలున్నాయి. పెద్దపల్లి, ధర్మారం, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, జూలపల్లి గ్రంథాలయాలను ఇతర ప్రభుత్వ శాఖల భవనాల్లో నిర్వహిస్తున్నారు. మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో సొంత భవనాలున్నా వసతులు లేవు. ఓదెల, గోదావరిఖని, కమాన్‌పూర్ గ్రంథాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ముత్తారంలో దాదాపు 25 ఏళ్ల కిందట గ్రంథాలయం ఉండేది. నిర్వహణ లేక మూతబడగా పునఃప్రారంభానికి పాలకుల చొరవ కరవైంది. ఎలిగేడు, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి మండలాలకు గ్రంథాలయాలు మంజూరు కాలేదు. అద్దె భవనాల్లో గదులు శిథిలావస్థకు చేరడంతో వర్షాలకు పుస్తకాలు పాడవుతున్నాయి. ఇంటర్నెట్, వసతుల కల్పనపై దృష్టి సారించలేకపోతున్నారు.

**నిధుల్లేక నీరసం**

గతంలో జిల్లా గ్రంథాలయానికి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల గ్రంథాలయానికి పక్కా భవనాల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. మూడు చోట్ల స్థలాలు అందుబాటులో లేకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. పెద్దపల్లి అకాశవాణి కేంద్రంలో ఇటీవల 12 గుంటల స్థలాన్ని కేటాయించారు. నిధుల మంజూరులో జాప్యం నెలకొంది. ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వడం లేదు. డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు కలగా మారింది.

**భవనాలకు ప్రతిపాదనలు పంపించాం**

పెద్దపల్లి, జూలపల్లి, ధర్మారం, కాల్వశ్రీరాంపూర్‌లలో కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సమకూరుస్తున్నాం. వసతుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి


చురకలు



# నిఘా నేత్రం.. నిర్వహణ భారం

హైదరాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో ఎంతో కీలకమైన సీసీ కెమెరాల నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోంది. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా పోలీసులు కాలనీ సంఘాల్ని చైతన్యపరిచి రాజధానిలో లక్షలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో అదే స్థాయిలో దృష్టి సారించకపోవడం సమస్యగా మారుతోంది. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదో గుర్తించి స్థానిక కాలనీ సంఘాలతో మాట్లాడి సరి చేయించాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. మరమ్మతు కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో కాలనీ సంక్షేమ సంఘాలు వెంటనే చేయించడం లేదు. ఫలితంగా నేరాలు జరిగినప్పుడు నిందితుల్ని గుర్తించడం, ఆధారాలు సేకరించడంలో పోలీసులకు ఇబ్బంది ఎదురవుతోంది.

రాజధానిలో మూడు కమిషనరేట్ల పరిధిలోని కాలనీ సంఘాలు, గేటెడ్



కమ్యూనిటీలు, సంస్థలు, వ్యాపార సముదాయాలతో పోలీసులు లక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

**ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి**

డాక్టర్ ఎం జగన్‌మోహన్‌రావు, మెడికల్ అండ్ హెల్త్ కాలనీ సంఘం జనరల్ సెక్రెటరీ, బీఎన్‌రెడ్డినగర్

రోడ్లు, వీధి దీపాల తరహాలోనే ప్రభుత్వం సీసీ కెమెరాలను నిర్వహణపై కూడా దృష్టిసారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల నేరాల తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. భద్రతాపరంగా ఎంతో కీలకమైన ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

# తియ్యగా తినేస్తోంది..!

మిర్యాలగూడ : 'దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మధుమేహ రోగుల సంఖ్యలో మూడోస్థానంలో ఉంది.. తెలంగాణలో 1.75 కోట్ల మందికి పరీక్షలు చేస్తే 24.52 లక్షల మందికి మధుమేహం నిర్ధారణ అయింది.. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక సారాంశం ఇది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేకంగా అసంక్రమిత వ్యాధుల విభాగాన్ని ఏర్పాటు చేసి 30 ఏళ్లు పైబడిన వారికి చేస్తున్న పరీక్షల్లో మధుమేహ కేసుల సంఖ్య పెరిగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. పట్టణ జనాభా పెరిగిపోవటం, ఆహారపు అలవాట్లు మారిపోవడం, శారీరక వ్యాయామం లేకపోవటం ప్రధాన కారణాలుగా గుర్తిస్తున్నారు. మూడు పదులు దాటిన వారిలో వైద్య పరీక్షలు చేస్తే మధుమేహం నిర్ధారణ అవుతుండగా వారికి ప్రభుత్వం ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నారు.

జీవన శైలి కారణంగానే..

అలుగుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి ఎండీ

మూడు పూటలా అన్నం, పిండి పదార్థాలు ఉండే అల్పాహారం, శారీరక శ్రమలేక, కూర్చుని చేసే ఉద్యోగాలు ప్రధాన కారణం. కాగా మందుల వాడకంతో పాటుగా ఆహారపు అలవాట్లలో మార్పులతో మధుమేహం నియంత్రించవచ్చు. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తగ్గించటంతో పాటు తృణధాన్యాలు అధికంగా తీసుకోవాలి. కార్యాలయాల్లో పనిచేసే వారు ఎక్కువ సమయం కూర్చోకుండా కనీసం అరగంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరగాలి. నిత్యం వ్యాయామం, వారంలో మూడు రోజులైనా నడవాలి. కనీసం ఎనిమిది గంటల అంతరాయం లేని నిద్ర అవసరం. బరువు తగ్గాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మధుమేహాన్ని పూర్తిగా నయం చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇన్సులిన్ మాత్రలు వంటి ప్రయోగాలు చేస్తున్నారు.

# ప్రతిభ చాటేలా.. ఫలితాల్లో మెరిసేలా

మునగాల : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరిసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రెండేళ్ల కిందట కేజీబీవీల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. తెలుగు నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మారిన వారికి ఇబ్బందులు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. సర్కారు బడుల్లో మాదిరిగానే నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**పఠనానికి ప్రాధాన్యం..**

కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి తరగతిలో మొదటి 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని పఠనానికి కేటాయించేలా ప్రణాళిక నిర్దేశించారు. ఇందుకు సబ్జెక్టుకు ఒక సీఆర్టీ ఇన్‌ఛార్జిని నియమించారు. నిత్యం చదవాల్సిన అంశాన్ని విద్యార్థినులకు వీరు సమాచారం అందిస్తారు. సంబంధిత అంశం పూర్తయ్యాక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆయా సబ్జెక్టుల ఇన్‌ఛార్జులు నిత్యం వాటిలోని ఉత్తమ పఠనాన్ని ఎంపిక చేస్తారు. ఫలితంగా విద్యార్థుల్లో పోటీ పెరగడంతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చుననే ధీమాతో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. ఇదే విధానాన్ని పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్నారు.

**బృందాల విభజన..**

సామర్థ్యాలు పెంపొందించడానికి విద్యార్థులను మెరిట్, మధ్యస్థం, తక్కువగా చదివేవారు.. ఇలా మూడు భాగాలుగా విభజించారు. అందరూ మొదటి స్థాయికి వచ్చేలా వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పఠనా సామర్థ్యాలతో విద్యార్థుల మధ్య పోటీతత్వం పెంపొందిస్తూ, ప్రతి అంశాన్ని సులువుగా ఎలా అర్థం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇలా రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం అమలు ద్వారా సత్ఫలితాలు సాధిస్తామని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా వెనుకబడిన విద్యార్థులకు మేలు జరుగుతుందని, అన్ని అంశాల్లో పట్టు సాధించేలా అవగాహన పెంపొందిస్తున్నామని జీసీడీవో పూలన్ తెలిపారు.

# ఆట మైదానాలకు.. టెం'డర్'!



కరీంనగర్ : కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలోని స్కేటింగ్ కోర్టు ఇది. చిన్నారులు ఇక్కడకు వచ్చి స్కేటింగ్ నేర్చుకుంటుంటారు. సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తుంటారు. మున్ముందు పిల్లలు ఇక్కడ స్కేటింగ్ చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఆదాయ వనరుల కోసం అధికారులు ఈ స్టేడియాన్ని ప్రైవేటు వారికి అప్పగించాలనే నిర్ణయం దీనికి బలం చేకూరుస్తుంది.

చిన్నారులు, యువత ఆరోగ్యం ఎక్కడో లేదు.. వారు ఆడుకునే మైదానంలో దాగి ఉందని' స్వామి వివేకానంద చెప్పిన మాటలు కరీంనగర్‌లో చెల్లుబాటు అయ్యేలా లేవు. యువజన క్రీడా శాఖ అధికారుల నిర్వాకంతో ఇకమీదట ఇక్కడ ఆడే కొన్ని ఆటలకు పైసలు కట్టాలి. ఆదాయమే పరమావధిగా ఇక్కడి అధికారుల నిర్ణయం క్రీడాకారులకు శాపంగా మారబోతోంది. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన స్థలాలు ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి లీజు రూపంలో వెళ్ల బోతున్నాయి. బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాస్థలాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బిడ్ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ మైదానాలను లీజుకు ఇచ్చేందుకు నిబంధనలను రూపొందించారు. స్కేటింగ్ రింగ్‌కు నెలకు రూ.50 వేల కిరాయితోపాటు రూ.1.50 లక్షల ధరావత్తు చెల్లించాలి. బ్యాడ్మింటన్ కోర్టుకు నెలకు రూ.1.50 లక్షల అద్దెతోపాటు రూ.5 లక్షలు మందస్తుగా అందించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి, కరీంనగర్ పేరిట ప్రకటన వెలువర్చారు. క్రీడాభిమానులతోపాటు పలువురు వ్యాయామోపాధ్యాయులు ఈ నిర్ణయంపై విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**మరింత 'ప్రియం..**

కరోనా తరువాత కరీంనగర్‌లో క్రీడా పోటీల నిర్వహణ అనేది గగనమవుతోంది. పైగా సాధన చేసేందుకు ఉన్న అరకొర మైదానాలు ఇలా లీజులతో దూరమవడంతో సామాన్య క్రీడాకారుడికి ఆట అంటే ఖరీదైన వ్యవహారంగానే మారే అవకాశముంది. టెండర్ ద్వారా మైదానాన్ని దక్కించుకున్న వారు అద్దె చెల్లించాలనే ఉద్దేశంతోనే ఉంటారు. ఇక్కడ ఆటలాడే వారి నుంచి ఫీజు వసూలు చేస్తారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న బ్యాడ్మింటన్ ఆడాలంటే నెలకున్న అద్దె ప్రకారం రోజుకు రూ.5 వేలు వసూలు చేయాలి. ఇంత మొత్తాన్ని చెల్లించి ఏ కోచ్ ముందుకొస్తాడు..? ఏ క్రీడాకారులు ఇక్కడ ఆటలాడుతారనేది అంతుచిక్కన్ని ప్రశ్నగానే మారింది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మైదానాలు వెళ్లడంతో పేద విద్యార్థులకు ఆట కలగానే మిగిలిపోనుంది.

**ఆదాయమే ముఖ్యమా..**

అంబేద్కర్ మైదానం నిర్వహణకు ఆదాయాన్ని సమకూర్చాలనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారనేది అర్థమవుతోంది. వాస్తవానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను పక్కాగా వినియోగించుకుంటే ఈ లీజు కథ ముందుకొచ్చేది కాదు. ఈత కొలను నిర్వహణ ద్వారా ఆదాయం సమకూరుతుంది. దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని పక్కాగా వినియోగించుకోవడంపైన దృష్టి సారించకుండా కొత్త దారులను వెతకడం హాస్యస్పదంగానే అనిపిస్తోంది. మరో వైపు గతంలో ఈత కొలను ద్వారా వచ్చే ఆదాయం పైసలు పక్కదారి పట్టిన ఉదంతాలున్నాయి. వాటిని చక్కదిద్దడం పక్కనబెట్టి కొత్తదారులను అన్వేషించడానికి కారణమేంటనేది ఎవరికీ అర్థం కావడంలేదు. పైగా ఇటీవల రూ.7 కోట్లతో నిర్మించిన ఆధునిక సముదాయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ దాదాపు 22 దుకాణ సముదాయాలతోపాటు అద్దెకు ఇచ్చే విధంగా గదులు, ఒక వేడుక ప్రాంగణం సిద్ధంగా ఉన్నాయి. ఏడాది కాలంగా ఇది ప్రారంభానికి నోచుకోలేదు. ఒకవేళ ఆదాయంపైనా దృష్టి ఉంటే ఈ అధికారులు ఈ సముదాయ భవనాన్ని త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటే బాగుండేదనే భావన క్రీడాభిమానులు, ప్రజల నుంచి వినిపిస్తోంది.

**అధికారులేమన్నారంటే..!** టెండర్ పిలిచిన మాట వాస్తవమేనని.. ఆదాయం రావడంతోపాటు ఆటలకు ప్రాధాన్యముంటుందని జిల్లా కలెక్టరు పమేలా సత్పతి అన్నారు. కొన్నాళ్లుగా వృథాగా ఉండటంతో అధికారులంతా సమష్టిగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని.. దీని ద్వారా క్రీడల అభివృద్ధికి సహకారం అందుతుందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ.. నిర్వహణ నిధులు సమకూర్చేందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నా మని.. తాము ఏది చేసినా జిల్లా కలెక్టరు ఆదేశాలతో చేస్తున్నామని చెప్పారు.

# పేదలకు సొంతింటి యోగం!



పరిగి : పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు నెలల కిందటే గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. తాజాగా మరో అడుగు ముందుకు వేసి, ప్రత్యేక యాప్ రూపొందించడంతో వివరాల సేకరణ ప్రారంభమైంది. గృహ నిర్మాణశాఖలో విధులు నిర్వహించి, ఇతర శాఖల్లోకి బదిలీ అయిన వారిని మళ్లీ అదే శాఖకు పంపుతున్నారు.

**2.57లక్షల దరఖాస్తులు**

ప్రజాపాలనలో భాగంగా గత డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించారు. పది అంశాలకు కలిపి మొత్తంగా 13,24,270 అర్జీలు అందాయి. వాటిలో ప్రధానంగా గృహాలు మంజూరు చేయాలని కోరుతూ 2,57,664 వచ్చాయి. వీటినే ప్రామాణికంగా తీసుకున్న అధికారులు సర్వే బాట పట్టారు. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులతో పాటు ఇతర సిబ్బంది కూడా దరఖాస్తుల పరిశీలన విధుల్లో పాల్గొంటున్నారు.

**తొలి విడతలో 3,500..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 చొప్పున ఇవ్వాలని యోచిస్తున్నట్లు ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలుండగా 14 వేల ఇళ్లను చేపట్టనున్నారు.

**వీరికే ప్రాధాన్యం..**

ఇళ్ల మంజూరు విషయంలో ఒంటరి మహిళలతో పాటు ఆహారభద్రత కార్డు కలిగిన వారు, దివ్యాంగులు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేవారిని ఎంపిక చేయనున్నారు. ఆ తరువాత ఇతరులకు అవకాశం దక్కనుంది.

**గృహనిర్మాణ శాఖ బలోపేతం..** ఇందిరమ్మ ఇళ్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని భావించిన కేసీఆర్ సర్కారు చివరకు ఆ శాఖనే రద్దు చేసి అందులో పనిచేస్తున్న అధికారులను ఇతర శాఖల్లోకి పంపారు. అంతేగాకుండా ఇళ్ల మంజూరు కూడా చేపట్టకపోవడంతో పేదలు నిరాశకు లోనయ్యారు. మళ్లీ రేవంత్ ప్రభుత్వం తిరిగి తీసుకోనుండడంతో గృహ నిర్మాణ శాఖ పునరుత్తేజం కానుంది. ఒక్కో ఇంటి నిర్మాణ పనులకు నాలుగు విడతల్లో రూ.5లక్షల నగదు సాయం అందించనుంది. **నెలాఖరు వరకు పరిశీలన పూర్తి..** జిల్లాలోని 566 పంచాయతీల్లో సర్వే జరుగుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా, యాప్‌లో నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం విడతల వారీగా జిల్లాకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్.

# అదనం లేకపోయినా జాప్యమే

హైదరాబాద్: అనుమతులకు అదనంగా అంతస్తులను నిర్మించాలనుకున్నా.. నిధులు లేక, సాంకేతిక అనుమతులు రాకపోవడంతో తొలిదశలోని ఉత్తర్వులనే ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడానికి నిర్ణయం తీసుకొంది. దీంతో సనత్‌నగర్, చైతన్యపురిలోని భవనాల అంతస్తులు కుదించక తప్పడం లేదు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అంతస్తుల సంఖ్య తగ్గింది. నాలుగింటిలో రెండు ఆస్పత్రుల అంతస్తులను ప్రభుత్వం తగ్గించింది. మిగిలిన రెండు యథావిధిగా నిర్మిస్తోంది.

**ఇక్కడ నిర్మాణం:** సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, చైతన్యపురిలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నిమ్స్ విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మూడు నూతన ఆస్పత్రుల నిర్మాణానికి రూ.2,697 కోట్లు, నిమ్స్ విస్తరణకు రూ.1,698 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

**ఇదీ లక్ష్యం:** వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సనత్‌నగర్, అల్వాల్, చైతన్యపురి ఆస్పత్రుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అనుమతులతోపాటు వివిధ కారణాలతో సుమారు ఆరు నుంచి ఏడు నెలలు జాప్యమవుతోంది.

చైతన్యపురిలో నిర్మిస్తున్న గ్రౌండ్(జి)ం13 అంతస్తులకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత జిం13 అంతస్తులకే అనుమతి లభించింది. ఆ తర్వాత 24 అంతస్తులకు పెంచాలని నిర్ణయించింది. నిధులు సమస్యతో తాజాగా మళ్లీ జిం13 అంతస్తులకే పరిమితం చేయాలనుకుంటున్నారు.



సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జిం5 అంతస్తులకు పరిమితం చేశారు. గతంలో జిం6గా నిర్మించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతం బేగంపేట విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో ఎయిర్ పోర్ట్ అథారిటీ అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. భారీగా చేపట్టిన నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. మిగిలిన మూడింటితో పోలిస్తే నిమ్స్ నిర్మాణాలు 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలిచ్చారు.

# ఆలయాల సమాచారం.. అంతర్జాలంలో నిక్షిప్తం

కరీంనగర్ : దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల పూర్తి సమాచారం అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలయాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుళ్లను సులభంగా గుర్తించేలా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా చేస్తున్నారు. ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ఆధునిక సాంకేతికను వినియోగించుకుంటున్నారు. అన్ని రకాల దేవాలయాల సమాచారాన్ని జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)తో అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ విధానంతో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడనుంది.

**అన్నింటికి జియో ట్యాగింగ్**

దేవాలయం ఎక్కడ ఉంది? దాని సరిహద్దులు ఏమిటి? దాని పరిధిలోని భూములు ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఇలా ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం ప్రజలకు తెలిసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారం పొందుపరుస్తున్నారు.

దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్, రిజిస్టర్ అయి ఉన్న దేవాలయాలు, ధూపదీప నివేదన పథకంతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధించిన సమాచారం



కావాలనుకుంటే టైప్ చేస్తే చాలు.. పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. భూములు, ఆస్తుల వివరాలను సైతం ఫొటోల ద్వారా సేకరించి ప్రభుత్వ ధరణి వెబ్‌సైట్ నుంచి జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. జియో ట్యాగింగ్‌లో జీపీఎస్ ద్వారా ఫిక్స్ చేస్తున్నారు. భవిష్యత్తులో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు దేవాదాయ శాఖ కసరత్తు చేస్తోంది.

ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లోకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయాలకు సంబంధించిన కోఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

**అన్యాక్రాంతం కాకుండా..**

ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో ఏదైన ఆలయ భూమి కబ్జాకు గురైతే తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్‌లో సర్చ్ చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాంశాలతో మనకు ఆ ప్రదేశం చూపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని దేవాలయాల సమాచారం పక్కగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దేవాలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఇది దోహదపడుతుంది. – సుప్రియ, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

# ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

కొడిమ్యాల: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో తమ గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం తారు రోడ్లు, బస్సు షెల్టర్లు నిర్మిస్తున్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కొడిమ్యాల మండలం నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లి, నల్లగొండ వరకు తారురోడ్డు ఉన్నప్పటికీ చాలా ఏళ్లుగా బస్సు సదుపాయం లేకపోవడంతో ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. బస్సు సదుపాయం కల్పిస్తే కరీంనగర్, జగిత్యాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. గతంలో జగిత్యాల నుంచి మల్యాల, బల్వంతాపూర్, సర్వాపూర్, నర్సింహులపల్లె, గౌరాపూర్ మీదుగా పూడూర్ వరకు బస్సు సదుపాయం ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో ఆ గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దమ్మయ్యపేట, బోల్లోనిచెరువు, చింతలపల్లి గ్రామాలకు నేటికీ బస్సు



సౌకర్యంలేదు. జగిత్యాల నుంచి కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల నల్లగొండ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సదుపాయం ఉండగా కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు.

**పునరుద్ధరించాలి..**

గతంలో జగిత్యాల నుంచి వయా కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల, వేములవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు పల్లెవెలుగు బస్సు సదుపాయం ఉండేది. దీంతో గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలకు సౌకర్యంగా ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో గ్రామస్థులు ఎటువెళ్లాలన్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సును పునరుద్ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– దయ్యాల రవి, రామకిష్టాపూర్

**ప్రైవేటు వాహనాలే దిక్కు..**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లె గ్రామాలకు తారురోడ్డు ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామస్థులు ఏళ్లుగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సదుపాయం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇరుమల్ల రమేష్, నమిలికొండ

చురకలు



# స్మార్ట్‌గా నడుపుదాం.. ఇక కొత్త కార్డుల జారీ

పుత్తూరు : పుత్తూరుకు చెందిన వ్యక్తి ఒకరు ఏడాదిన్నర కిందట కారు కొన్నారు. అప్పటి నుంచి ఆర్‌సీ రాలేదు. ఆయన పక్క రాష్ట్రానికి వెళ్లినపుడు పోలీసులు ఆర్‌సీ అడగ్గా తన వద్ద ఉన్న డిజిటల్ పత్రాన్ని చూపారు. ఒరిజినల్ కార్డు లేకుంటే చలానా చెల్లించాలని చెప్పడంతో అవాక్కయ్యాడు. విధిలేని పరిస్థితుల్లో అపరాధ రుసుము చెల్లించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్(ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లు తీసుకునే వారికి కూటమి ప్రభుత్వం మంచి వార్త చెప్పింది. వైకాపా హయాంలో నిలిపేసిన స్మార్ట్ కార్డులు మళ్లీ అందజేయాలని నిర్ణయం తీసుకోవడంతో వాహన చోదకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. లైసెన్సులు పొందిన చోదకులు సదరు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల సంఖ్యలో త్వరలో కార్డులు జారీ చేయనున్నారు.

**రెండేళ్లుగా కార్డులు ఇవ్వక..** వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలంటే ఆర్టీవో కార్యాలయంలో వాహన చోదక పరీక్షల్లో ఉ




త్తీర్ణత సాధించాలి. వైకాపా హయాంలో రెండేళ్లుగా డ్రైవింగ్ వాహనా రిజిస్ట్రేషన్ కార్డుల జారీ నిలిపేసింది. వాటికి బదులుగా ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ చూసుకోవచ్చని చెప్పింది. ఈ నిబంధనలు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు జరిగినపుడు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.


**రూ.235 చెల్లిస్తే పోస్టు ద్వారా..** డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్‌కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణాశాఖ నిర్వహించే ఈ-ప్రగతి పరివాహన్ పోర్టల్‌లో నమోదు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. గతంలో డబ్బులు చెల్లించినా కార్డులు రాలేదని, ఇప్పుడు టెండర్ల ప్రక్రియ నిర్వహించకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వైకాపా హయాంలో వాహనదారుల నుంచి వసూలు చేసిన సొమ్ము గుత్తేదారుకు ఇవ్వకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కచ్చితంగా కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**రుసుము చెల్లిస్తే కార్డులు వస్తాయి..**

ప్రభుత్వం వాహన చోదకులకు డీఎల్ కార్డుల జారీకి ఉత్తర్వులు ఇచ్చింది. రుసుం చెల్లించిన వాహన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కార్డులు పొందే అవకాశం కల్పించింది. కార్డులు ముద్రణ పూర్తయింది. రుసుం చెల్లించిన వెంటనే కార్డులు తపాలాలో పంపుతున్నారు. చంద్రశేఖర్, మోటారు వాహనాల తనిఖీ అధికారి, పుత్తూరు

# కుప్పంలో అక్రమాలకు ఉపాధి

కుప్పం : వైకాపా హయాంలో 2019 నుంచి 2024 వరకు కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉపాధి హామీ ద్వారా రూ.236 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు సంబంధించి.. రామకుప్పం మండలంలో అత్యధికంగా రూ.72.65 కోట్లు, కుప్పంలో రూ.63.56 కోట్లు, శాంతిపురంలో రూ.60 కోట్లు, గుడుపల్లెలో రూ.49.80 కోట్లు వ్యయం చేశారు. పులివెందుల తరహాలో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వైకాపా హయాంలో సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ప్రగతి పనులు అటుంచి



అక్రమంగా ఆరగించడంలో మాత్రం దూసుకెళ్లారని తేటతెల్లమవుతోంది. ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో నిధుల వ్యయంపై జరుగుతున్న విజిలెన్స్ విచారణలో ఈ విషయమే స్పష్టమవుతోంది. స్థానిక తెదేపా నేతలు కూటమి ప్రభుత్వానికి లేఖ రాయగా విచారిస్తున్న అధికారులకు ఈ విషయమే వెల్లడవుతోంది.

**కొవిడ్ సమయంలో అత్యధికంగా..**

ప్రజలను గడగడలాడించిన కరోనా మహమ్మారి (కొవిడ్) కాలంలోనే అత్యధికంగా ఉపాధి నిధులు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రతతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమైన 2020-21 ఆర్థిక సంవత్సరంలో.. నాలుగు మండలాలకు రూ.68.78 కోట్లు ఖర్చు చేశారు. రామకుప్పం మండలంలో రూ.20.15 కోట్లు, కుప్పంలో రూ.16.79, రామకుప్పంలో రూ.19.12, గుడుపల్లెలో రూ. 12.72 కోట్లను ఉపాధి పనులకు వెచ్చించారు. కొవిడ్ భయాందోళనతో కూలీలు చాలా వరకు ఉపాధి పనులకు వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడిన విషయం తెలిసిందే.

**అధికారం అండతో అక్రమాలకు తెరతీసి..**

కరోనా కాలాన్ని సద్వినియోగం చేసుకున్న అక్రమార్కులు ఉపాధిలో అక్రమాలకు తెరతీసినట్లు స్పష్టమవుతోంది. నాలుగేళ్లకు గాను రూ.167 కోట్లు ఖర్చు చేయగా.. కరోనా ఏడాదిలో రూ.68.78 కోట్లు వ్యయం చేసినట్లు గణాంకాలు ఉండటంతో అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో అధికారం అండతోనే సామాజిక తనిఖీలను తూతూమంత్రంగా ముగించినట్లు స్పష్టమవుతోంది.

**విజిలెన్స్ అధికారుల ఆరా**

తిరుపతికి చెందిన విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి ఉపాధి నిధుల వ్యయం వివరాలు సేకరించారు. నెలన్నర కిందట మండల ప్రజాపరిషత్తు, ఉపాధి కార్యాలయాల్లో వీరు రహస్యంగా వివరాలు తీసుకెళ్లగా.. తాజాగా మరోదఫా సేకరించారు. త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం.

# పల్లెదారులకు కొత్త వెలుగులు



ఆత్మకూరు : రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా రహదారులకు నోచుకోని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దశాబ్దాల నుంచి గంపెడు మట్టి వేయని గ్రామాల్లో.. గుంతలు, కంకర, రాళ్ల రప్పలతో దారులలో ప్రజలు పడిన ప్రయాసలెన్నో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టడంతోపాటు పూర్తిగా దారులు లేని గ్రామాలకు తారు, సీసీ రోడ్లు నిర్మించి ప్రయాణ ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పూర్తి చేసిన దారులతోపాటు ప్రస్తుతం పనులు జరుగుతున్న సిమెంట్, తారు రోడ్డు నిర్మాణాలు పూర్తి అయితే ప్రజలు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ప్రయాణం చేసేందుకు వీలుగా ఉంటుంది.

**నిధులు చకచకా మంజూరు..**

ఆత్మకూరు మండల వ్యాప్తంగా రూ.2.50 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మండలంలోని తలుపూరు గ్రామం నుంచి కళ్యాణదుర్గం ప్రధాన రహదారి వరకూ కోటి రూపాయలతో 2.1 కిలోమీటరు మేర తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. వీటితోపాటు ఆత్మకూరు నుంచి కుర్లపల్లి వరకూ, సింగపంల్లి గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారు.

చెన్నేకొత్తపల్లి మండలం ఉపాధి నిధులు రూ.3.60 కోట్లతో 6.03 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. మరో 3.4 కిలోమీటర్ల దారిని నిర్మించేందుకు రూ.2.45 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. న్యామద్దెల నుంచి చిన్నప్పేట వరకూ తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

కనగానపల్లి మండలవ్యాప్తంగా రూ.3.60 కోట్లతొ 6.25 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణాలను పూర్తి చేశారు. ఆత్మకూరు మండలం రంగంపేట నుంచి కనగానపల్లి మండలం తొగరకుంట వరకూ రూ.4.80 కోట్లతో 14 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

రామగిరి మండలంలో రూ.3.60 కోట్లతో 5.91 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. గంగంపల్లి నుంచి ముత్యాలమ్మపల్లి వరకూ 0.7 కిలోమీటర్ల మేర రూ.65 లక్షలతో తారు రోడ్డు వేశారు. రాప్తాడు మండలవ్యాప్తంగా చాపట్ల, చెర్లోపల్లి రూ.4.96 కోట్లతో 7 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

# అతివలు.. 'అజయ్'లు



ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళలు 'ఉన్నతి' పథకం కింద దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి రుణం మంజూరయ్యేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎస్సీ మహిళల స్వయం ఉపాధి నిమిత్తం ఇప్పటికే పలు పథకాలను తీసుకొచ్చింది. తాజాగా వారి అభ్యున్నతికి మరో అడుగు ముందుకేసింది. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజయ్)లో భాగంగా డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు వ్యక్తిగత రుణం అందించనుంది. ఇందుకుగాను ఇప్పటికే క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరింత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేలా చూస్తున్నారు.

పథకం: ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజయ్)

అమలు: డీఆర్డీఏ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యం

అర్హులు: ఎస్సీ మహిళలు

వ్యక్తిగత రుణం: రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు

జిల్లాలో యూనిట్లు: మొత్తం 109

మంజూరైన మొత్తం: రూ.1.68 కోట్లు

కేటాయింపులు: మండలానికి మూడు యూనిట్లు (2024-25 ఆర్థిక సంవత్సరానికి)

**ఇక వ్యక్తిగతంగానూ రుణాలు**

ఎస్సీ వర్గాల్లోని మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఉన్నా ఇప్పటివరకు వ్యక్తిగతంగా రుణాలు అందించింది లేదు. సకాలంలో చెల్లించే ఆర్థిక స్తోమత ఉండదన్న ఉద్దేశంతో వారికి రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు వెనకడుగు వేసేవారు. దీంతో సంఘానికి వచ్చిన మొత్తం నుంచే వ్యక్తిగతంగా పంచుకునేవారు. 'అజయ్' పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రాయితీ రూ.50 వేలు, లబ్ధిదారుని వాటా రూ.10 శాతంపోను.. మిగిలిన మొత్తాన్ని ఉన్నతి పథకం నుంచి ఇకపై విడుదల చేయనున్నారు. తద్వారా సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు.

**ఇవీ నెలకొల్పుకునే యూనిట్లు**

సిమెంట్ బ్రిక్స్, చీరల విక్రయం, డీజే సౌండ్ సెట్, చెప్పుల దుకాణం, పాత సామగ్రి కొనుగోలు, నాటు కోళ్ల పెంపకం, కంప్యూటర్ అండ్ నెట్, హోటల్, పండ్లు, జ్యూస్, ఆర్వో ప్లాంట్, కూరగాయల సాగు, ఐస్‌క్రీమ్ పార్లర్, శీతల పానీయాల దుకాణాలు వంటి వాటిని స్వయం ఉపాధి యూనిట్లుగా మహిళలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**60 సంవత్సరాల్లోపు వారికే మంజూరు**

పీఎం అజయ్ పథకం వర్తించాలంటే 60 సంవత్సరాల్లోపు మహిళలై ఉండాలి.

అంతకు ముందు ఇతర పథకాల్లో ఎలాంటి రుణం పొందనివారై ఉండాలి.

ఒంటరి మహిళలు, దివ్యాంగులు, సొంతిల్లు, భూమి లేనివారికి ప్రాధాన్యముంటుంది.

ఒక్కో యూనిట్ నిర్వహణ ఖర్చు ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అందిస్తారు. అందులో రూ.50 వేలు రాయితీ ఉంటుంది. రుణం మొత్తాన్ని నెలవారీ వాయిదాల్లో చెల్లించాలి.

ఎంపికైన లబ్ధిదారులతో ఈ నెలాఖరుకల్లా యూనిట్లు నెలకొల్పించేలా అధికారులు ప్రణాళిక చేశారు.

# సర్వే చేస్తున్నా.. ఆగని అక్రమం



పలమనేరు : పలమనేరు పట్టణానికి అత్యంత సమీపంలోని గంటావూరు కాలనీలో అక్రమ గృహ నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఒక వైపు అధికారులు అక్రమాల నిగ్గు తేల్చడానికి సర్వే చేస్తున్నా ఆగడం లేదు. కాలనీకి అనుబంధంగా ఉండే సర్వే నం 1082-10, 1082-13లతోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో దాదాపు మూడెకరాల విస్తీర్ణంలోని భూమిలో ప్రభుత్వం పేదల కోసం ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది.

**వైకాపా నాయకుడి చేతివాటం**

గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వైకాపా నాయకుడొకరు ప్లాట్లు చేసి విక్రయాలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అప్పట్లో దాదాపు 100 ప్లాట్లను తనకు ఇష్టమొచ్చిన వారికి పట్టాలు పంపిణీ చేసినట్లు ఫిర్యాదులున్నాయి.

**ఎమ్మెల్యే ఆదేశాలతో సర్వే**

కూటమి ప్రభుత్వం వచ్చాక కాలనీలో గతంలో చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో వారం రోజుల నుంచి సర్వే చేసి వివరాలు సేకరించారు. ఇప్పటికీ కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారని ఆ ప్రాంత తెదేపా నాయకుడు వై.శ్రీధర్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అడ్డుకున్నారు.

చదును చేసి.. పందేరానికి తెగబడి..

పేదలకు గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రైవేటు భూమి కొంత సేకరించింది. అది ఎత్తుపల్లాలుగా ఉండటంతో చదును చేయలేదు. ఇదే అదనుగా వైకాపా నాయకుడు చదును చేసి పట్టాల పందేరానికి తెగబడ్డారు. సర్వే నంబరు 1082-10తో పాటు 1082-11, 1082-13లో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకున్నాయి. మరి కొద్దిరోజుల్లో అక్రమ పట్టాల వ్యవహారాన్ని గుర్తిస్తామని పలమనేరు తహసీల్దారు ఇన్బనాథన్ తెలిపారు.

**లంచం కొట్టు.. పట్టా పట్టు**


కాగా ప్రభుత్వం మారినా దందాలు కొనసాగుతుండటం గమనార్హం. గత ప్రభుత్వంలో నాయకులు ఇక్కడ ఒక ప్లాటుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు తీసుకుని ప్రభుత్వ అధికారులతో సర్దుబాటు చేసి పట్టాలు పంపిణీ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడుతున్నారు. అప్పట్లో పట్టాతోపాటు జగనన్న గృహనిర్మాణానికి రుణం మంజూరు చేయిస్తానని వైకాపా నాయకులు ప్రకటించడం చర్చనీయాంశమైంది.

# ఇక రైళ్ల నిరీక్షణకు చెల్లు!

గుంతకల్లు : 'సిగ్నల్ కోసం రైల్వే స్టేషన్‌కు కిలోమీటర్ల దూరంలో రైలు వేచి ఉండే పరిస్థితులు పోనున్నాయి. ఇక నుంచి రైళ్ల కోసం ప్రయాణికులు గంటల తరబడి రైల్వేస్టేషన్లలో నిరీక్షించాల్సిన అవసరం ఉండదు' అని గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త, ఏడీఆర్‌ఎం సుధాకర్ పేర్కొన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సిగ్నల్ అండ్ టెలికాం విభాగం సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్ డివిజన్‌లో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థపై లోకో పైలెట్ (రైల్వే డ్రైవర్లు), అసిస్టెంట్ పైలెట్‌లకు (సహాయ డ్రైవర్లు) అవగాహన కల్పించే మార్గదర్శక (గైడ్‌లెన్స్) పుస్తకాలను డీఆర్‌ఎం, ఇతర విభాగాల అధికారులు శనివారం గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడారు. ప్రస్తుతం రైలు స్టేషన్ దాటిన తరువాతనే మరో రైలు రావడానికి అనుమతించే వారు. కొత్త సిగ్నల్ వ్యవస్థ ద్వారా ఒకదాని వెనుక ఒకటి.. ఒకేసారి పది రైళ్లను అనుమతించేందుకు, నడిపేందుకు వెసులు బాటు కలగనుందని వివరించారు. ఫలితంగా ప్రయాణికులు గంటల తరబడి రైల్వే స్టేషన్లలో వేచి ఉండే పరిస్థితి ఇక ఉండదన్నారు. ప్రస్తుతం గుంతకల్లు డివిజన్‌లో గుంతకల్లు - మొలగవల్లి స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ వ్యవస్థ చక్కగా పనిచేస్తోందని డీఆర్‌ఎం వివరించారు. అంచెలవారీగా డివిజన్ అంతటా ఈ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగాచార్యులు, సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడ పేరు.. అక్కడ చదువు

పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. పిల్లల పేర్లు మాత్రమే తమ పాఠశాలల్లో చూపిస్తున్నారు.. వారి చదువులు మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో సాగించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. నర్సీపట్నం మండలంలో కేబీపాలెం, నగరం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సంధ్య, సూర్యప్రకాశ్‌ల పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు పంపించి ప్రభుత్వ పాఠశాలల్లో చూపించడంతో వారిద్దరిపై వేటు వేశారు. చోడవరం మండలంలోనూ కొంతమంది ఉపాధ్యాయులు ఈ తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి చర్యలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో గురువుల లీలలు బయటపడుతున్నాయి. వాటిపై ప్రాథమిక విచారణ చేపట్టి ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఈ తరహా అక్రమాలు చాలానే జరిగినట్లు గుర్తించినా ఆ వివరాలు బయటకు




రాకుండా విద్యాశాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గతేడాది మొదలుపెట్టిన అపార్ నమోదు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి విద్యార్థుల లెక్కలు తేలకపోవడం కూడా ఓ కారణమని సంబంధిత అధికారులే చెబుతున్నారు.

**ప్రవేశాల్లో మాయాజాలం..** విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ఆయా పాఠశాలల్లో పోస్టులు కోతపెడతారని కొంతమంది ఉపాధ్యాయులు ప్రవేశాలను (అడ్మిషన్లు) రికార్డుల్లోనే చూపిస్తున్నారు. వారు బడికి రాకపోయినా హాజరుపట్టీలో మాత్రం వచ్చినట్లే టిక్ పెట్టేటస్తున్నారు. నవోదయ, సైనిక్ పాఠశాలలు, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకే ఎక్కువ అవకాశం కల్పిస్తుంటారు. దీనికోసం ప్రైవేటు స్కూల్ పిల్లలను కొన్నిచోట్ల సర్కారీ బడుల్లో చదువుతున్నట్లు చూపిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 1,97,049 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,55,809 మంది వివరాలు అపార్‌లో నమోదు చేశారు. ఇంకా 41,418 మంది పెండింగ్‌లో ఉన్నారు.

**మిగతా వారిపై దృష్టి..** ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న ఒకటో తరగతి నుంచి జూనియర్ కళాశాల విద్యార్థుల వరకు 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' ఐడీ పేరిట అపార్ నమోదు చేయిస్తోంది. ఒక విద్యార్థి అడ్మిషన్ ఒకే చోట ఉండాలి.. రెండు మూడుచోట్ల చూపడానికి వీల్లేదు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి అపార్ నమోదులో అనధికార విద్యార్థులు వెలుగులోకి వస్తున్నారు. ఈ విషయమై డీఈవో అప్పారావునాయుడు వద్ద ప్రస్తావించగా పరీక్షలు దగ్గర పడడంతో అపార్ నమోదుపై ఒత్తిడి తగ్గించారని, అందుకే ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. అనధికార విద్యార్థుల వివరాలు కొన్నిచోట్ల వెలుగు చూడగా ఇద్దరిపై చర్యలు తీసుకున్నామని మిగతా వారిపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చేందుకు యత్నించగా ఉపాధ్యాయులు అందుబాటులో లేరని ఎంఈవో తలుపులు చెప్పారు.

# పల్లె పయనం.. ఇక పదిలం

నంద్యాల : కొన్నేళ్లుగా నిర్వహణ, మరమ్మతులు కరవై దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మోక్షం కలుగనుంది. ఇటీవల ఆర్‌అండ్‌బీ రహదారులపై గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టింది. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో ఈ రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త రహదారులు వేయకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో చాలా గ్రామాల పరిధిలో రోడ్లు రూపు కోల్పోయాయి. త్వరలో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత శాఖ అధికారులను ప్రతిపాదనలు పంపాలని ఇటీవల ఆదేశించింది.

**ఐదేళ్లు పట్టించుకోలేదు**జిల్లా పంచాయతీరాజ్‌లో రెండు విభాగాలు ఉన్నాయి. పీఐయూ నుంచి 49 రోడ్లకు ప్రతిపాదనలు పంపారు. 183.01 కి.మీల పొడవున మరమ్మతులకు రూ.68.56 కోట్లతో ప్రతిపాదించారు. పీఆర్ డివిజన్ నుంచి 47 రోడ్లకు 184.94 కి.మీల పొడవున మరమ్మతులు చేసేందుకు రూ.83.06 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ బాగా దెబ్బతిన్న బీటీ రోడ్లే. వీటిని గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేకపోవడంతో ఛిద్రమయ్యాయి. కొన్ని రహదారు లపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. మరికొన్ని రహదారులపై తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు దర్శనమిస్తున్నాయి. పంట పొలాల మధ్య వేసిన రహదారులు కోతకు గురవడంతో వీటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**ఎట్టకేలకు వీటికి మోక్షం**

పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలంలో ఎనిమిది చోట్ల రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి నంద్యాల- నందికొట్కూరు రోడ్డు నుంచి భోగేశ్వరం రహదారి వరకు 4.17 కి.మీల పొడవున దారి దారుణంగా ఉంది. గని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పైబోగుల రోడ్డు, ఎన్‌ఎన్ రోడ్డు నుంచి- బిలకలగూడూరు వరకు దారి ఛిద్రమైంది. 6.9 కి.మీ ఉన్న చిందుకూరు- పరమటూరు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. మంచాలకట్ట- ఎల్‌కే తండా రహదారి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో ఈర్నపాడు- మణికంతాపురం మధ్య 4 కి.మీ, మణికంఠాపురం- ఓంకారం మధ్య 3.3 కి.మీ, బండిఆత్మకూరు- ఈర్నపాడు మధ్య 11 కి.మీల పొడవున్న రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం మహదేవపురం నుంచి కె.కొత్తూరు వరకు 2.58 కి.మీలు, బాచపల్లి నుంచి అహోబిలం వరకు 9 కి.మీల ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయి.

నంద్యాల మండలంలోని పోలూరు- రాయమాల్పురం, అయ్యలూరు- మసీదుపురం, గోస్పాడు మండలం జిల్లెల్ల- పసురపాడు రోడ్డును మరమ్మతులు చేయనున్నారు.

# ‘తెల్ల’బోయిన మద్దతు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. మద్దతు ధర రూ.7,521గా ప్రకటించింది. మంచి ధర ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. మద్దతు ధర వద్దే సీసీఐ తిరకాసు పెట్టింది. తేమ 8 శాతం వరకు ఉంటేనే పూర్తి మద్దతు ధర లభిస్తుంది. 9–12 శాతం వరకు తేమ ఉంటే ప్రతి ఒక్క శాతానికి మద్దతు ధరలో కోత విధిస్తోంది. తేమ 12 శాతానికన్నా ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడం లేదు. తేమ పేరుతో కోత విధిస్తుండటంతో చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 15 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టింది. క్వింటా రూ.7,521 మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గిపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాలవైపే మొగ్గు చూపుతున్నారు. కానీ పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ ప్రతినిధులు చుక్కలు చూపిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరోవైపు 2–5, 10 క్వింటాళ్ల పత్తిని అమ్ముకునేందుకు వారం రోజులపాటు వాహనాలతో నిరీక్షించే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనల పేరుతో..**



సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి క్వింటా రూ.7,072 నుంచి గరిష్ఠంగా రూ.7,471 పలికింది. ఉమ్మడి జిల్లాలో తెల్ల బంగారం సాగు చేసిన రైతులు జిల్లాలోని 15 జిన్నింగ్ మిల్లుల్లో విక్రయిస్తున్నారు. సీసీఐ నిబంధనలకు లోబడి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటా రూ.7,521కు ఇప్పటివరకు ఏ ఒక్క రైతు నుంచి కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

**కొనుగోళ్లు అంతంతే..**

కర్నూలు జిల్లాలో 1.97 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. ఎకరాకు 7.41 క్వింటాళ్ల చొప్పున హెక్టారుకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల మేరకు 3,72,546 మెట్రిక్ టన్నుల తెల్ల బంగారం పండినట్లు అంచనా. సీసీఐ గతేడాది డిసెంబరు నాలుగో వారం వరకు కొనుగోలు చేసింది.. 3.24 లక్షల క్వింటాళ్లు మాత్రమే కావడం గమనార్హం. ఒక రైతుకు వచ్చిన మొత్తం దిగుబడిలో 40 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించింది. ఒక రైతుకు గరిష్ఠంగా 20 క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తే అందులో 8 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. మిగిలిన 12 క్వింటాళ్లను తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని అన్నదాతలు నష్టపోయే పరిస్థితి నెలకొంది. పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో యంత్రాలు పనిచేయక వారం రోజులకు పైగా పత్తి కొనుగోళు ఆగిపోయాయి. ఆదోనిలో క్రిస్మస్ పండగ పేరుతో కొనుగోళ్లు ఆపేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 2.10 లక్షల హెక్టార్లకుపైగా పత్తి సాగైంది. నాలుగు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి దిగుబడులు వచ్చాయి. కానీ సీసీఐ కొనుగోలు చేసింది అంతంతమాత్రమే కావడం గమనార్హం.‘13,890 మంది రైతుల నుంచి నాలుగు మార్కెట్ల పరిధిలో రూ.237.22 కోట్ల విలువ చేసే 3,24,465 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ప్రతినిధులు కొనుగోలు చేశారు. రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయి’ అని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి తెలిపారు.

# రైలు మార్గం సుగమం

డోన్ : డోన్– గుంతకల్లు రైలు మార్గంలో డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. బుగ్గానిపల్లె– పాణ్యం వరకు 19.35 కి.మీ. మేర చేపట్టిన పనులను ఇటీవల రైల్వే భద్రతా కమిషనర్ మాధవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గుంతకల్లు నుంచి పాణ్యం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా రైళ్లు వెళ్లడానికి మార్గం సుగమం అయ్యింది. గుంతకల్లు డివిజన్ పరిధిలో డోన్ కూడలికి ఎంతో పేరుంది.. డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తికావడంతో రైళ్లవేగం పెరగడంతోపాటు వాటి సంఖ్యా పెరిగే అవకాశం ఉంది.

**129 కి.మీ. మేర పనులు పూర్తి**



గుంతకల్లు– గుంటూరు( 403 కి.మీ) రైలు మార్గాన్ని డబ్లింగ్, విద్యుద్దీకరణ చేసేందుకు కేంద్రం గతంలో రూ.3,280 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గుంతకల్లు నుంచి డోన్ రైల్వే జంక్షన్, బేతంచెర్ల, పాణ్యం వరకు 129 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే ఎద్దులదొడ్డి– మద్దికెర, మల్కాపురం– డోన్ స్టేషన్ల మధ్య పనులు పూర్తికావడంతో రైళ్ల వేగం పెరిగింది. మల్కాపురం నుంచి బేతంచెర్ల మీదుగా బుగ్గానిపల్లె వరకు రాకపోకలకు అనుమతులు లభించాయి.పనులు పూర్తయిన నేపథ్యంలో బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో చిన్న అమరావతి, పెద్ద అమరావతి, ప్రశాంతి, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

**తప్పనున్న నిరీక్షణ**గుంతకల్లు, గుత్తి వైపు నుంచి ఆర్ఎస్ పెండేకల్లు జంక్షన్, డోన్ జంక్షన్ మీదుగా బెంగళూరు, రామేశ్వరం, న్యూఢిల్లీ, లక్నో, మైసూర్, జైపూర్, మంగళూరు, భువనేశ్వర్, ఓఖా, గోరఖ్‌పూర్, హవుడా, వాస్కోడిగామా, గోవా, శిరిడీ వంటి ప్రధాన నగరాలు, తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, తిరుపతి, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్‌లతో కలిపి 45 నుంచి 50 వరకు, గూడ్స్ రైళ్లు 25 వరకు తిరుగుతున్నాయి.ఏక వరుస లైన్(సింగిల్) ఉండటంతో గుంతకల్లు నుంచి డోన్, డోన్ నుంచి నంద్యాల, గుంటూరుకు రైళ్లు నెమ్మదిగా వెళ్తున్నాయి.. ఒక రైలు వస్తుందంటే మరొకటి స్టేషన్(క్రాసింగ్)లో ఆపేస్తున్నారు. ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

# మన భద్రత.. మనదే బాధ్యత



అనంతపురం : వాట్సాప్‌లో బ్యాంకు పేర్లతో కానీ, ప్రభుత్వ పథకాల పేర్లతో కానీ వచ్చే మెసేజ్‌లు పట్ల, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాటిని డౌన్లోడ్ చేయొద్దని సూచిస్తూనే.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ స్టాక్, షేర్ మార్కెట్ల గురించి వచ్చే ప్రకటనకు ఆకర్షితులు కావొద్దని హెచ్చరిస్తున్నారు.

ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని, లేదా ‘సైబర్ క్రైం.జీవోవీ.ఇన్’ అనే వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

చరవాణి ఇప్పుడు అందరికీ నిత్యావసరం. జాగ్రత్తగా ఉపయోగిస్తే ఆనందం మన సొంతం. అదే ఆధారంగా చేసుకొని ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు జిత్తులతో ఎత్తులు వేస్తూ పలువురిని మోసగిస్తున్నారు. ఆశలు, బలహీనతలే వారికి పెట్టుబడి.. బోల్తా కొట్టించేందుకు ఉద్యోగాలు, పెట్టుబడులు, షేర్ మార్కెట్లు ఇలా వివిధ రూపాల్లో పక్కదారి పట్టించి పెద్ద ఎత్తున డబ్బు కొల్లగొడుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ ‘సైబర్ సురక్ష అనే కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. నిత్య చైతన్యంతో సైబర్ దారుణాలకు అడ్డుకట్ట వేయాలనేదే కార్యక్రమ ఉద్దేశం.

**సైబర్ వాలంటీర్లు..**

జిల్లాలోని కళాశాలల్లో చురుగ్గా విద్యార్థులను వారిని ఒక బృందంగా తయారు చేస్తారు. వారిని సైబర్ వాలంటీర్లు అని పిలుస్తున్నారు. వీరు చేయాల్సిన మొదటి పని.. కుటుంబ సభ్యులను, చుట్టుపక్కల వారికి, గ్రామాల్లో అవగాహన కల్పించడం. ఇందుకు ‘ఎన్‌సీఆర్‌పీ’ పోర్టల్‌లో సైబర్ వాలంటీర్లుగా స్వచ్ఛందంగా నమోదుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాలు, కూడళ్లలో సైబర్ మోసాలను ఎలా ఎదుర్కోవాలో వీడియోల రూపంలో ప్రదర్శిస్తున్నారు. ఇందుకు మూడు డిజిటల్ డిస్‌ప్లే వాహనాలను ఏర్పాటు చేశారు. రికార్డు చేసిన ఆడియోలను ‘టాంటాం’ ఆటోల్లో మైక్‌ల ద్వారా తెలియజెప్పుతారు.

**ప్రభావశీలుర భాగస్వామ్యం**

సామాజిక మాధ్యమాల్లో తమ వీడియోలతో అభిమానులు సంపాదించుకున్న వారిని గుర్తించి.. వారి ద్వారా సైబర్ నేరాలపై అవగాహన వీడియోలు చేయిస్తున్నారు. అత్యంత ప్రభావశీలురతో ప్రజలకు ఉపయోగపడే వీడియోలు, సందేశాలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకు పలువురు ప్రభావశీలురు అవగాహన కార్యక్రమాలకు మద్దతు పలికారు.

**ప్రచారంలో వైవిధ్యం**

నీవు డబ్బు పంపకపోతే నీ బ్యాంకు ఖాతా స్తంభింప జేస్తాం.., మీరు చెప్పినట్టు వినకపోతే మీ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతాం.. అంటూ సైబర్ నేరగాళ్లు వేసే ఎత్తుగడలు పసిగట్టేలా అవగాహనా కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నారు. ఇటీవల ‘డిజిటల్ అరెస్టు’ విషయంలో ఓ వీడియోకాల్ ద్వారా అధికారి రూపంలో బెదిరిస్తున్న తీరును కళ్లకు కట్టేలా రూపకల్పన చేశారు.

**అపరిచితులతో జాగ్రత్త**

ఇంటి వద్దనే పనిచేస్తూ సులువుగా డబ్బు సంపాదించుకోవచ్చు అనే ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దని అవన్నీ ‘ఇన్వెస్ట్ ఫ్రాడ్’ అని అవగాహన కల్పిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ పేరుపై కొరియర్ వచ్చిందని అందులో డ్రగ్స్ ఉన్నాయంటూ భయపెట్టే ‘కొరియర్ ఫ్రాడ్’ తీరును వివరిస్తున్నారు. ‘లోన్ యాప్‌లు’ మోసపూరితమని వాటి జోలికెళ్లొద్దంటూ ఉదాహరణలు చెబుతున్నారు.

# కీలక రహదారి.. నరకప్రాయంగా మారి



అనంతపురం : సరకు రవాణాను వేగవంతం చేయడానికి రామనగర–కృష్ణపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్–67) పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. కర్ణాటకలోని బళ్లారి నుంచి ఉమ్మడి అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాలను కలిపే ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రెండు రాష్ట్రాల అభివృద్ధిలో కీలకంగా మారనుంది. ఇంతటి ప్రాధాన్యమున్న మార్గాన్ని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా సరకు రవాణా అత్యంత దుర్లభంగా మారింది. ప్రయాణికులు సైతం ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తాడిపత్రి నుంచి కడప జిల్లాలోని ఎర్రగుంట్ల వరకు నిర్మాణ పనులు మొదలయ్యాయి. విడపనకల్లు మండలం డొనేకల్లు నుంచి గుత్తి మార్గానికి ఇప్పటికీ మోక్షం లభించలేదు.

**గుత్తేదారు మృతితో..**

బళ్లారి సరిహద్దు నుంచి గుంతకల్లు మీదుగా గుత్తి వరకు 57 కిలోమీటర్ల రహదారి పనుల్ని ఎస్‌ఆర్‌కే సంస్థకు అప్పగించారు. రూ.668 కోట్ల అంచనా వ్యయంతో 2016లోనే పనులు మొదలుపెట్టారు. 2019 వరకు పనులు వేగంగా జరిగాయి. రూ.557 కోట్ల మేర ఖర్చు చేసి 86 శాతం మేర పనులు పూర్తిచేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక నత్తనడకన సాగుతూ వచ్చాయి. 2021లో గుత్తేదారు మరణించడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఎన్‌హెచ్ అధికారులు కాంట్రాక్టును రద్దు చేశారు.

**పూర్తి కాకుండానే పగుళ్లు..**

దేశంలోనే ప్రయోగాత్మకంగా ఎన్‌హెచ్–67ను సిమెంటు రోడ్డుగా తీర్చిదిద్దడానికి పనులు చేపట్టారు. 2021 నాటికే చాలావరకు నాలుగు వరుసల నిర్మాణం పూర్తయింది. విడపనకల్లు మండలం డొనేకల్లు, కడదరబెంచి, గడేకల్లు, పెంచలపాడు గ్రామాల పరిధిలో వంతెనలు, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. నాణ్యత లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో 2019కు మందు నిర్మించిన సిమెంటు రోడ్డుకు పగుళు వచ్చాయి. బళ్లారి సరిహద్దు నుంచి గుంతకల్లు వరకు సుమారు 30 చోట్ల ఈ దుస్థితి నెలకొంది. బళ్లారి నుంచి గుంతకల్లు మీదుగా నిత్యం వేలాది సరకు రవాణా వాహనాలు కృష్ణపట్నం పోర్టుకు రాకపోకలు సాగిస్తుంటాయి. అసంపూర్తి పనులతో ప్రయాణ సమయం రెండు, మూడు గంటలు పెరుగుతూ.. ఇంధన ఖర్చు అధికంగా ఉంటోందని వాహనదారులు, వాహనాలు గ్రామాల మీదుగా వెళ్తున్నప్పుడు ఎగుస్తున్న దుమ్ముతో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

**మరమ్మతులు చేపడతాం..- సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఎన్‌హెచ్ విభాగం**

దెబ్బతిన్న రహదారిని బాగు చేసేందుకు టెండర్లు పిలిచాం. త్వరలోనే పనులు మొదలుపెడతాం. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అంచనాలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాం. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపడతాం.

# 12 లేఖలు రాసినా స్పందన కరవు

అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య వైఖరి.. అసమర్థత కారణంగా మూడున్నరేళ్లపాటు హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయానికి పక్కా భవన సముదాయం లేకుండా పోయింది. అనంత నగర నడిబొడ్డున ఉండే హెచ్చెల్సీ ప్రాజెక్టుకు చెందిన రూ.85 కోట్లు ఖరీదు చేసే 3.82 ఎకరాలను గత ప్రభుత్వం రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖకు స్వాధీనం చేసింది. ప్రత్యామ్నాయంగా కొత్త భవన నిర్మాణానికి రూ.10 కోట్లు ఇస్తామంటూ అప్పట్లోనే జీవో 32లో పేర్కొన్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజా అంచనాల ప్రకారం కొత్త భవన నిర్మాణానికి రూ.14.65 కోట్లు అవుతుందని.. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలంటూ జిల్లా జలవనరుల శాఖ సీఈ, హెచ్చెల్సీ ఎస్ఈ ఇప్పటికే ఏపీ వైద్య,ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఎంహెచ్ఐడీసీ) ఎండీ, సీఈలకు 12 లేఖలు పంపినా స్పందన లేదంటే నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

**సర్వజన వైద్యశాల విస్తరణకు..**

అనంత నగరంలో తెలుగుతల్లి కూడలి పక్కనే సర్వే నెంబరు 2019–1లో 3.82 ఎకరాల ఆవరణలో హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయ భవన సముదాయం ఉండేది. ఈ స్థలాన్ని అప్పట్లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల విస్తరణ భవన సముదాయాల నిర్మాణానికి తీసుకున్నారు. జిల్లా జలవనరుల శాఖ(ఎంఐ) ఆవరణలో పక్కా భవన నిర్మాణానికి రూ.10కోట్లు ఇస్తామంటూ 2021, మార్చి 22న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవో 32లో స్పష్టంగా పేర్కొన్నారు. జీం3 స్థాయిలో భవనాన్ని నిర్మించాలని డిజైన్, అంచనా, సాంకేతిక ఆమోదం.. ఇలా



అన్నింటిని ఏపీఎంహెచ్ఐడీసీ ఎండీ, సీఈలకు కూడా పంపారు. అప్పటి కలెక్టర్ ఒత్తిడితో 2021, అక్టోబరు 14న ఆగమేఘాలపై ఎస్ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది.

**అతిథి భవనంలో అష్టకష్టాలు**పాత భవన సముదాయంలో ఉన్న హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయాన్ని మూడున్నరేళ్ల క్రితం ఖాళీ చేశారు. అక్కడి నుంచి హెచ్చెల్సీ కాలనీలోని ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. అత్యంత దయనీయం ఏమంటే ఓ అతిథి భవనంలో ఎస్ఈ కార్యాలయం, డిజైన్, టెక్నికల్, పరిపాలన.. ఇలా పలు విభాగాలు వేర్వేరు చోట్లా ఏర్పాటు చేశారు. అష్టకష్టాలు పడుతూ చాలీచాలని గదుల్లో నిర్వహించే దుస్థితి తలెత్తింది. ఈ కష్టాలన్నీ చెప్పినా ఏపీఎంహెచ్ఐడీసీ యంత్రాంగం కనికరించలేదు. రూ.85కోట్లు ఖరీదు చేసే స్థలాన్ని తీసుకుని...రూ.14.65 కోట్లు ఇవ్వడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పేదల గూడు.. కూటమి తోడు

కర్నూలు : గూడు లేని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏడాదికి ఐదు లక్షల చొప్పున ఐదేళ్ల కాలంలో 25 లక్షల గృహ నిర్మాణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. పీఎంఏవై అర్బన్– 2.0 పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు 18,522 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంది.. మార్చిలో ఇళ్లు మంజూరు అవుతాయని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా నిర్మాణంలో ఉన్న 10,534 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంక్రాంతికి పనులు పూర్తి చేయించి రాష్ట్రంలో లక్ష ఇళ్లను ఒకేసారి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

**55 మండలాలకు అవకాశం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ పురపాలక సంఘాలతోపాటు బేతంచెర్ల నగర పంచాయతీ, కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 26 మండలాలు కలిపి మొత్తం 55 మండలాలు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉన్నాయి. కుడా పరిధిలో ఉంటే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–2.0 పథకానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారందరూ అర్హులవుతారు.

**అర్హులు ఎవరంటే**

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చేవారు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలు, భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఇదివరకెన్నడూ తమ పేర్లతో గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాకుంటేనే అర్హులవుతారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని తమ పరిధిలోని హౌసింగ్ ఏఈకి అందించాల్సి ఉంటుంది.

**బిల్లుల మంజూరుకు రంగం**

గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ గృహ నిర్మాణాల పేరుతో ఇళ్లు లేని పేదలకు గృహాలను మంజూరు చేశారు. ఆ తర్వాత బిల్లులు చెల్లించకుండా వైకాపా ప్రభుత్వం మొండికేసింది. బిల్లులొస్తాయన్న ఆశతో కొందరు అప్పులు చేసి ఇళ్లు పూర్తి చేసుకున్నారు. బిల్లులు రాక అల్లాడిపోయారు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గతంలో మంజూరైన ఇళ్లలో ఎన్ని పూర్తయ్యాయి? బిల్లు బకాయిలు ఉంత తదితర వాటిపై సర్వే చేయించింది. కర్నూలు జిల్లాలో 25,624 మంది లబ్ధిదారులకు రూ.41.64 కోట్లు, నంద్యాల జిల్లాలో 28,649 మందికి రూ.49.89 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందని తేలింది. ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వం లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించనుంది.

**కొరవడిన ప్రచారం**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇచ్చే రూ.2.50 లక్షలతో పాటు లబ్ధిదారులు మరో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు సొంతంగా పెట్టుకుంటే ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. పథకం బాగున్నా ప్రచారం కొరవడింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ ఏఈలు ప్రచారం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. నెల రోజుల కింద ప్రారంభించిన డిమాండ్ సర్వే సైతం నత్తనడకన సాగుతోంది. తమకు సొంతంగా స్థలాలున్నాయని.. గృహాలు మంజూరు చేయాలంటూ కర్నూలు జిల్లాలో 12,102, నంద్యాల జిల్లాలో 6,420 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

**అందరికీ అందించేలా..**

టిడ్కో గృహాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 29 వేల మంది లబ్ధిదారులకుగాను కేవలం 6,159 మందికి మాత్రమే ఇళ్లు అందజేశారు. 22,933 మంది గత ఐదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుణాలిచ్చేందుకు హడ్కో సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో టిడ్కో గృహాలకు మంచి రోజులు రానున్నాయి. టిడ్కో గృహ సముదాయాల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు త్వరలో వడ్డీ బకాయిలు చెల్లించి జూన్‌లో పెద్దఎత్తున గృహ ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**నాడు రూ.1.80 లక్షలు.. నేడు రూ.2.50 లక్షలు**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల కిందట మంజూరైన ఇళ్లలో 20 వేలకుపైగా నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించుకోలేదు. ఇవికాక ఉమ్మడి జిల్లాలో మరో 80 వేల మందికి గత ప్రభుత్వ హయాంలో స్థలాలిచ్చినా గృహాలు మంజూరు చేయలేదు.

గత వైకాపా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. ఆ నగదు సరిపోక చాలా మంది నిళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎంఏవై అర్బన్– 2.0 పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలకు పెంచింది. కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి అందించనుంది. గత ప్రభుత్వంతో పోలిస్తే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.70 వేలు ఇవ్వనున్నారు.

# ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు

రాజమహేంద్రవరం : ఆధార్ గుర్తింపు సంఖ్యలేని ఆరేళ్లలోపు చిన్నారులు జిల్లాలో 17 వేల మంది వరకు ఉంటారని అధికారులు అంచనాకు వచ్చారు. ఆధార్ సంఖ్య ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న దృష్ట్యా వీరందరికీ ఆధార్ నమోదు చేయించేందుకు నిర్ణయించారు. 0–6 మధ్య వయస్సున్న చిన్నారులకు ఆధార్ నమోదు కోసం జిల్లాలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తారు. తొలిదశలో ఈ అయిదు రోజులపాటు జరిగే ప్రత్యేక ఆధార్ నమోదు ప్రక్రియలో 84 బృందాలుగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఏ రోజు ఎక్కడ చిన్నారులకు నమోదు చేస్తారనే వివరాలు మండల కేంద్రంలోని కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించడంతో పాటు.. అంగన్‌వాడీ, సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం మున్సిపల్, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**పేరుతో కూడిన జనన ధ్రువీకరణ తప్పనిసరి**

ఆరేళ్లలోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేసే సమయంలో వారి పేరుతో కూడిన జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఒకవేళ ఆ పత్రంలో పేరు లేకుండా ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి తప్పక నమోదు చేయించాలి. తర్వాత పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఆధార్ నమోదు సిబ్బందిని కలిసి చిన్నారి తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ల వివరాలతో నమోదు చేయించుకుని పిల్లల ఆధార్ పొందాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# రిజరాయర్ల రూపు మారుతోంది!

అనకాపల్లి : వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన జలవనరులకు కూటమి ప్రభుత్వం జవసత్వాలు కల్పిస్తోంది. గత అయిదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పూయడానికి కూడా సొమ్ములివ్వలేదు. బటన్ నొక్కి భజన చేయించుకోవడమే తప్ప అన్నదాతల బాధల గురించి పట్టించుకోలేదు. ఫలితంగా సాగునీటి వనరులన్నీ అస్తవ్యస్తమై పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించలేకపోతున్నాయి. ఈ దశలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కొలువుతీరిన కూటమి సర్కారు సాగునీటి రంగాన్ని గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రాజెక్టులు, పంట కాలువల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు రాష్ట్ర విపత్తుల నివారణ నిధుల నుంచి సుమారు రూ.10 కోట్లు మంజూరు చేసింది. వాటితో కొన్ని పనులు మొదలుపెట్టగా మరికొన్ని పురోగతిలోకి తెస్తున్నారు. వీటితో జిల్లాలో రిజర్వాయర్ల రూపురేఖలు మారుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో నాలుగు ప్రధాన రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి



కింద 94,190 ఎకరాలు ఆయకట్టు భూములున్నాయి. జలాశయాల నిర్వహణకు నిధులివ్వకపోవడంతో గేట్లు, షట్టర్లు తుప్పుపట్టిపోయాయి. డ్యామ్, వాటి కుడి, ఎడమ కాలువల గట్లు చాలాచోట్ల బలహీనమైపోయాయి. కాలువలు పూడికలతో నిండిపోయాయి. గతంలో పడిన గండ్లు పూడ్చకపోవడంతో లీకులతో సాగునీరు వృథాగా పోయి ఆయకట్టు రైతులందరికీ న్యాయం చేయలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో ఏటా ప్రతిపాదనలు పంపించినా సొమ్ములు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం బడ్జెట్ సమస్య ఉన్నా విపత్తుల నివారణ నిధుల నుంచి కేటాయించి అన్నదాతలకు అండగా నిలిచింది.

**ఇవిగో పనులు..**

రైవాడ జలాశయం పరిధిలో రూ.2.70 కోట్ల పనులు చేపడుతున్నారు. ఇదివరకు రిజర్వాయర్ మొత్తం తుప్పలు, పెద్దపెద్ద పనికిరాని వృక్షాలతో నిండిపోయి కనిపించేది. ఇటీవల జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేశారు. ఇప్పుడు జలాశయం సుందరంగా కనిపిస్తోంది. రిజర్వాయర్ బండ్‌పై గోతులను పూడ్చేందుకు సిద్ధమవుతున్నారు. కాలువల నుంచి నీటిని విడిచిపెట్టే ఇన్‌టేక్ ఛాంబర్లలో మరమ్మతులు చేపట్టనున్నారు. కాలువల గట్లను పటిష్టపర్చనున్నారు. నీటి మట్టం తగ్గిన తర్వాత గేట్లకు పెయింటింగ్, గ్రీజు పూస్తారు.కోనాం జలాశయం పరిధిలో రూ. కోటి వ్యయంతో పనులు చేయను న్నారు. ఇప్పటికే తుప్పలు, డొంకలు తొలగించారు. డ్యామ్ గట్టుపై గోతులను పూడ్చారు. గేట్ల మరమ్మతులు, కాలువల్లో షట్టర్లను బాగుచేయాల్సి ఉంది. త్వరలో ప్రధాన పనులను పట్టాలెక్కించనున్నారు.

జిల్లాలో మేజర్ సాగునీటి ప్రాజెక్టు తాండవ పరిధిలో 18 పనులను రూ.2.11 కోట్లతో చేపట్టనున్నారు. ఈ జలాశయం కింద 55 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గతేడాది సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందించలేక వారబందీ అమలు చేయాల్సి వచ్చింది. తాజాగా చేపట్టబోయే మరమ్మతులు, పనులతో సాగునీటి బెంగ కొంతవరకు తీరనుందని జలవనరుల శాఖ ఈఈ త్రినాథం చెప్పారు.

# 455.. తాగునీటి పనులు రద్దు



గూడూరు : ఐదేళ్ల వైకాపా పాలనలో తాగునీటి పనులు పెద్దఎత్తున పడకేశాయి. వాటిని సకాలంలో పూర్తిచేయలేకపోవడం, మరికొన్ని అసలే చేపట్టకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పురోగతి లేని పనులన్నీ రద్దు చేసింది. నదుల అనుసంధానం ద్వారా 365 రోజులూ తాగునీరు అందించాలని కార్యాచరణ ప్రకటించింది. నదుల నుంచి పైపులైన్ల ద్వారా గ్రామాలకు తాగునీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

గూడూరు గ్రామీణ మంచినీటి విభాగం పరిధిలోని గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో 2021-22లో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా 1,212 పనులు మంజూరు కాగా.. రూ.165.78 కోట్ల నిధులు కేటాయించారు. రూ..100.20 కోట్ల అంచనాలకు సంబంధించి 455 పనులు నేటికీ చేపట్టలేదు. గూడూరు నియోజకవర్గ పరిధిలో చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో సముద్ర తీర గ్రామాలు ఎక్కువగా ఉండటంతో అక్కడ బోర్లు వేసినా ఉప్పునీరే వస్తుంది. కూటమి ప్రభుత్వ కొత్త ఆలోచన అమలైతే తీర ప్రాంతవాసుల తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగినట్లే.

**క్షేత్రస్థాయిలో ఇలా..**

వాకాడు మండలం రావిగుంటపాలెంలో 40 వేల లీటర్ల మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. 2021-22లో వైకాపా ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ నిధులతో రూ.42 లక్షల అంచనాలతో 60 వేల లీటర్ల ట్యాంకును మంజూరు చేసి టెండర్లు పూర్తిచేశారు. అయితే నేటికీ ట్యాంకు నిర్మాణానికి అడుగులు పడలేదు.

కోట మండలంలోని వావిళ్లదొరువు, పెద్ద పట్టపుపాలెం, కేశవరం, రాఘవాపురం, కొండుగుంట, సిద్దవరం, ఇలుకూరుపాడు గ్రామాల్లో రూ.1.02 కోట్ల అంచనాలతో చేపట్టిన 8 పనులు నిలిచిపోయాయి. గూడూరు గ్రామీణ మండలం తిప్పవరప్పాడులో రూ.25 లక్షలు, కుందకూరులో రూ.20 లక్షలతో మంచినీటి ట్యాంకులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు.

సూళ్లూరుపేట నియోజకవర్గం ఓజిలి మండలంలోని కురుగొండలో పదేళ్లుగా నీటి సరఫరా ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. 2022లో జల్ జీవన్ మిషన్ ద్వారా 90 వేల లీటర్ల మంచినీటి ట్యాంకు మంజూరు కావడంతో శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకును కూల్చేశారు. కొత్త ట్యాంకును నేటికీ నిర్మించలేదు.

**పనులు రద్దు చేస్తాం**

గత ప్రభుత్వంలోని 455 పనులు రద్దు చేస్తున్నాం. నదుల అనుసంధానం ద్వారా ప్రజలకు మంచి నీటిని అందించేందుకు కృషి చేస్తాం. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

సత్తార్ హుసేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, గూడూరు

# కృష్ణా నదిలో చేపల మాఫియా

నందికొట్కూరు : కృష్ణానది ఒడ్డున దళారులు తిష్ట వేశారు.. విలువైన మత్స్య సంపదను దోచుకుంటున్నారు.. నిషేధిత వలలతో వేట కొనసాగిస్తున్నారు.. నిత్యం పది వేల కిలోల వరకు చేపలను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద నిధులు వెచ్చించి చేప పిల్లలు వదులుతున్నారు.. ఇటీవల మత్స్యశాఖ ఆధ్వర్యంలో కృష్ణానదిలో 21 లక్షల వరకు చేపపిల్లలు వదిలారు. అలివి వలలతో వేట సాగిస్తూ అధికారులు వదిలిన చేపపిల్లల్ని సైతం ఊడ్చేస్తున్నారు.. దళారులకు సంబంధిత అధికారుల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది.. ఒకవేళ కొన్ని మీటర్లు ఉన్న అలివి వలలు కనిపిస్తే మత్స్యశాఖ అధికారులు, పోలీసులు అక్కడికక్కడే కాల్చేసేవారు.. ప్రస్తుతం నది ఒడ్డున, బోట్లలో భారీ వలలు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నది ఒడ్డున తిష్ట**

నందికొట్కూరు మండలం మల్యాల, జంగంపాడు, శాతనకోట, పగిడ్యాల మండలం నెహ్రూనగర్, ముచ్చుమర్రి, జూపాడుబంగ్లా మండలం చాబోలు, కొత్తపల్లి మండలం మాడుగుల, సంగమేశ్వరం, కపిలేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల మీదుగా కృష్ణానది ప్రవహిస్తుం



ది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు జలాశయాల్లో ఏటా 85 లక్షల వరకు చేప పిల్లలను వదులుతుంటారు. ఈ ఏడాది ఒక్క కృష్ణానదిలోనే 21 లక్షల చేప పిల్లలను ఎంపీ శబరి చేతులమీదుగా వదిలారు. అవి పెరిగిన తర్వాత స్థానిక మత్స్యకారులు పట్టుకోవడానికి అనుమతి ఉంది. ఇందుకు కృష్ణానది పరివాహక ప్రాంతంలో 1,200 మంది లైసెన్సులు ఇచ్చారు.

**నిషేధం ఉన్నా**


నదిలో నీటిమట్టం 790 అడుగులకు వచ్చినప్పుడు చేపల వేట చేపట్టాలి. ప్రస్తుతం 856 అడుగుల నీటిమట్టం ఉన్నా వేటాడుతున్నారు. స్థానికంగా ఉండే కొందరు వ్యాపారులు విశాఖపట్నం, కృష్ణా జిల్లాలకు చెందిన జాలర్లను పిలిపించారు. వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. వారు నది ఒడ్డున తిప్పలపై గుడారాలు వేసుకొని నివాసం ఉంటూ.. రాత్రివేళ నదిలోకి వెళ్లి నిషేధిత అలివి వలల (చేప పిల్లలూ పట్టుకొనేందుకు ప్రత్యేకంగా వాడేవి)తో వేట సాగిస్తున్నారు.

**శాఖల మధ్య సమన్వయం కరువు**కృష్ణా తీర గ్రామాల పరిధిలో ఏళ్ల తరబడి చిన్న చేపల అక్రమ వేట సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో కొందరు నాయకులను అక్రమార్కులు మచ్చిక చేసుకొని దందా కొనసాగిస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన మత్స్య, పోలీసు, అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయ లోపంతో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో సంయుక్త దాడులు చేస్తేనే మత్స్య సంపదను కాపాడుకోవచ్చని స్థానిక మత్స్యకారులు, ప్రజలు పేర్కొంటున్నారు.

**చిన్న చేపలకు డిమాండ్**

సాధారణంగా కృష్ణానదిలో వదిలే చేప పిల్లల్లో బొచ్చెలు, బొట్టిగెలు, రొయ్యలు, మోసు రకాలు ఉంటాయి. వీటిని ఔషధాలు, కాస్మోటిక్స్‌లో ఉపయోగిస్తారు. ఒకసారి అలివి వల నదిలో వేస్తే సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు చేపలు చిక్కుతాయి. వీటిలో సగం వరకు చేపపిల్లలే ఉంటాయి.. వాటిని నది ఒడ్డున ఆరబెట్టి రవాణా చేస్తున్నారు. పెద్ద చేపలు కిలో రూ.160 చొప్పున మార్కెట్‌కు తరలిస్తున్నారు. చిన్న వాటిని ఎండు చేపలుగా మార్చి కిలో రూ.100తో క్రయిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఏపీలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. గత నెల రోజుల్లోనే ఈ ప్రాంతం నుంచి ఐదు వేల టన్నుల వరకు ఎండుచేపలు తరలించినట్లు తెలుస్తోంది.

# ఆగుతూ.. సాగుతూ..!



తిరుపతి: గత ప్రభుత్వం ఉపాధి రంగాన్ని కూనీ చేసింది. నూతన పరిశ్రమలు తీసుకురాకపోగా ఉన్నవాటిని తరిమివేసింది. సూక్ష్మతరహా పరిశ్రమలకు కేంద్రం విడుదల చేసే నిధుల సద్వినియోగంలోనూ దారుణంగా విఫలమైంది. దీంతో నిరుద్యోగం పెరిగి యువత అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే పారిశ్రామిక రంగానికి భరోసా కల్పించే చర్యలు చేపట్టింది. అనుకున్నట్లుగా నూతన పాలసీలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే ఇంటికో పారిశ్రామికవేత్త కావాల్సిన అవశ్యకతను పలు సందర్భాల్లో సీఎం చంద్రబాబు నొక్కిచెబుతూ సూక్ష్మతరహా పరిశ్రమల ప్రాధాన్యతను వివరించారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అవసరాలు, లోటుపాట్లు గుర్తించేందుకు ఎంఎస్ఎంఈ సర్వే తలపెట్టారు.

**గడువులోగా పూర్తయ్యేనా..?**

గత ఏడాది నవంబర్ 29న ప్రారంభమైన ఈ సర్వే నెమ్మదిగా సాగుతోంది. జిల్లాలో ఆయా యూనిట్ల పరిధిలో 70 వేలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నట్లు పరిశ్రమల అధికారులు చెబుతుండగా ఇప్పటివరకు 13,435 మాత్రమే సర్వే చేశారు. సచివాలయ సిబ్బంది సర్వేలో పాల్గొని ఫిబ్రవరి 11వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉండగా పలు కారణాలతో సర్వే సాగడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**లాభాలెన్నో..!**ఎంఎస్ఎంఈ సర్వేతో కేంద్ర రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు పకడ్బందీగా అందించవచ్చు. సర్వే సమయంలో పరిశ్రమ పేరు, వ్యక్తి పేరు, ఉత్పత్తి, సామర్థ్యం, ఉద్యోగులు తదితర వివరాలు సర్వే పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉంది. ఈ వివరాలు రాయితీలు పొందే తరుణంలో ఉపయోగపడుతాయి. క్రెడిట్ గ్యారంటీ ట్రస్టు ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాల మంజూరుకూ ఈ సర్వేనే ఆధారం కానుంది. ఆధార్, వ్యక్తిగత వివరాలు వెల్లడించేందుకు పలువురు వెనుకాడుతున్నట్లు సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది చెబుతున్నారు.

**యజమానులు సర్వేకు సహకరించాలి**

ఎంపీడీవోలతో ఎప్పటికప్పుడు సర్వే ప్రగతిపై సమీక్షిస్తున్నాం. అధికారులు సర్వే చేసే సందర్భంలో ఎంఎస్ఎంఈల యజమానులు సహకరించాలి. యాప్‌లో నమోదు చేయించుకొని ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలి.రామ్మూర్తి, పరిశ్రమల శాఖ డీడీ

# వేతన జీవులకు కూటమి బాసట

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగులను తీవ్రంగా వేధించింది.. సకాలంలో వేతనాలు చెల్లించలేదు.. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేదు.. బకాయిల చెల్లింపుల్లోనూ రిక్తహస్తం చూపింది. సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తే గొంతునొక్కే ప్రయత్నం చేసింది. ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు సంబంధించి జీపీఎఫ్, సరెండర్ లీవులు, సీపీఎస్ కంట్రిబ్యూషన్, టీడీఎస్ చెల్లింపులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదముద్ర వేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో రూ.105 కోట్లకుపైగా పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇప్పటికే చాలామంది ఖాతాల్లో నగదు జమైంది.

**ఖాకీలకు రక్షణ**

పోలీసు శాఖకు సంబంధించి నాలుగు సరెండర్ లీవులు (ఆర్జిత సెలవులు) పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒక ఇన్‌స్టాల్‌మెంట్ సరెండర్ లీవుకు సంబంధించి రూ.10.05 కోట్లు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 3,500 మందికిపైగా పోలీసు సిబ్బంది ఉన్నారు. ఇప్పటికే 75 శాతం మంది ఖాతాలకు నగదు జమైంది.

2024 జనవరికి సంబంధించి ఏఎస్ఎల్ఎస్ బకాయిలు, గతేడాది జూన్ వరకు సప్లిమెంటరీ ఎస్ఎల్ఎస్ బిల్లులు, జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి.

వివిధ శాఖల్లో సర్వీస్ పోస్టేజ్ అండ్ స్టాంప్స్, స్టేషనరీ, అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులు, ఇంటర్నెట్ ఛార్జీలు, చిన్నపాటి మరమ్మతులకు సంబంధించిన బిల్లులను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో రూ.5 కోట్ల వరకు చెల్లింపులు చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులే ఉండి.. ఆదాయపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం టీడీఎస్ కింద సుమారు 15 వేల మంది ఉద్యోగులకు రూ.20.07 కోట్ల చెల్లింపులకు ఉపక్రమించింది.

విశ్రాంత ఉద్యోగులకు ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న (గ్రాట్యుటీ, కమ్యూటేషన్లకు సంబంధించిన నగదు వారి ఖాతాలకు జమవుతున్నాయి. విశ్రాంత ఉద్యోగులకు రూ.10 కోట్ల వరకు ఖాతాల్లో నగదు పడుతోంది.

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 9,506

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు : 33,000

**ఆరోగ్య బిల్లుకు అంగీకారం**

కర్నూలుకు చెందిన ఓ ఉద్యోగి కార్పొరేట్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకున్నారు. దీనికిగాను సుమారు



రూ.4 లక్షల వరకు ఖర్చైంది. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద బిల్లులు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ బిల్లులు మంజూరవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 700-800 మంది ఉద్యోగులకు సంబంధించి రూ.8 కోట్ల వరకు బిల్లులు పాసవుతున్నాయని ఖజానా శాఖ అధికారులు తెలిపారు.

**సీపీఎస్ ఉద్యోగులకు ఊరట**

ఉమ్మడి జిల్లాలో 15 వేల మందికిపైగా సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారు. సీపీఎస్ ఉద్యోగులు పది శాతం వాటా చెల్లిస్తే.. ప్రభుత్వం తన వాటాగా 12 శాతం ఇస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక నెల సీపీఎస్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లెక్కన సుమారు రూ.22.08 కోట్లు చెల్లింపులు జరుగుతున్నాయి.

**జీపీఎఫ్‌కు మార్గం**

ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా పొదుపు చేసుకున్న జీపీఎఫ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) నుంచి అత్యవసరాలకు రుణ రూపంలో నగదు తీసుకునే వెసులుబాటు ఉండేది. గత వైకాపా ప్రభుత్వం ఈ నిధులపైనా కన్నేసింది. ప్రభుత్వ పథకాలను ఈ నిధులను మళ్లించుకుని ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసింది. ఉమ్మడి జిల్లాలో 42 వేల మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగులు ఏపీజీఎల్ఐ పాలసీదారులుగా ఉన్నారు. పాలసీ గడువు ముగిసి నగదు అందుకునేందుకు చాలామంది ఎదురు చూస్తున్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కూటమి ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తోంది. గతేడాది మార్చి-జులై వరకు జీపీఎఫ్ కింద 1,500 మందికి సుమారు రూ.30 కోట్ల విలువైన బిల్లులు మంజూరు చేసింది.

# సమయపాలన పాటించేలా... జవాబుదారీ ఉండేలా..

అనకాపల్లి : కొంతమంది సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడం, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, ఆలస్యంగా వస్తూ త్వరగా వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీనివల్ల ప్రజలు ప్రభుత్వ సేవలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి అధికంగా ఫిర్యాదులు అందడంతో వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉద్యోగుల కోసం కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో సచివాలయ ఉద్యోగులు కీలకంగా మారారు. ప్రతి పౌర సేవకు ప్రజలు సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి. ప్రజలకు ఏ విధమైన కార్యక్రమాలు చేస్తే మేలు జరుగుతుందనే విషయాలపై కూటమి ప్రభుత్వం కూడా తరచూ వివిధ రకాల సర్వేలను నిర్వహిస్తోంది. దీనికోసం సచివాలయ సిబ్బందిని వినియోగిస్తున్నారు. పింఛన్ల పంపిణీ సైతం వీరే చేపడుతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి రానున్నాయి. దీంతో సచివాలయ



ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీతనం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

**హాజరులో మార్పు..:** వైకాపా ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు హాజరు వేయాల్సి వచ్చేది. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటల తర్వాత హాజరు వేస్తే వేతనం ఇచ్చేవారు. చాలామంది ఉద్యోగులు ఉదయం రాకుండా మధ్యాహ్నం వచ్చి హాజరు వేయించుకుని వేతనం తీసుకునేవారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు మాత్రం అందుబాటులో ఉండేవారు కాదు. దీంతో కూటమి ప్రభుత్వం ఉద్యోగుల హాజరులో మార్పు తీసుకొచ్చింది. తమ చరవాణుల్లో ఉండే యాప్‌లో ఉదయం, సాయంత్రం రెండుసార్లు హాజరు నమోదుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రత్యేక యాప్‌లో ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే హాజరు తీసుకుంటుంది. రోజుకు రెండు సార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం ఒకసారి హాజరు నమోదు చేసి సాయంత్రం వేయకపోతే ఆ రోజు సెలవుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఉద్యోగులు రోజుకు రెండు సార్లు విధిగా సమయపాలన పాటించి హాజరు వేస్తేనే వేతనం వచ్చేలా ప్రభుత్వం ఖజానా శాఖకు అనుసంధానం చేసింది.

# ప్ర'జల' కష్టాలు తీర్చేలా ప్రణాళిక

నందికొట్కూరు :వేసవి వచ్చేస్తోంది.. ప్రజల కష్టాలు పడకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో చిల్లి గవ్వ ఇవ్వలేదు. ఏటా వేసవిలో బిందెడు నీటి కోసం జనం ఇబ్బంది పడేవారు.. వీటిని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేయడంతో గ్రామీణ నీటిసరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.10.56 కోట్లు అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

**పడిపోతున్న భూగర్భజలాలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూగర్భ జలాలు ఇప్పటివరకు అనుకూలంగానే ఉన్నాయి.. ఎండలు పెరిగితే పడిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో సగటున 5.59 మీటర్లు, కర్నూలులో 7.64 మీటర్ల లోతులో జలం ఉంది.. కొన్ని మండలాల్లో పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది.

**అందుబాటులో 80 శాతం బోర్లు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8,690 చేతిపంపులున్నాయి. వీటిలో 20 శాతం బోర్లు పనిచేయడం లేదు. స్థానిక గ్రామ పంచాయతీ నిధులతో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ఫిబ్రవరి నెలలో బోర్ల ఫ్లష్ ప్రోగ్రామ్ చేపడతారు. బోర్లకు మరమ్మతులు చేయడం, నీరు లేకుంటే లోతు చేయడం వంటి పనులు చేసి గ్రామీణ ప్రజల నీటి సమస్య తీర్చనున్నారు.

ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, రుద్రవరం, శిరివెళ్ల, బనగానపల్లి, కొలిమిగుండ్ల, గడివేముల, పాణ్యం, గోస్పాడు, నందవరం, ఆత్మకూరు, మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లోని 56 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాల్సి ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గుర్తించారు. 18 మండలాల్లో ప్రస్తుతమున్న బోర్లను మరింత లోతు తవ్వనున్నారు. మంచినీటి కుంటలు మంచిగా ఉండేలా

కర్నూలు జిల్లాలో 26 మంచినీటి కుంటల్లో 0.400 టీఎంసీల నీటి నిల్వకుగాను ప్రస్తుతం 0.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నంద్యాల జిల్లాలో 13 మంచినీటి కుంటలు ఉండగా 70 శాతం వరకు నీటి నిల్వలున్నాయి. మరో 140-160 రోజుల వరకు వినియోగించుకునే అవకాశముంది.ఆదోని మండలం హాల్వి కుంట ఖాళీగా ఉండగా కుప్పగల్, మండగిరి, మదిరె, కాజీపురం, నేమకల్లులో 50-70 శాతం వరకు నీటి నిల్వలున్నాయి. కర్నూలు జిల్లాలో 20 కుంటల్లో 75-100 శాతం వరకు నీటి నిల్వలున్నాయి. ఈ నీరు మరో 120-140 రోజుల వరకు వినియోగించుకునే అవకాశముంది.

ప్రస్తుతం కాల్వల్లో నీటి ప్రవాహం కొనసాగుతోంది. వాటి నుంచి మంచినీటి కుంటల్లోకి నీటిని తరలించి పూర్తిస్థాయిలో నింపాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు.

# నిత్యావసరాల పంపిణీకి బయోమెట్రిక్ సమస్య

కదిరి : చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు అందిస్తున్న నిత్యావసర సరకుల పంపిణీలో బయోమెట్రిక్ సమస్యగా మారింది. గత ప్రభుత్వం ఇంటికే రేషన్ సరకులంటూ వాహనాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనాలు అరకొరగానే తిరుగుతున్నాయి. దీంతో ఎక్కువ శాతం స్టోర్లలోనే చౌకధాన్యం పంపిణీ చేస్తున్నారు. కార్డుదారులు సరకులు పొందేందుకు బయోమెట్రిక్ పనిచేయాలంటూ ఎండీయూ వాహనదారుడు వేలిముద్ర వేయాల్సి ఉంది. అయితే ఒక్కో వాహనానికి మూడు, నాలుగేసి చౌకదుకాణాలు కేటాయించారు. వీటన్నిటికీ అతనే వేలిముద్ర వేయాలి. ఆయా స్టోర్లలోని బయోమెట్రిక్ మిషన్ ఏదైనా ఒకటి మాత్రమే పనిచేస్తుంది. పొరపాటున ఆగిపోతే ఎండీయూ వాహనదారుడిని వెతుక్కుంటూ వెళ్లి వేలిముద్ర వేయించుకోవాల్సి వస్తోంది. ఏకకాలంలో మిగిలినచోట్ల బయోమెట్రిక్ పనిచేయక, దీనికితోడు వాహనాలు తిరగక పడిగాపులు తప్పని పరిస్థితని వాపోతున్నారు. అధికారులు స్పందించి డీలర్ల వేలిముద్రతోనే బయోమెట్రిక్ పనిచేసేలా చూసి కార్డుదారులకు నిరీక్షణ లేకుండా చూడాలని ఆశిస్తున్నారు.

'పుట్టపర్తిలోని 17, 18, 19, 20వ వార్డుల పరిధిలోని బీడుపల్లి, బడేనాయక్‌తండా, ప్రశాంతి గ్రాం, పెద్దకమ్మవారిపల్లిల దుకాణాల పరిధిలో 2,363 బియ్యం కార్డులున్నాయి. ఇక్కడ ప్రజాపంపిణీకి బయోమెట్రిక్ కోసం తీవ్ర ఇబ్బందిగా మారింది. పంపిణీ చేసే పదిరోజుల్లో ఏ దుకాణాల్లో ఎప్పుడిస్తారో తెలియక పడిగాపులు కాయాల్సి వస్తోందని వినియోగదారులు ఆందోళన చేస్తున్నారు.'



**వాహనాలకు రూ.లక్షలు.. కార్డుదారులకు తిప్పలు**

ఇంటి వద్దనే చౌకసరకుల పంపిణీ చేసే ఎండీయూ వాహనాలకు ప్రభుత్వం నెలవారీ రూ.53 లక్షలు చెల్లిస్తోంది. అయితే వాహనాలు మాత్రం అక్కడక్కడా మాత్రమే తిరుగుతున్నాయి. అయినా వాహనదారులే బయోమెట్రిక్‌తో వేలిముద్ర వేసే అధికారం ఉంది. ప్రజాధనం వెచ్చిస్తున్నా, వాహనాల సంగతెలా ఉన్నా సరకుల పంపిణీకి వేలిముద్ర ఇబ్బందులకు గురిచేస్తోందని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టోర్లలో 1వ తేదీ నుంచి 15 లేదా 16వ తేదీలోపు పంపిణీ పూర్తి చేసి మిగులు నిల్వ చూపాల్సి ఉంది. ఆలోపు సరకులు పొందకపోతే మరుసటి నెలలో అవకాశం ఉండదు. ఫలితంగా లబ్ధిదారులకు పడిగాపులు తప్పడం లేదు.

**ఇబ్బంది ఉన్నా.. అందరికీ సరకులు- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ**

జిల్లాలో కొన్ని చౌకదుకాణాల్లో పంపిణీలో సమస్య ఉంది. అయినా కార్డుదారులకు అందరికీ సరకులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పండగలు, లేదా ఎక్కువ మంది సరకులు తీసుకోలేని పరిస్థితి ఉంటే ఒకటి, రెండు రోజుల సమయం ఇస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే ప్రత్యేక చొరవతో పరిష్కారానికి కృషి చేస్తాం.

# పేదలకు సొంత గూడు

పుట్టపర్తి : గూడు లేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చేవారు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలు భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామని వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు మాయ చేసింది. జగనన్న కాలనీల పేరుతో ఆ పార్టీ నేతలు దందా చేశారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చినవారికీ సకాలంలో బిల్లులు జమ చేయలేదు. సొంతిళ్ల కోసం పేదలు కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు. పేదల ఇబ్బందులు గమనించిన కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. పీఎంఏవై అర్బన్ 2-0 పథకం కింద ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఇళ్లు లేని నిరుపేదలు వార్డు, సచివాలయాల్లో దరఖాస్తు చేసి, గృహ నిర్మాణ కార్యాలయంలో అందజేస్తున్నారు. అర్హులను గుర్తించి త్వరలో నూతన ఇళ్ల నిర్మాణాలు



ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

**జిల్లావ్యాప్తంగా 37,512 దరఖాస్తులు**

రాష్ట్రంలో సొంటి నిర్మాణానికి అత్యధిక దరఖాస్తులు జిల్లాలోనే వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 5 వేల నుంచి 15 వేల దరఖాస్తులు రాగా, శ్రీసత్యసాయి నుంచి ఏకంగా 37 వేల దరఖాస్తులు వచ్చాయి. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేవారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు అందించనున్నారు. అందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం లక్ష చొప్పున అందిస్తారు.

**ఎంపికకు అర్హతలివే..** గత ప్రభుత్వాల హయాంలో స్థలాలిచ్చి పక్కా గృహాలు మంజూరు కానివారు, గృహం లేనివారు, ఏడాదికి రూ.3 లక్షల ఆదాయ పరిమితి ఉన్నవారు. పట్టణాల్లో నివాసం ఉన్నవారు కనీసం ఐదేళ్లు నివాసం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. దరఖాస్తు చేసుకునేవారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా తనిఖీ చేస్తారు. అర్హులను యాప్‌లో నమోదు చేసిన తర్వాత లబ్ధి చేకూరనుంది.

**అర్హులందరికీ మంజూరు చేస్తాం - వెంకటనారాయణ, జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి**

పక్కాగృహాల నిర్మాణానికి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇల్లు కావాల్సినవారు సంబంధిత పత్రాలతోపాటు కుల ధ్రువీకరణపత్రం అందజేయాలి. దరఖాస్తుల నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. అర్హులందరికీ మంజూరు చేస్తాం.

# పాడి రైతులకు భారీ ఊరట



అనంతపురం : వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2019లో పాడి పశువులు చనిపోతే బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలనే ఉద్దేశంతో వైఎస్ఆర్ పశునష్ట పరిహార పథకంను తీసుకొచ్చింది. పేరుగా గొప్పగా పెట్టారు.. కానీ, తొలి విడత మాత్రమే అరకొర నిధులు ఇచ్చారు. ఆ తర్వాత నాలుగేళ్లుగా ఒక్కపైసా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే ఎన్ని కష్టాలున్నా.. పాడి రైతులను ఆదుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 6,120 పశువులకు 8,992 మంది రైతులకు రూ.28,22,37,000 పాత బకాయిలు అందించింది. గత వైకాపా హయాంలోని బకాయిలను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. వారి ఖాతాలకు సొమ్ము జమ కావడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కార్యాలయాల చుట్టూ తిరిగినా..**

వాస్తవానికి పశునష్ట పరిహారం పథకాన్ని వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చింది. పాడి రైతులకు ఆధారమైన పశువులు మరణిస్తే పరిహారాం అందజేసి ఆదుకుంటామని గొప్పగా ప్రచారం చేసుకున్నారు. కానీ, ఆచరణలో ఘోరంగా విఫలమయ్యారు. అప్పట్లో పాడిరైతులు పశువైద్యశాలలు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. కానీ, ఒక్కరికీ పరహారం చెల్లించలేదు.

**నేరుగా రైతుల ఖాతాలకు సొమ్ము**

పశునష్ట పరిహారం పథకం కింద పాడి పశువులు చనిపోతే దేశీయ పశువులకు రూ.30 వేలు, నాటి పశువులకు రూ.15 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది మాత్రమే చనిపోయిన పశువులకు పరిహారం అందించారు. ఆ తర్వాత ఒక్కపైసా నిధులు ఇవ్వలేదు. పశుసంవర్ధకశాఖ అధికారులు పశునష్ట పరిహారం పెండింగ్ బకాయిల జాబితాను కూటమి ప్రభుత్వానికి నివేదించారు. అనంతపురం జిల్లాలో 7,526 మంది రైతులకు సంబంధించి 4,234 పాడి పశువులు చనిపోయాయి. అందుకు రూ.23,77,08,000 విడుదల చేయగా, శ్రీసత్యసాయి జిల్లాలో 1,466 మంది పాడి రైతులకు సంబంధించి 1,886 పశువులు మృత్యువాతపడగా రూ.4,45,29,000 విడుదల చేశారు. నేరుగా పాడి రైతుల ఖాతాలకు సొమ్ము జమ అవుతోంది. మూడేళ్లుగా ఎదురుచూసిన పాడి రైతులకు సొమ్ము జమచేయడంతో కష్టాల్లో ఉన్న తమకు ఎంతో ఊరటనిచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి, పశువైద్యులు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వైకాపా సర్కారుకు, కూటమి ప్రభుత్వానికి ఇదే తేడా అని పాడి రైతులు చెబుతున్నారు.

**అర్హులందరికీ అందేలా చూస్తాం - డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ శుభదాస్ (ఉమ్మడి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు)**

ఉమ్మడి జిల్లాలో పశునష్ట పరిహార పథకం కింద కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అయితే ఖాతాలు సరిగా లేక, తప్పుగా పేర్లు ఉండటంతో సరిచేసి మళ్లీ పంపమన్నారు. 274 మంది పాడి రైతులకు రూ.76.56 లక్షలకు సంబంధించిన జాబితాను ప్రభుత్వం వెనక్కి పంపింది. అందులో అనంతపురం జిల్లాలో 214 మంది రైతులకు రూ.58.56 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 60 మంది రైతులకు సంబంధించి రూ.18 లక్షలు మాత్రమే రావాల్సి ఉంది. జాబితాలు సరిచేసి ప్రభుత్వానికి మళ్లీ పంపుతాం. వారందరికీ పరిహారం సొమ్ము కచ్చితంగా అందేలా చూస్తాం.

# ఆరు నెలలుగా వేతనాల్లేవ్



కళ్యాణదుర్గం : శ్రీరామిరెడ్డి నీటిపథకం కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు వాపోతున్నారు. గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా సంక్రాంతి పండగకు పస్తులుండాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ఈ పథకంలో ప్రస్తుతం 650 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నారు. పథకం నుంచి కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, అమరాపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని 1,059 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. వేతనాల విషయమై శుక్రవారం జిల్లా కేంద్రంలో యూనియన్ నాయకులు చర్చలు జరపనున్నారు. ఏకాభిప్రాయం రాకపోతే సమ్మె చేపడతామని కార్మికులు తెలిపారు. ఈ విషయమై నీటి పారుదలశాఖ ఎస్ఈ సురేశ్ వివరణ కోరగా తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నట్లు చెప్పారు. గుత్తేదారుల కాలపరిమితి త్వరలో ముగుస్తుంది. కొత్త వారి ఇప్పటికే టెండర్లు పిలిచాం. ఈ నెలాఖరులోగా పూర్తవుతాయి. త్వరలోనే మార్పులు చేసి కార్మికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**రూ.కోట్లలో బకాయిలు**

నీటిపథకం పరిధిలో ఫేస్-4 కిందట కళ్యాణదుర్గంలో 120 మంది, రాయదుర్గంలో 80 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి ఆరు నెలలకు సంబంధించి రూ.1.98 కోట్లు జీతాలు అందాల్సి ఉంది. ఫేస్-1 కింద 80 మంది కార్మికులు ఉండగా రూ.68.10 లక్షలు రావాల్సి ఉంది.

**సమ్మె చేస్తే తప్ప స్పందించడం లేదు - వన్నూరస్వామి, నీటి పథకం కార్మిక సంఘం జిల్లా కోశాధికారి**

ప్రాజెక్టు పరిధిలో 15 సంవత్సరాలుగా లైన్‌మెన్‌గా పని చేస్తున్నా. సమ్మె చేస్తే తప్ప జీతాలు రావడం లేదు. కార్మికుల్లో వ్యత్యాసాలు చూపుతూ గుత్తేదారులు జీతాలు వేస్తున్నారు. అందులోనూ కోతలు విధిస్తున్నారు. ఇలాగైతే కార్మికులు జీవనం సాగించడం కష్టంగా ఉంటోంది. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరుతాయనే ఆశతో ఉన్నాం.

**చేతిలో చిల్లిగవ్వలేక..- చిక్కన్న, బెళుగుప్ప**

పంప్‌హౌస్‌లో 14 ఏళ్లుగా లైన్‌మెన్‌గా పని చేస్తున్నా. భార్య ప్రసవ సమయంలో చేతిలో డబ్బులు లేక తీవ్ర ఇబ్బంది పడ్డా. జీతం ఇవ్వాలని గుత్తేదారుకు విన్నవించినా ప్రయోజనం లేదు. కుటుంబ పోషణ, ఆస్పత్రి ఖర్చులు, పిల్లల చదువులకు ఈ ఆరు నెలల్లో రూ.1.90 లక్షల వరకు అప్పు చేశా. జీతాలు రాకపోతే అప్పులు ఎలా తీర్చాలి. అధికారులు స్పందించి జీతాలు అందించాలి.

# గ్రామీణ విద్యార్థులకు నవోదయం




లేపాక్షి : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో సీటు లభిస్తే విద్యార్థి భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. జాతీయ విద్యా విధానం ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశం. అధునాతన పద్ధతుల్లో బోధనలు అందిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జవహర్ విద్యాలయాల ప్రత్యేకత.

**ఆరో తరగతి ప్రవేశానికి..**

2025-26 సంవత్సరానికి ఆరోతరగతిలో చేరేందుకు (18వ తేదీ) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి చేశారు. ఆరో తరగతిలో 80 సీట్లకు గాను 7,987 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రానికి ఉదయం 10.30 గంటలకే హాల్‌టికెట్లు తీసుకుని చేరుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం..100 మార్కులకు ఉంటుంది.

మెంటల్ ఎబిలిటి, గణితం, పేరాగ్రాఫ్స్ ఇలా మూడు విభాగాల్లో 80 ప్రశ్నలు ఉంటాయి.మెంటల్ ఎబిలిటి(మేధాశక్తి)కి సంబంధించి 50 మార్కులకు గాను 40 ప్రశ్నలు పది విభాగాల్లో ఉంటాయి. ఒక్కొక్క భాగంలో నాలుగు ప్రశ్నలు డయాగ్రమ్స్ రూపంలో ఉంటాయి.

గణితం సంబంధించి 25 మార్కులకు గాను 20 ప్రశ్నలు ఉంటాయి.

పేరాగ్రాఫ్స్ (గద్యభాగాలు)కు సంబంధించి 25 మార్కులకు గాను 20 ప్రశ్నలు ఉంటాయి.

**దళారుల మాటలు నమ్మొద్దు- నాగరాజు, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం, లేపాక్షి**

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉన్న సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ప్రశ్నపత్రం తయారీ నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) చూసుకుంటుంది. ఎంపికలో పైరవీలకు తావుండదు. పరీక్ష పూర్తిగా పారదర్శకంగా జరుగుతుంది. ప్రవేశాలు కల్పిస్తామని మాటలు చెప్పే దళారులను నమ్మొద్దు.

# ఒకే నంబరు.. రెండు కార్లు

అనంతపురం : నేరాలు కొంత పుంతలు తొక్కుతున్నాయి. ఒక పక్క సైబర్ నేరాలు ఆన్‌లైన్ ద్వారా ప్రజలను దోచుకుంటుండగా, మరికొందరు అసలుకు నకిలీ తయారు చేసి మోసగిస్తున్నారు. తాజాగా రవాణా అధికారులు కేటాయించిన నంబరును మరొకరు తమ వాహనానికి అమర్చుకుని చలామణి అవుతున్న ఘటన ఇటీవల అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. నగరానికి చెందిన శ్యాంప్రసాద్ 2024 ఫిబ్రవరిలో ఏపీ02బీఏ 1818 నంబరు గల కారును కొనుగోలు చేశాడు. ఆయన గతేడాది జూన్‌లో ఉరవకొండ మీదుగా బళ్లారి కారులో వెళ్లారు. మార్గమధ్యంలో జల్లిపల్లి టోల్‌గేట్ వద్ద సిబ్బంది కారును ఆపారు. ఫాస్టాగ్‌లో నిల్వ లేదని, టోల్ రుసుం చెల్లించాలన్నారు. చేసేదేమి లేక కారు యజమాని టోల్ రుసుం చెల్లించాడు. జులైలో వారు అమెరికా వెళ్లారు. వెళ్తూ కారును అనంతపురంలోని ఇంట్లో పార్క్ చేసి వెళ్లారు. వారు అమెరికాలో ఉ



ండగా మెసేజ్ వచ్చింది. 'తిరుమలలో రాంగ్ పార్కింగ్‌లో నిలిపి ఉంచడం వల్ల కారుకు జరిమానా విధించామని, వెంటనే చెల్లించాలని దాని సారాంశం. దీంతో శ్యాంప్రసాద్ అవాక్కయ్యాడు. తాము అమెరికాలో, కారు ఇంటి వద్ద ఉండగా ఫైన్ ఎలా పడిందని గందరగోళానికి గురయ్యారు. ఇటీవలే అమెరికా నుంచి అనంతపురం చేరుకుని ఆరా తీశారు. ఆయన నడుపుతున్న కారు నంబరుతో విజయవాడలో మరో కారు రోడ్డుపై తిరుగుతున్నట్లు గుర్తించారు. ఆ నంబరుకు ఫాస్టాగ్ బదిలీ కావడంతో బాధితుని ఫాస్టాగ్ క్యాన్సిల్ అయి పనిచేయడం లేదు. దీనిపై బాధితుడు రెండో పట్టణ పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఈ ఏడాది 4న నాలుగో పట్టణ పోలీసుస్టేషనులో ఇలాంటి కేసు నమోదైంది. రాంనగర్‌కు చెందిన నాగరాజుకు చెందిన ఏపీ02బీడీ 0169 కారుకు సంబంధించిన నంబరును ఇతరులు వినియోగిస్తున్నట్లు బాధితుడు గుర్తించాడు. వినియోగంలో ఉన్న ఫాస్టాగ్‌ను రద్దు పరిచి, కొత్త బ్యాంకు ఖాతాతో మరో ఫాస్టాగ్‌ను తీసుకున్నా పనిచేయడం లేదు. కొందరు అక్రమంగా ఫాస్టాగ్‌ను హ్యాక్ చేసి నకిలీ నంబరు ప్లేట్లు తగిలించుకుని తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# కాలువ గట్టు శిథిలం.. నీరు వంకపాలు

ఉరవకొండ: పీఏబీఆర్ కుడి కాలువ ఆధునికీకరణలో గత ఐదేళ్లు వైకాపా ప్రభుత్వం అలసత్వం చేసింది. ఫలితంగా కాలువ ఎక్కడిక్కడ శిథిలం అయ్యింది. దాంతో నీరు భారీగా వంక పాలవుతోంది. పీఏబీఆర్ నుంచి నెల రోజులుగా కుడి కాలువకు అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 700 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. అయితే కూడేరు మండలం హంసాయపల్లి సమీపంలోని ఎస్కేప్ ఛానల్ దగ్గర ఉన్న అండర్ టన్నెల్‌తో పాటు కాలువ గట్టు శిథిలం అయ్యింది. ఇక్కడ భారీగా నీరు లీకవుతోంది. ప్రవాహం ధాటికి క్రమంగా గట్టు



కుంగుతూ కోతకు గురయ్యే ప్రమాదం నెలకొంది. అండర్ టన్నెల్ కూడా శిథిలం కావడంతో నీరు వృథా అవుతున్నాయి.

**మరమ్మతులకు ప్రతిపాదించినా పట్టించుకోలేదు**

గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది పీఏబీఆర్‌కు నీరు ఆశాజనకంగా వచ్చాయి. ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని 42 చెరువులను నింపాలన్న ఉద్దేశంతో నెల రోజులుగా కుడి కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కాలువను ఆధునికీకరించాలని గత ఐదేళ్లలో హెచ్చెల్సీ అధికారులు అప్పటి వైకాపా ప్రభుత్వానికి ప్రతిపాదించినా పట్టించుకోలేదు. పైగా అండర్ టన్నెల్ సమీపంలో కాలువ గట్టుపై కంప విపరీతంగా పెరిగింది. దీనిపై డీఈఈ విశ్వనాథ్‌ను వివరణ కోరగా ఆధునికీకరణకు ప్రతిపాదించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నీటి విడుదల సమయంలో అండర్ టన్నెల్ దగ్గర కొంత మేర మరమ్మతులు చేయించామన్నారు. ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

# నిధుల దుర్వినియోగానికి చెక్

చిత్తూరు : గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడనుంది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వివిధ పన్నులు, రుసుములు, ఇతర పన్నేతర వసూళ్లతో పాటు, అన్ని ఆర్థిక లావాదేవీలు పూర్తిగా ఇకపై డిజిటల్ విధానంలోనే నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలోని 697 గ్రామ పంచాయతీల్లో ఇంటి, నీటి పన్ను ద్వారా ఏటా రూ.70 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. ఇదికాక చెరువుల లీజు, భవన, భూముల క్రమబద్ధీకరణ తదితర రుసుముల ద్వారా రూ.కోట్లలో వస్తుంది. వివిధ పన్నులు, రుసుములు, లీజులు, ఇతర పన్నేతర సొమ్మును కొన్ని పంచాయతీల్లో సిబ్బంది దుర్వినియోగం చేస్తున్నారనే ఫిర్యాదులు పెద్దఎత్తున వస్తున్నాయి. ఇప్పటికే పన్నులను డిజిటల్ మోడ్ యూపీఐ, క్యూఆర్ కోడ్, పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్)




పరికరాల ద్వారా వసూలు చేసే విధానం ఉన్నప్పటికీ పూర్తిగా అమలు కావడం లేదు. అందుకే పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి పూర్తిగా పెట్టేందుకు ఉన్నతాధికారులు సత్వర చర్యలు తీసుకున్నారు.

**డిజిటలైజేషన్‌కు సిద్ధమవుతున్నాం**

పంచాయతీల్లో పన్నులు, పన్నేతర వసూళ్లన్నీ డిజిటల్ విధానంలోనే చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక లావాదేవీల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. డిజిటలైజేషన్ ప్రక్రియను సిద్ధం చేస్తున్నాం.సుధాకర్‌రావు, డీపీవో

## బికినీ కంటే ఘాటుగా శ్రీముఖి గ్లామర్ ట్రీట్

టెలివిజన్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యాంకర్ శ్రీముఖి, ఇప్పుడు తన సోషల్ మీడియాలో గ్లామర్ తో మరింతగా ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఆమె కెరీర్ ప్రారంభంలోనే ఎనర్జిటిక్ యాంకరింగ్‌తో అభిమానులను సంపాదించుకుంది. బుల్లితెరపై వరుసగా రియాలిటీ షోలు, ఈవెంట్ హోస్టింగ్ చేస్తూ, ఆ తర్వాత వెండితెరకు అడుగుపెట్టింది. మొదటి సినిమాలు పెద్దగా విజయవంతం కాకపోయినా, ఆమె యాంకరింగ్‌తో తిరుగులేని క్రేజ్‌ను అందుకుంది. శ్రీముఖి కెరీర్‌లో కీలక మలుపు బిగ్ బాస్ షోతో వచ్చింది. ఈ షో ద్వారా ఆమెకి ప్రేక్షకుల్లో మరింత క్రేజ్ పెరిగింది. సీనియర్ యాంకర్ల సరసన నిలిచేందుకు ప్రయత్నించిన శ్రీముఖి, తన స్టైల్, హాస్యప్రాయం, గ్లామర్ మేకోవర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు టెలివిజన్ ప్రోగ్రామ్స్ తో



పాటు వెబ్ షోలు, ఓటీటీ కంటెంట్, ప్రత్యేక ఈవెంట్లకు హోస్ట్‌గా మారుతూ తన మార్కును కొనసాగిస్తోంది. ఇటీవల శ్రీముఖి తన సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్‌లో శ్రీముఖి బ్లాక్ బీచ్ వేర్ లో స్టన్నింగ్ లుక్‌లో కనిపించింది. బీచ్ బ్రీజ్, సముద్రపు వెన్యూ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తూ ఉంది. మోకాళ్ల వరకూ ఉన్న స్కర్ట్, నెట్ మేస్ టాప్‌తో ఆమె లుక్ మరింత గ్లామర్‌గా కనిపిస్తోంది. శ్రీముఖి స్టైల్‌లోని ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ అభిమానులకు న్యూ ఫీల్ ఇస్తోంది. ఈ ఫోటోలపై నెటిజన్లు పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. 'బికినీ కంటే స్టైలిష్ గా ఉంది', 'ట్రెడిషనల్ యాంకర్ గ్లామర్ డోస్ పెంచింది' అంటూ కామెంట్లు పెడుతున్నారు. శ్రీముఖి సాధారణంగా ట్రెడిషనల్, స్టైలిష్ లుక్స్‌లోనే కనిపించే అలవాటు ఉండగా, ఈసారి మరింత ఘాటుగా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది.

## పాన్ ఇండియా చిత్రంలో స్వాతి!

యంగ్ హీరో నిఖిల్ హీరోగా పాన్ ఇండియాలో స్వయంభు తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. భారీ వార్ ఎపిక్ చిత్రంగా భరత్ కృష్ణమార్య తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా సెట్స్ లో ఉంది. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ కూడా పూర్తయింది. చోళ సామ్రాజ్యానికి సంబంధించిన కథ కావడంతో భారీ వార్ సన్నివేశాలున్నాయి. వందలాంది ..వేలాది మధ్య ఈ వార్ సన్నివేశాలు సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. వెండి తెరపై మరో బాహుబలిని చూస్తామన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ఈసినిమా కోసం నిఖిల్ ప్రత్యేకంగా కత్తి యుద్ధం, గుర్రపుస్వారీలో తర్ఫీదు పొందాడు. ఇందులో నిఖిల్ కి జోడీగా సంయుక్తా మీనన్, నభానటేష్ నటిస్తున్నారు. వాళ్లపైనా కీలక సన్నివేశాలున్నాయి. సినిమా కోసం వారు కూడా వార్ సన్నివేశాలకు సంబంధించి కొంత ట్రైనింగ్ కూడా తీసుకున్నారు.



ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు కూడా చేరుకుంది. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. ఇందులో ఓ కీలక పాత్రకు కలర్స్ స్వాతిని ఎంపిక చేసారట. అమ్మడు ఇందులో ఓపవర్ ఫుల్ పాత్రలో కనిపించనుందట. చిత్రీకరణ ముగింపు దశలో స్వాతి పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి ఆ పాత్రకు ఓ కొత్త నటిని తీసుకోవాలనుకున్నారట. కానీ ఆ పాత్రకు స్వాతి కూడా సెట్ అవుతుందని భావించి అమెని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది. అదే నిజమైతే స్వాతి ఎంట్రీ వెనుక నిఖిల్ ఉన్నట్లే . ఇద్దరు మంచి స్నేహితులు. గతంలో కార్తికేయ లో కలిసి నటించారు. ఈ నేపథ్యంలోనే స్వాతికి సినిమా ఛాన్స్ ఈజీగా వచ్చినట్లు తెలుస్తోంది. మరి ఆమె ఎంపికలో నిజమెంతో మేకర్స్ ధృవీకరించాల్సి ఉంది. ప్రస్తుతం స్వాతి సినిమాల్లో నటించలేదు. ఆమె సినిమాలు చేసి రెండేళ్లు అవుతుంది. మరి అవకాశాల రాక చేయలేదా? వచ్చి చేయలేదా? అన్నది తెలియదు గానీ స్వయంభు మాత్రం మంచి కంబ్యాక్ సినిమా అవుతుంది.




## బాత్ టబ్‌లో చేప కళ్ల ప్రణీత




అత్తారింటికి దారేది, బావ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం ప్రణీత సుభాష్. ఈ బ్యూటీ నితిన్ రాజు అనే బిజినెస్ మేన్ ని పెళ్లాడిన సంగతి తెలిసిందే. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. ప్రణిత - నితిన్ 2021లో కోవిడ్-19 మహమ్మారి సమయంలో వివాహం చేసుకున్నారు. 2022లో వారి మొదటి బిడ్డకు, అలాగే 2024లో రెండో బిడ్డకు జన్మనిచ్చింది ప్రణీత.

ప్రణీత వివాహం తర్వాత నటవృత్తి నుండి విరామం తీసుకుంది. 2024లో తిరిగి కెరీర్ జర్నీని ప్రారంభించింది. మలయాళ చిత్రం థంకమణి , కన్నడ చిత్రం రమణ అవతారలో నటించింది. 2021లో చివరిగా హిందీ చిత్రం భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియాలో కనిపించింది. తెలుగులో బావ చిత్రంతో ప్రణీత కథానాయికగా అడుగుపెట్టింది. ఆ తర్వాత అత్తారింటికి దారేది లాంటి బ్లాక్ బస్టర్లో నటించింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు లోను ప్రణీత నటించింది. ఈ బ్యూటీ తాజాగా ఎక్స్ క్లూజివ్ ఫోటోషూట్ ని ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ ఫోటోషూట్ లో ప్రణీత బాత్ టబ్‌లో సంథింగ్ స్పెషల్ గా కనిపించింది. ప్రణీత డిజైనర్ ఫ్రాక్ లో ముగ్ధ మనోహర రూపంతో కట్టిపడేసింది. అందుకు సంబంధించిన ఫోటోషూట్ ఇప్పుడు వైరల్ గా మారుతోంది. తాజాగా ప్రణీత లూయిస్ వీట్టన్ తో భారీ డీల్ కుదుర్చుకున్నానని చెప్పింది.

ఈ బ్రాండ్ తో మొదటి అనుబంధం.. మా LOలతో మొదటి వాలెంటైన్స్ డే వేడుక అని ప్రణీత వ్యాఖ్యను జోడించింది. ప్రస్తుతం ప్రణీత ఎక్స్ క్లూజివ్ ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి.

## కిరణ్ అబ్బవరం దిల్ రూబా రిలీజ్ డేట్ లాక్ చేశారోచ్..!




క సినిమా హిట్ తో కెరీర్ లో సూపర్ కాన్ఫిడెన్స్ తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం తన నెక్స్ట్ సినిమా దిల్ రూబాతో రాబోతున్నాడు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇంప్రెస్ చేసింది. దిల్ రూబా టీజర్ తోనే ఆడియన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేసుకుంది. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం సరసన రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తుంది. లవ్ స్టోఈ విత్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ సినిమా వస్తుందని తెలుస్తుంది. ఒక సినిమా హిట్ కొట్టిన వెంటనే నెక్స్ట్ రాబోతున్న సినిమా మీద అంచనాలు భారీగా ఉంటాయి. ఐతే ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా దిల్ రూబా ఉంటుందని తెలుస్తుంది. కిరణ్ అబ్బవరం ఈ సినిమా మీద సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నట్టు తెలుస్తుంది. ఇక లేటెస్ట్ గా ఈ సినిమా రిలీజ్ డేట్ ని లాక్ చేశారు మేకర్స్. మార్చి 14న దిల్ రూబా రిలీజ్ ఫిక్స్ చేశారు. మార్చి రెండో వారం అంటే సినిమాకు మంచి రిలీజ్ డేట్ దొరికినట్టే లెక్క. దిల్ రూబా లో కిరణ్ అబ్బవరం కొత్తగా కనిపిస్తున్నాడు. ఈ సినిమాతో యాక్షన్ హీరోగా కూడా కిరణ్ క్రేజ్ తెచ్చుకునేలా ఉన్నాడు. కిరణ్, రుక్సర్ జోడీ కూడా సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచేలా ఉంది. విశ్వ కరుణ్ దిల్ రూబా సినిమాను చాలా బ్రిలియంట్ గా ఆడియన్స్ ని మెప్పించేలా తెరకెక్కించారని అంటున్నారు. దిల్ రూబా సినిమాను శివమ్ సెల్యులాయిడ్స్ బ్యానర్ లో రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సరెగమ కలిసి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సామ్ సిఎస్ మ్యూజిక్ అందిస్తున్నారు. క తో హిట్ టాక్ ఎక్కిన కిరణ్ అబ్బవరం దిల్ రూబాతో కూడా ఆ సక్సెస్ మేనియా కొనసాగించాలని చూస్తున్నారు. మార్చి 14న రిలీజ్ కాబోతున్న ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. దిల్ రూబా సినిమా టీజర్ రిఫ్రెషింగ్ గా ఉండగా సినిమా అంచనాలను అందుకుంటుందా లేదా అన్నది రిలీజ్ నాడు తెలుస్తుంది. కిరణ్ అబ్బవరం దిల్ రూబా టీజర్ తోనే ఆడియన్స్ లో డిస్కషన్ మొదలుకాగా ఈ క్రేజ్ సినిమా రిలీజ్ టైం కు మరింత పెరిగేలా ఉంది.

## శ్రీలీల తో లిప్ కిస్సులు...ఇంటిమేట్ సీన్సా?

యంగ్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ కన్ఫమ్ అయిన సంగతి తెలిసిందే. అమ్మడికి హిట్ ఫ్రాంచైజీ ఆశికీ 3 లో నటించే ఛాన్స్ వరించింది. ఇందులో కార్తీక్ ఆర్యన్ కి జోడీగా నటస్తుంది. అనురాగ్ బసు తెరకెక్కి స్తున్నాడు. ఫాంలో ఉన్న బాలీవుడ్ భామలందర్నీ కాదని మరీ శ్రీలీలను హీరోయిన్ పాత్రకు ఎంపిక చేసారు. పుష్ప లో కిసిక్ పాటతో అమ్మడు పాన్ ఇండియాలో గుర్తింపు దక్కించుకుంది. ఇప్పుడా క్రేజ్ హీరోయిన్ గా ప్రమోట్ చేసింది. ఇంతవరకూ బాగానే ఉంది. ఇప్పటివరకూ శ్రీలీల రొమాంటిక్ సన్నివేశాల్లో నటించలేదు. చేసింది తెలుగు సినిమాలే కాబట్టి అలాంటి ఛాన్స్ కూడా రాలేదు. లిప్ లాక్... ఇంటిమేట్ సీన్లు...బికినీ సీన్లు వంటివి చేసింది లేదు. కానీ ఆశికీ3 అంటే రొమాంటిక్ స్టోరీ. బ్యూటీ ఫుల్ లవ్ స్టోరీతో పాటు రొమాంటిక్ సన్నివేశాలకు అనురగ్ బసు పెద్ద పీట వేస్తాడు. లిప్ లాక్ ఇంటిమేట్ సీన్లు లేకుండా ఆశికీ ఫ్రాంచైజీనే లేదు.



అందులోనూ ఇప్పటి యువతని కనెక్ట్ చేస్తూ చేయాల్సిన చిత్రమిది. దీంతో సినిమాలో లెక్కకు మిక్కిలి రొమాంటిక్ సన్నివేశాలు..ఇంటిమేట్ సీన్స్ ఉంటాయనే ప్రచారం ఇప్పటికే బాలీవుడ్ మీడియాలో జరుగుతోంది. దీంతో కార్తీక్ ఆర్యన్ తో శ్రీలీల అలాంటి సన్నివేశాల్లో నటించడానికి అన్ని రకాలుగానూ సిద్ద పడాల్సి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ప్రేమలో ఘాడతను చెప్పే క్రమంలో బాలీవుడ్ చిత్రాల్లో ఇలాంటి సన్నివేశాలు సహజంగానే ఉంటాయి.

అందులోనూ నేటి ట్రెండ్ ని అనుసరించి చేయాల్సిన సన్నివేశాలు కాబట్టి మరింత జోష్ గా శ్రీలీల ఆయా సన్నివేశాల్లో నటించాల్సి ఉంటుంది. రొమాంటిక్ ఎక్స్ ప్రెషన్స్ ఇవ్వడం అన్నది శ్రీలీలకు కొట్టిన పిండి. తానెంత బోల్డ్ అన్నది కిసిక్ పాటతోనే ప్రూవ్ చేసింది. ఈనేపథ్యంలో ఆషికీ 3 లో అలాంటి సన్నివేశాలు శ్రీలీకు పెద్ద విషయం కాదన్నది కాదనలేని నిజం.

## ఇతరుల కారణంగా పెళ్లితో బుక్కయ్యే యువతి కథ

పెళ్లి, పెళ్లి తర్వాత జీవితంలో మార్పులు అనూహ్యమైనవి. కెరీర్ లో సెటిలయ్యే క్రమంలోనే పెళ్లి టైమ్ వచ్చేస్తుంది. ఆఫీస్‌లో సహెూద్యోగులు, ఇంట్లో వాళ్లు పెళ్లాడాలని నిరంతరం ఒత్తిడి చేస్తూనే ఉంటారు. అలాంటి ఒత్తిళ్ల కారణంగా పెళ్లి చేసుకున్న యువతి జీవితంలో ఏం జరిగింది? అనేదానిని పెద్ద తెరకెక్కిస్తున్నారు. అద్భుతమైన కామిక్ టైమింగ్, బోల్డ్ పెర్ఫామెన్సెస్ తో ఆకట్టుకునే రిచా చద్దా ఇలాంటి పాత్రలో నటిస్తే ఎలా ఉంటుందో అభిమానులకు చెప్పాల్సిన పని లేదు. ఆఖ్రి సోమవార్ పేరుతో ఈ సినిమాని రిచా స్వయంగా నిర్మిస్తున్నారు. రచయితగా, నిర్మాతగా ఈ సినిమాకి తాను పని చేస్తున్నానని రిచా చద్దా తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి దర్శకుడిని ఖరారు చేయాల్సి ఉంది. ఇది ఒక రొమాంటిక్ డ్రామా. తన సహెూద్యోగులు, తల్లిదండ్రుల నుండి వివాహం చేసుకోవాలనే ఒత్తిడిని ఎదుర్కొనే ప్రఖ్యాత టీవీ నిర్మాత చుట్టూ కథ తిరుగుతుందని రిచా చెప్పారు. పెద్దల అంచనాలు, సంబంధాలు వ్యక్తిగత ఆకాంక్షలను



ఎలా నాశనం చేస్తాయో కూడా ఈ సినిమాలో చూపించనున్నారు. తన బంధువులు, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు చేసుకోవడం చూశానని, అవన్నీ చూశాక ఈ ఆలోచన వచ్చిందని, ఈ సినిమా కథ హార్ట్ టచింగ్ గా ఉంటుందని రిచా వెల్లడించారు. కాలేజ్ లైఫ్ ముగిశాక జీవితం ఎలా మారుతుందో కూడా తెరపై చూపిస్తామని తెలిపారు. ఓవైపు కెరీర్ కావాలి.. మరోవైపు భర్త, కుటుంబం కావాలి. ముప్పై వయసుకే కలలు నెరవేరక తీవ్రంగా నిరాశపడి విసిగిపోతారు!! అంటూ రిచా నేటి యువతరం అనుభవాల గురించి ప్రస్థావించారు. ప్రేమ, పెళ్లిపై కొత్త ధృక్పథాన్ని తేవాలనే లక్ష్యంతో ఈ సినిమా చేస్తున్నానని రిచా అన్నారు. వివాహం, సంబంధాలను ఈ సమాజం ఎలా చూస్తుందో ఈ సినిమాలో చూడొచ్చు. అదే సమయంలో వినోదాత్మకంగా ఉంటూనే ఆలోచింపజేసే కథనంతో రక్తి కట్టిస్తుందని రిచా చెబుతున్నారు. నిజ జీవితంలోని పోరాటాల నేపథ్యంలో ఈ సినిమా ఆకట్టుకుంటుందని భరోసానిస్తున్నారు. గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్, హీరామండి, ఫుక్రీ, సెక్షన్ 375 లాంటి ప్రయోగాత్మక చిత్రాలలో ముఖ్య పాత్రలతో రిచా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536